# శ్రీసూక్త - పురుషసూక్త - మంత్రపుష్ప రహస్యార్థము



వ్యాఖ్యాత:

బ్రహ్మశ్రీ యల్లంరాజు శ్రీనివాసరావు

# శ్రీ సూక్త - పురుష సూక్త

# మంత్రపుష్ప - రహస్యార్ధము

వ్యాఖ్యాత

సాహిత్య విద్యా ప్రవీణ - వేదాంత విద్యా ధురీణ

యల్లంరాజు శ్రీనివాసరావు, M.A.

Brahmasri Yallamraju Srinivasa Rao
www.advaitavedanta.in

# విషయసూచిక


పూర్వోక్తము ........................................................ 4

1. శ్రీ సూక్త - మంత్రార్థము ........................................ 8

2. పురుష సూక్త మంత్రార్థము ........................................ 57

3. మంత్ర పుష్ప మంత్రార్థము ........................................ 121

అపరోక్తము ........................................................ 173


Yallamraju Srinivasa Rao
Brahmasri
www.advaitavedanta.in

# పూర్వోక్తము

శ్రీ సూక్తమూ - పురుష సూక్తమూ - మంత్ర పుష్పమూ - ఇవి మూడూ పంచ సూక్తాలలో చాలా ముఖ్యమైన సూక్తాలు. సూక్తమంటే సుభాషితం. బాగా చక్కగా చెప్పబడినది Well Said అని అర్థం. అయితే శాబ్దికంగానే చెవిన బడ్డా - మనం దాన్ని వల్లించినా పారాయణం చేసినా ప్రయోజనం లేదు. ఆర్థికంగా దాన్ని మనసుకు పట్టించుకొంటే సూక్తమనే మాట మన పట్ల సార్థక మవుతుంది. ఈ అర్థం కూడా కేవలం ప్రతి పదార్థమే అయితే మరలా సుఖం లేదు. బాహ్యార్థాన్ని దాటి అంతరార్థం వరకూ ప్రయాణం చేయాలి. అది చివరకు పరమార్థాన్నే అందించాలి మనకు. అప్పుడే సూక్త పాఠం సంపూర్ణంగా చరితార్థ మవుతుంది. మనమూ కృతార్థుల మవుతాము.

కాని నేనిప్పటికి 30-40 సంవత్సరాల నుంచీ చూస్తున్నాను. ఈ మూడింటినీ దేవాలయాల దగ్గరి నుంచీ మన ఇండ్లలో జరిగే వివాహాది శుభకార్యాల వరకూ అర్చక స్వాములూ పురోహితులూ గుక్క తిప్పుకోకుండా వల్లిస్తుంటారే గాని వారి కీషత్తైనా తాము వల్లించే మంత్రాల కర్థం తెలిసినట్టు నాకే మాత్రమూ తోచటం లేదు. శ్రౌతమూ

Valamraju Srinivasa Rao
www.advaitavedanta.in

స్మార్తమూ రెండూ తమ గురువుల దగ్గర చెప్పుకొంటున్నారే గాని చాలామంది శ్రోత్రియులు వాటి ఉచ్చారణ వరకే తప్ప విడిచి అర్థజ్ఞానం వైపు దృష్టి మళ్లించటం లేదు. వేద భాష్యమంతో ఇంతో పరిశీలించిన వారు కూడా మంత్రాలకు వాచ్యార్థమే చెప్పగలరు గాని లక్ష్యార్థం దాకా దృష్టి పెట్టరు. అదే కరువయి నప్పుడు ఇక పరమార్థం మాట చెప్పేదేముంది. అది మరీ దూరాపాస్తం.

వీరి పరిస్థితే ఇలా ఉంటే ఇక భాషా జ్ఞానమూ శబ్దార్థ పరిజ్ఞానమే లేని మామూలు పారాయణ పండితుల సంగతి తడవనే పని లేదు. సంధ్యా వందన విషయ మెలాంటిదో ఇదీ అలాంటిదే. ఏదో యాంత్రికంగా మొక్కుబడి తీర్చినట్టు వల్లిస్తుంటారే గాని ఉచ్చారణ కూడా సరిగా ఉండదు. సరిగా లేకపోగా ఎవరో వెనకాల నుంచి తరుముకొని వచ్చినట్టు బ్రహ్మాండమైన వేగంతో ఒకరితో ఒకరు పోటీపడి చదువుతుంటారు. ఆ చదవటంలో ఎన్నో శబ్దోచ్చారణ దోషాలు కొంచెం సంస్కృత జ్ఞానమున్న నాబోటి వాడికే కొట్ట వచ్చినట్టు కనిపిస్తుంటాయి.

ఇంతెందుకు. మంత్ర పుష్పం చదువుతున్నప్పుడు చాలామంది పురోహితులు చేసే ఒకటి రెండు పొరబాటు లుదాహరిస్తాను. గమనించండి. నీలతోయదమధ్యస్థా విద్యుల్లేఖేవ అని ఉంటే అక్కడ - మధ్యస్థా ద్విద్యులేఖేవ అని ఉచ్చరిస్తారు. అలాగే అణీయోర్ధ్వా వ్యవస్థితా

అని దీర్ఘాంతమైతే దాన్ని వ్యవస్థితః అని విసర్గాంతం చేసి పలుకుతారు. అణీయా అనేది స్త్రీ లింగం. దాని విశేషణం వ్యవస్థితా అని ఉండాలి. పోతే పరమాత్మా అన్నప్పుడది పుల్లింగం. అక్కడ దాని విశేషణం వ్యవస్థితః అని ఉండాలి. అలా కాక రెండింటినీ వ్యత్యస్తం చేసి ఉచ్చరిస్తారీ పంతులు గార్లు. ఇది నేను వారి నాక్షేపించటానికి గాదు. ఇప్పటికైనా కొంత మంచి పాఠమేదా అని చూచి - తమకు తెలియకపోతే ఎవరైనా భాషాభిజ్ఞులతో పరిచయముంటే వారి నడిగి తమ తప్పు దిద్దుకోమని నా సలహా.

ఇలాగా ఉచ్చారణ దోషాలు కొన్ని సరిదిద్దటానికీ - దానికంటే కూడా ముఖ్యంగా ఈ సూక్త త్రయంలో నిగూఢంగా ఉన్న అంతరార్థమేమిటో అది మన జీవితానికి గమ్యమైన పరమార్థాన్ని ఎలా ప్రసాదిస్తుందో - అదీ పాఠక లోకానికి యథాశక్తిగా వివరిస్తే బాగుండునని - నేనీ వ్యాఖ్యానానికి పూనుకొన్నాను. అసలు నా వరకు నాకీ సూక్తత్రయమేమి చెబుతున్నదీ - అది నాకు జీవిత పరమార్థాన్ని ఎలా బోధిస్తున్నదీ - లోతుకు దిగి ఆ రహస్యాన్ని పట్టుకోవాలని కుతూహలం. అది నాలోనే సమసి పోక పదిమంది జిజ్ఞాసువులూ పంచుకొని దాన్ని తామూ ఆకళించు కోగలిగితే చూడాలని ఆకాంక్ష.

ఈ గొప్ప సంకల్పంతోనే శ్రీ సూక్తం మొదలు మంత్రపుష్పం వరకూ వాటి రహస్యార్థాన్ని వివరించాలని మంత్రాలను వ్యాఖ్యానిస్తూ వచ్చాను. వ్యాఖ్యానం వ్రాసేటప్పుడక్కడా పూర్వులు రచించిన అర్థ తాత్పర్యాలు కొంత తోడ్పడినా ప్రధానంగా నాకు మొదటి నుంచీ అలవడిన అద్వైత విజ్ఞాన బలమే చివరదాకా ప్రేరణ ఇస్తూ వచ్చింది. ఇంతకూ నాకున్న అల్పమైన సంస్కృత భాషా జ్ఞానమూ - తర్క వేదాంత విజ్ఞానమూ - లోకానుభవమూ - దీని ద్వారా సద్వినియోగమైతే అదే నాకు పదివేలు. అన్నిటినీ మించి సకల మంత్రాలకూ అధి దేవత అయిన ఆ పరమాత్మ చైతన్య శక్తి నా మనసులో చేరి నన్ను ముందుకు నడిపితే - అదే మీ అందరికీ నాద్వారా సంతృప్తిని ప్రసాదిస్తే - అంతకన్నా లక్ష రెట్లు కోటి రెట్లు మహానందం నాకు.

ఇతి

**శ్రీ పురుషోత్తమ సేవాభిలాషీ**

**శ్రీనివాస మనీషి**

Yallamraju Srinivasa Rao
Brahmasri
www.advaitavedanta.in

# శ్రీ సూక్త - మంత్రార్థము

మనమింతకు ముందు సంధ్యా వందన వ్యాజంతో గాయత్రీ మంత్రార్థం చెప్పుకొన్నాము. పోతే ప్రస్తుతం దానికి సహోదరమైన శ్రీ సూక్త మంత్రార్థం చెప్పుకోవలసి ఉన్నది. ఏది గాయత్రి అంటున్నామో అదే శ్రీ. ఏది శ్రీ అంటున్నామో అదే గాయత్రి. రెంటికీ తేడా లేదు. శ్రీ అంటే ఆశ్రయించేది అని అర్థం. ఏది ఆశ్రయించింది. దేన్ని ఆశ్రయించింది. పరమాత్మ చైతన్యాన్ని ఆయన శక్తి ఆశ్రయించింది. నిత్యమూ అంటి పట్టుకొని ఉన్నది. దాన్ని విడిచి ఇది లేదు. దీన్ని విడిచి అది లేదు. రెండింటికీ అవినాభావ సంబంధం. శక్తి శక్తి మతోర భేదః అన్నారు. శక్తికీ ఆ శక్తిని ధరించిన వాడికీ భేదం లేదు. సూర్యుడికీ ఆయన ప్రకాశానికీ భేదముందా. అలాగే శివశక్తులకు అంతరం లేదు. శివ స్వరూపాన్ని ఎప్పుడూ అంటి పట్టుకొని కూచున్నది కనుకనే

Brahmasri Yallamraju Srinivasa Rao
www.advaitavedanta.in

శక్తిని శ్రీ అన్నారు. ఆ శ్రీ అక్కడే కూచోక మనదాకా గానం చేస్తూ వచ్చి - దాన్ని గానం చేస్తూ పోతే మనలను మరలా అక్కడికి తీసుకుపోయి చేరుస్తుంది కాబట్టి దానినే గాయత్రి అన్నారు.

అయితే ఇప్పుడీ శ్రీ ఆశ్రయించిన ఆ తత్త్వమేమిటి. అది ఎలా ఉంది. దీని ద్వారా దాన్ని వాటేసుకొంటే మనకు దానివల్ల కలిగే ఫలమేమిటని ప్రశ్న. ఆ తత్త్వమేదో గాదు శివతత్త్వం. శవం కాని దేదో అది శివం. అన్నిటికీ మూలభూతం కాబట్టి ఎప్పుడూ ఉండేదది. ఎప్పుడూ ఉంటుంది గనుకనే అది మృత్యుంజయం. మృత్యువును జయించినది. మృత్యువంటే ఒకప్పుడుండి ఒకప్పుడు లేకపోవటం. ఎప్పుడూ ఉన్నప్పుడిక లేకపోవటమనే ప్రశ్నేముంది. సత్యమనేది ఎప్పుడూ సిద్ధమే గాని సాధ్యం కాదు. సిద్ధమంటే మనం సాధించక పూర్వమే ఉన్నదని అర్థం. అందుకనే సత్యమని పేర్కొన్నారు దాన్ని. సత్ అంటే ఉండటమని అర్థం ఏది ఉన్నదో అది ఎప్పుడూ ఉంటుంది. కనుకనే దానికి మృత్యువు లేదు. మృత్యువంటే లేకపోవటమే గదా. ఎప్పుడూ ఉందని చెబుతూ దానికి మృత్యువని చెబితే అది పరస్పర విరుద్ధం. అంచేత అది శివం సత్యం. మృత్యుంజయ మైనదా పరతత్త్వం.

అలాటి తత్త్వాన్ని మన అనుభవానికి తెచ్చే సాధనమది శ్రీ అని చెప్పు. గాయత్రి అని చెప్పు. ఏ పేరైనా పెట్టు. అది దానితో అవినా

Yellamraju Srinivasa Rao www.advaitam.in

భావంగా ఉన్న పరాశక్తే. ఆ శక్తి మనకు దూరంగా అక్కడ ఎంత ఉన్నదో అదే మనలో కూడా తిష్ఠ వేసుకొని ఉన్నది. యదేవేహ తదముత్ర - యదముత్ర తదన్విహ అని ఉపనిషత్తులే చాటుతున్నాయి. అయితే మనలో కూడా ఉందంటున్నారే ఏ రూపంలో ఉందది మనలో. విమర్శరూపంగా ఉంది. మానవుడొక్కడే విమర్శించగలడు. ఈ విమర్శ అంతకంతకు సాగుతూ పోయి ఎక్కడ ఆగిపోతుందో అక్కడ ఆ చైతన్య ప్రకాశం పరిపూర్ణంగా మనకు సాక్షాత్కరిస్తుంది. విమర్శ లేనంత వరకూ ప్రకాశమక్కడే ఉన్నా మనకు స్ఫురించదు. వస్తు సిద్ధమే గాని అది బుద్ధి సిద్ధం కాదు. బుద్ధి సిద్ధమయితే గాని అనుభవ మనిపించుకోదు. బ్రహ్మవేద బ్రహ్మైవ భవతి అన్నారు. శ్రీ విద్య ద్వారా దానికి వేద్యమైన మృత్యుంజయ తత్త్వాన్ని పట్టుకొంటే మనం కూడా మృత్యుంజయులమే కాగలం. అలాటి పూర్ణానుభవాన్ని మనకు ప్రసాదించే దెప్పటికైనా ఈ శ్రీ విద్యే. దీనికే శ్రీ సూక్తమని నామాంతరం.

శ్రీ అనే దానికి పర్యాయ పదమే లక్ష్మి అనే మాట. లక్షయ తీతి లక్ష్మీః అని లక్ష్మి శబ్దానికి వ్యుత్పత్త్యర్థం. లక్షింప జేసేదేదో అది లక్ష్మి. లక్షింప జేయటమంటే చూపటం. చూపాలంటే ఎక్కడికి వచ్చి చూపాలది. మనదాకా క్రిందికి దిగి వచ్చి మనకా పరతత్త్వాన్ని చూపాలి. దిగి రాక ముందది ఏమిటి. శ్రీః - ఆ తత్త్వాన్ని ఆశ్రయించి ఉంటుంది. అప్పుడు

Yallamraju Brahmasri Srinivasa Rao
www.advaitavedanta.in

చూపలేదు. కారణం మనం దానికి దూరంగా ఉన్నాము. కాబట్టి మన దగ్గరికి రావాలి. అలా వచ్చి మనకు దూరంగా ఉన్న దాన్ని దగ్గరికి తెచ్చి చూపాలి. ఆ వచ్చినప్పుడది లక్ష్మి అవుతుంది. దూరంగా ఉంటే శ్రీ. దగ్గరికి వస్తే లక్ష్మి. దగ్గరికి వచ్చినట్టేమిటి దాఖలా. అదే ఈ నామరూపాత్మకమైన ప్రపంచం. ఇది పరమాత్మ తాలూకు విభూతి. విభూతే గదా లక్ష్మి. ఈ విభూతే ఆ విభువును చూపే లక్ష్మి. తద్వారా మన బుద్ధుల నక్కడ చేరిస్తే అప్పుడదే శ్రీ.

లక్ష్మి ఎంత చూపేదైనా నీకా మూలతత్త్వాన్ని అందుకొందామనే దీక్ష లేకపోతే చూపదు. నీ దృష్టిని బట్టి నీకది ఆలంబన మవుతుంది. నీ కైహికమైన కోరికలుంటే అది నీకు వరలక్ష్మి అవుతుంది. అందులో సిద్ధి కావాలంటే సిద్ధి లక్ష్మి అవుతుంది. జయం కావాలంటే జయలక్ష్మి అవుతుంది. విద్యలన్నీ సాధించాలని కోరితే సరస్వతి అవుతుంది. ధనధాన్యాది భోగాలు కావాలంటే శ్రీలక్ష్మి అవుతుంది. ఈ శ్రీ ఆ శ్రీ కాదు. ఐహికమైన సంపద. పోతే ఇవన్నీ కావని త్రోసి పుచ్చి కేవల మాముష్మికమైన మోక్షమే కావాలని ముముక్షువువై సేవిస్తే అది నీకప్పుడు మోక్షలక్ష్మి అయి నీవు కోరిన మోక్ష పదవినే అందిస్తుంది. అప్పుడది అసలైన శ్రీ. అందుకే సిద్ధి లక్ష్మి దగ్గరి నుంచీ మోక్షలక్ష్మి వరకూ అన్ని లక్ష్ములను ఏకరువు పెడుతున్నది శ్రీ సూక్తం.

Yallamraju Srinivasa Rao
Brahmasri
www.advaitavedanta.in

అయితే వివేకవంతుడైన మానవుడెప్పుడూ మోక్షలక్ష్మినే పట్టుకొని ఊర్ధ్వముఖంగా ప్రయాణం సాగించాలి. అలా సాగిస్తే అదే గాక దానికి దిగువ నున్న మిగతావి కూడా అప్రయత్నంగా లభిస్తాయి. అలాకాక వీటిలో ఏ ఒక్కదానికి ప్రయత్నించినా అది మాత్రమే ప్రాప్తిస్తుంది గాని తతిమావి ప్రాప్తించవు. కర్తవ్యో మహదాశ్రయః అన్నారు పెద్దలు. అంచేత అలాటి మోక్ష ఫలాన్ని మనసులో పెట్టుకొని తత్పరంగానే మన మీ శ్రీ సూక్తాన్ని వ్యాఖ్యానిస్తూ పోవట మెంతైనా శ్రేయస్కరం. అదే ప్రస్తుతం నేను అవలంబిస్తున్న విధానం. ముముక్షువైన మానవుడా పరమ పురుషుణ్ణి ఇలా ప్రార్థిస్తున్నాడు వినండి.

**ఓమ్ - హిరణ్య వర్ణాం హరిణీం - సువర్ణ రజత స్రజామ్**

**చంద్రాం హిరణ్మయీం లక్ష్మీం - జాత వేదో మమావహ -**

ఓంకారంతో ప్రారంభవుతున్నది మంత్రం. ఈ మంత్రమే గాదు. ఏ మంత్రమైనా ఇంతే. ఓంకారమే ఆది. ఓంకారమే అంతం. ప్రణవ శ్ఛందసా మివ అన్నారు. వేద వాఙ్మయాని కంతటికీ ప్రాణ మోంకారమే. అసలు వేదమేమిటి. లోకమేమిటి. అంతా ఓంకార మయమే నన్నది మాండూక్యం. ఏమిటర్థం. ఓమంటే సోహం. అది శబ్దం. శబ్ద వికారమే సర్వం. ఎలాగ. శబ్దమంటే స్పందన చలనం. చలనాత్మకమే గదా ప్రపంచమంతా. ఈ చలన మెక్కడి నుంచి వచ్చింది. సః ఆ పరమాత్మ

Vallamraju Srinivasa Rao
www.advaitavedanta.in

నుంచి వచ్చింది. అది అచలం. అచలం నుంచే చలన మేర్పడుతుంది. కనుక ఈ అహం దాన్ని పట్టుకొని పోతే సః ఆ అచలమైన తత్త్వాన్నే చేరుస్తుంది. ఇది సోహం లేదా ఓమ్మనే మాటలో ఇమిడి ఉన్న అంతరార్థం.

అది హిరణ్య వర్ణ. హిరణ్యమంటే బంగారం. తేజస్సుకు సంకేతం. తేజస్సిక్కడ చైతన్య ప్రకాశం. దాని నాశ్రయించిన పరాశక్తిది కూడా అదే వర్ణం. అదే ప్రకాశం. కనుక హిరణ్య వర్ణ ఆ చిచ్ఛక్తి. అయితే అది మన పాలిటికి హరిణి కాగూడదు. శ్రయిణి కావాలి. శ్రయిణి అంటే దాన్ని ఆశ్రయించి ఉండేది. అదే శ్రీ. దాన్ని పట్టుకొంటే దాని ద్వారా మనమూ ఆ పరతత్త్వాన్నే ఆశ్రయిస్తాము. అలా కాక హరిణిగా పట్టుకొంటే అది మన బుద్ధులను హరిస్తుంది. అప్పుడది మన పాలిటికి హ్రీ అవుతుంది. హ్రీ అంటే హరించేది. లాగేసేదని అర్థం. లాగేస్తే ఏమిటి ప్రమాదం. **సువర్ణ రజత స్రజామ్.** సువర్ణ రజతాలనే దండలు దండలుగా ధరించి తదాకారంగా మనకు భ్రమ గొలిపి వాటి వైపే మన బుద్ధుల నాకర్షిస్తుంది. సువర్ణ రజతాలంటే బంగారమూ వెండి. వెండి బంగారాలలాగా ఆకర్షించేవేవో గావు. ఈ నామరూపాలే. ఇవి తమ వైపు త్రిప్పుకొని పరమాత్మకు మనలను దూరం చేస్తాయి. అవీ కావలసిందే జీవితానికి. అవే కాదు జీవిత పరమార్థం. జీవిత పరమార్థం మానవుడికి మోక్షం. కేవలమీ వరలక్ష్మిని గాక అలాటి మోక్షలక్ష్మిని ప్రసాదించాలి మనకు. ఎవరు ఎవరికి ప్రసాదించాలంటారు. **జాత**

**వేదః మమ ఆవహా.** ఓ జాత వేదా నాకు ఇవ్వమని అడుగుతున్నాడు మానవుడు. వేదమంటే జ్ఞానం. జాతమంటే అది తనకు సహజంగానే ఉన్నవాడు. ఎవడు. అగ్ని దేవుడా కాదు. ఆ ఉపాధిలో కనిపించే పరమాత్మ. అగ్ని అనేది ఇక్కడ గార్హ పత్యాగ్ని. గృహస్థు లైన బ్రహ్మ క్షత్రాదు లందరూ ప్రతి దినమూ సేవించేది. సేవిస్తే ఈ గృహపతుల కోరికలది ఫలింప జేస్తుంది. అగ్ని భౌతికమైతే దాని కధిదేవత అగ్ని దేవుడు. దాని కధిపతి దేవ దేవుడు పరమాత్మ అది ఈ దేవత ద్వారా నీకైహికమైన భోగమూ దాన్ని కూడా దాటి భావిస్తే మోక్షమూ రెండూ ప్రసాదిస్తుంది. రెండూ దాని ఉపాధులే Media. దానికెప్పుడూ చైతన్యమనేది సహజం. పరాస్యశక్తిః స్వాభావికీ అని చాటుతున్న దుపనిషత్తు. అలాటి ప్రజ్ఞాన స్వరూపుడైన పరమాత్మ నాకీ అగ్నిహోత్రుడి ద్వారా అందివ్వాలని ప్రార్థన.

ఏమిటా అందివ్వ వలసినది. **చంద్రాం హిరణ్మయీం లక్ష్మీం -** లక్ష్మి నందివ్వాలట. లక్షింప జేసేది లక్ష్మి అని గదా చెప్పాము. ఆ పరతత్త్వాన్ని లక్షింప జేసే తదాకార వృత్తి నీ సాధకుడి కివ్వాలది. ఎలాంటిదా వృత్తి. హిరణ్మయి. బ్రహ్మాకార వృత్తి గనుక బ్రహ్మ మెలా ఉందో అలాంటిదే. బ్రహ్మం హిరణ్య రూపం. అంటే ప్రకాశ శీలమైనది. కనుక ఇది దానిలాగే ప్రకాశాత్మకమే కావాలి. అంతే కాదు. చంద్రాం. చంద్రుడి లాగా స్వచ్ఛమైనది. సౌమ్యమైనది. ఎలాటి నామరూప వాసనా

మాలిన్యమూ లేనిది. అలాటి అఖండాకార వృత్తిని మమ ఆ వహ - నా మనసులో ప్రవేశ పెట్టు. ఎవడా పెట్టవలసిన వాడు. జాతవేదః - మనం రగులు కొల్పిన అగ్ని హోత్రమా. లేక దాని నధిష్ఠించిన అగ్ని అనే దేవతా. అది భూతం. ఇది శక్తి. భూతం దాని పాటికది అచేతనం. దేవత చేతనమైనా పరిచ్ఛిన్నమైన శక్తి విశేషం. కనుక వాటి ద్వారా మన మనసుకా స్ఫూర్తి నివ్వవలసినదా పరిపూర్ణ చేతనుడైన పరమేశ్వరుడే. ఆయనే జాతవేదుడు. భోగమైనా మోక్షమైనా ఆయనే ఇవ్వాలి మనకు.

**తాం మ ఆవహ జాతవేదో - లక్ష్మీమనప గామినీమ్**

**యస్యాం హిరణ్యం విందేయం - గా మశ్వం పురుషా నహమ్ -**

**తాం మే ఆవహ లక్ష్మీం.** కాబట్టి అలాటి లక్ష్మినే అఖండాకార వృత్తినే నాకు ప్రసాదించు ఓ అగ్నిహోత్రా - ఎలాటి లక్ష్మి కావాలో తెలుసా. **అనపగా మినీం** అపగామిని కాగూడదది. పక్కకు లాగేదేదో అది అపగామిని. తొలగిపోయేది. ప్రాపంచిక భోగాల వైపు లాగగూడదది. అలా జరిగితే మోక్ష మార్గానికి తొలగి పోతాను నేను. అయితే ఒక మోక్షాన్ని కోరితే సరిపోతుందా. అంతవరకూ జీవిత మనేది కొనసాగాలి గదా. దానికి కావలసిన అన్నపాన ధన కనక వస్తు వాహనాదులక్కర లేదా. ఉంది వాటి అవసరం కూడా. కాని అదే పనిగా వాటి వెంట పరుగెత్త నక్కర లేదు. **యస్యాం హిరణ్యం విందేయం.** ఈ ఒక్కటి

సంపాదిస్తే చాలు. అవి కూడా దీనితో పాటు అప్రయత్నంగానే నేను పొందగలను. అది సామాన్యమైతే ఇవి విశేషాలు. అది పరిపూర్ణమైతే ఇవి పరిమితమైనవి. పరిపూర్ణం సాధిస్తే పరిమిత మైనవన్నీ అందులోనే కలిసి వస్తాయి. సముద్రంలో చేస్తే చాలు. సకల నదులలో స్నానం చేసిన ఫలితమంతా కలిసి వచ్చినట్టే. ఏమిటా పరిమితమైన సంపద అంటావా. **గామశ్వం పురుషానహం.** గోసంపదా అశ్వ సంపదా పురుష సంపదా అన్ని సంపదలూ లభిస్తాయి నాకు.

ఏమిటీ మాట. గోవులూ అశ్వాలూ మందీ మార్బలమూ ఎవరికి కావాలంటారు. బ్రాహ్మణుడికా క్షత్రియుడికా వైశ్యుడికా. అందరూ గృహస్థులే అయినా బ్రాహ్మణ వైశ్య జాతుల కివన్నీ అక్కర లేదు. ఒకవేళ గోవులు కావలసి వచ్చినా గుఱ్ఱాలతో పనిలేదు వారికి. అలాగే దాసదాసీ జనం కూడా అంత హేరాళంగా ఉండనక్కర లేదు. మరి ఎవరికి కావాలంటా రివి. ఇవన్నీ కావలసిన వారు క్షత్రియులైన గృహస్థులే. క్షతం నుంచి కాపాడవలసిన వారు వారే. క్షతమంటే ఆపద అనర్థం. అది లోకుల కెవ్వరికీ కలగకుండా చూడవలసిన డ్యూటీ రాజులదే. వారా విధి నిర్వహించాలంటే రథ గజాశ్వాది బలమూ సైనిక బలమూ అన్నీ సంపన్నమై ఉండాలి వారికి. వారికుంటే చాలు. మనకందరికీ ఉన్నట్టే.

Yalamanchili Brahmaji Srinivasa Rao
www.advaitavedanta.in

ఆ మాటకు వస్తే మనమూ క్షత్రియులమే ఒక విధంగా. క్షతమంటే అనారోగ్యం కావచ్చు. దారిద్ర్యం కావచ్చు. మలినమైన ఆలోచనలు కావచ్చు. అవన్నీ తొలగిపోవాలంటే దానికి తగిన జ్ఞానం కావాలి. అది గోవు. దానికి వ్యాప్తి కావాలి. అది అశ్వ. దానివల్ల పరిపూర్ణుల మనిపించుకోవాలి. అది పురుష. ఐహికంగా ఇవి వరలక్ష్మి ప్రసాదిస్తే ఆధ్యాత్మికంగా మోక్షలక్ష్మి అనుగ్రహించాలి. అది కూడా ఎప్పుడూ అపగామిని గాక అనపగామిని అయి మన దగ్గరే నిలిచి ఉండాలని కోరుకోవాలి. కోరుకొంటే లభిస్తాయా. లభిస్తాయి. ఏదైనా మానవుడి భావనను బట్టి ఉంటుంది. భావన బలంగా ఉంటే అన్నీ సిద్ధిస్తాయి. తం తమే వైతి కౌంతేయ - సదా తద్భావ భావితః అని గీతావాక్యం. తద్భావ భావన అని ఒకటుంది. ఏది మనం దీర్ఘకాలం నిరంతరమూ తదేక భావంతో ధ్యానిస్తామో అది మనకు తప్పకుండా ఫలిస్తుందని శాస్త్రం హామీ ఇస్తున్నది. అది ఐహికమా ఆముష్మికమా అడగకండి. దేనికైనా సూత్రమొకటే. అది నిరంతర భావన. అదే చెబుతున్నదీ మంత్రం.

**అశ్వపూర్వాం రథ మధ్యాం - హస్తినాద ప్రబోధినీం**

**శ్రియం దేవీ ముపహ్వయే - శ్రీర్మాదేవీ జుషతామ్**

బాహ్యార్థం చెబితే అశ్వ - గుఱ్ఱాలూ - రథ రథాలూ - హస్తి - ఏనుగులూ. వీటితో పాటు పురుష - పదాతి వర్గమూ ఉండవలసిందే.

ఇవన్నీ ఏమిటి. చతురంగ బలం. చతురంగమంటే నాలుగు విధములైన బలం. అదే రథ గజ తురగ పదాతులని పేర్కొంటారు. ఇవన్నీ కావలసిన వారెవరు. దేశమేలే క్షత్రియులు. క్షతం నుంచి కాపాడవలసిన వారు. వారు అలా కాపాడాలంటే విదేశీయుల దాడికి జవాబు చెప్పగల మందీ మార్బల ముండాలి వారికి. అదే ఈ అశ్వ రథాది చతురంగ బలం. **అశ్వ పూర్వాం -** గుఱ్ఱాలు ముందుంటే. **రథ మధ్యాం.** రథాలు మధ్యలో ఉంటే. **హస్తి నాద.** ఏనుగులు ఘీంకారం చేస్తూ వాటి వెనకాల నడుస్తుంటే. ఇలాటి బలాన్ని **ప్రబోధినీం** తమకు వర్ధిల్ల జేయాలని కోరుకోవాలి మహారాజులు. ఎవరిని. ఆ మహాశక్తిని.

ఎలాగని. **శ్రియం దేవీ ముపహ్వాయే.** ఆ శ్రీదేవిని **ఉప** నాసమీపానికి **హ్వాయే** ఆహ్వానిస్తున్నాను. ఆహ్వానిస్తే నన్ను కటాక్షించి **శ్రీర్మాదేవీ జుషతాం.** ఆ శ్రీదేవి నన్ను సంక్రమించు గాక అని అమ్మవారిని చిత్తశుద్ధితో ప్రార్థించాలి క్షత్రియుడు. అప్పుడతని చిత్తశుద్ధి శ్రద్ధా భక్తులను గమనించి ఆ శక్తి తప్పకుండా కటాక్షిస్తుంది. అతని సంకల్పానికి తగినట్టుగా కోరిన అశ్వాది బలాన్ని ప్రసాదిస్తుంది. తన్మూలంగా శాత్రవులతో అతడు పోరాడితే వరలక్ష్మే గాక అతనికి జయలక్ష్మి కూడా కాగలదు.

ఇది బాహ్యార్థమైతే అంతరార్థం వేరే ఉన్నది. ఇది ఐహికమైతే అది ఆముష్మికమైన మోక్షానికి పనికి వచ్చేది. ఒక విధంగా మనమూ

క్షత్రియులమేనని చెప్పామింతకు ముందు. క్షతం నుంచి మనమందరమూ మనలను కాపాడుకోవలసిందే. క్షతమంటే దెబ్బ. అది ఈ సంసారమే. దీని నుంచి మనలను మనం రక్షించుకోవాలంటే మనకూ కావాలి. ఏమిటి. రథాలూ అశ్వాలూ గజాలూ. మన చక్షురాది ఇంద్రియాలే అశ్వాలు. ఇంద్రియాణి హయానాహుః అని కఠోపనిషత్తు చెబుతున్నది. ఆశు గచ్ఛతీతి అశ్వః అని వ్యుత్పత్తి. అతి వేగంగా పరుగెత్తేదేదో అశ్వం. అది మన ఇంద్రియాలే. మనమెంత బిగబట్టినా శబ్ద స్పర్శాదుల మీదికి పరుగెడుతుంటాయి. అవి ముందున్నాయి మనకు. **అశ్వపూర్వాం.** అందుకే ప్రత్యఙ్ముఖంగా గాక పరాఙ్ముఖంగా పరుగు దీస్తుంటాయి. అలాగే **రథ మధ్యాం.** రథ మంటే మన శరీరం. శరీరం రథమేవతు అని గదా ఉపనిషత్తు. ఇంద్రియాలనే గుఱ్ఱాలీడ్చుకు పోతుంటే ఇది కదలి పోతుంటుంది. అందుకే వాటి వెనకాల మధ్యలో ఉంటుంది శరీరం.

పోతే **హస్తి నాద ప్రబోధినీం** ఆ శరీరం కన్నా వెనకాల ఉంది. హస్తి ఏనుగు. ఏనుగు మన అహంకారమే. ఏన్గు దిన్నవాడు ఎంత సుజ్ఞానిరా అంటే మానవుడి అహం కార మనే అర్థం. అది శరీరానికి వెనకాల ఉండి శరీరాన్ని మమకారంతో చూస్తున్నది. దానికంటే ముందున్న ఇంద్రియాలనే అశ్వాలు దాన్ని ఈడ్చుకుపోయి విషయానుభవ మిస్తున్నాయి జీవుడికి. ఇదే జీవుడి కున్న సంసార బంధం. ఈ అహంకారమనే ఏనుగు ఆక్రందన చేస్తుంటే **నాద ప్రబోధినీం.** దాన్ని

Yalamanchi Brahmaji Srinivasa Rao
www.advaitavedanta.in

ప్రజ్వలింప జేస్తున్న దెవరు. ఎవరున్నారు ఇక. ఆ మాయా శక్తే. అది హరిణి అయితే మనలను సంసారాభి ముఖంగా హరిస్తుంది.

అలా కాకుండా సాయుజ్యం వైపు తీసుకెళ్లాలి మనలను. తీసుకెళ్లాలంటే హ్రీ కాకుండా శ్రీ కావాలని చెప్పాము. అలాటి శ్రీదేవినే **ఉపహ్వాయే.** మనసులోకి ఆవాహన చేయాలి ప్రతి మానవుడనే క్షత్రియుడు. అది మనకు బ్రహ్మాకార వృత్తిగా మారి **శ్రీర్మా దేవీ జుషతాం.** నాలో ప్రవేశించి నన్నా పరమాత్మ స్వరూపాన్నే ఆశ్రయించి దానితో ఏకమయ్యేలాగా అనుగ్రహించాలని ప్రార్థన. ఇదే ఇందులో గుప్తంగా ఉన్న అంతరార్థం. ఇదే వివక్షితం కూడా ఈ శ్రీ సూక్తాని కంతటికీ. ఎందుకని.

**కాం సోస్మితాం హిరణ్య ప్రాకారాం ఆర్ద్రాం జ్వలంతీం**

**తృప్తాం తర్పయంతీం - పద్మే స్థితాం పద్మ వర్ణా**

**మిహోప హ్వయే శ్రియమ్ -**

**కాం -** నీవు ప్రార్థిస్తున్నది ఎలాటి శ్రీదేవినో తెలుసా. **సోస్మితాం** - సః అస్మి అనే రెండు మాటలూ కలిసి సోస్మి అయింది. సోస్మి అంటే అదే నేనని అర్థం. సోహ మస్మి అన్నా సోస్మి అన్నా ఒకటే. అదేనేనంటే ఎవరా అది. పరమాత్మ చైతన్యం. అదేనేనంటే అప్పటికేమని అర్థం నేను శరీర మనః ప్రాణాల మేరకే పడిపోయిన జీవుడను కాను. వాటి

Vallamraju Brahmasri Srinivasa Rao www.advaitavedanta.in

కతీతుడైన ఈశ్వరుడనని గదా. ఈశ్వర చైతన్యమే సుమా నీవని నాకు చెప్పేదేది. కాం తదాకార వృత్తి. అదే **తాం.** దానిని అని అర్థం. తదాకార వృత్తిని. ఆ బ్రహ్మ విద్యా రూపిణే శ్రీదేవి. అలాటి దేవతను భావిస్తూ పోతే తద్భావ భావనా బలంతో తనకా పరమాత్మ స్వరూప ప్రాప్తే కలుగుతుందని సాధకుడి ఆశ.

అది కేవలం మన ఆశేనా నిజంగానే బ్రహ్మ పదాన్ని అందిస్తుందా ఆ దేవత అంటే గారంటీ ఇస్తున్నది మంత్రం. ఏమని. **హిరణ్య ప్రాకారాం.** దేవత అంటే ఏమనుకొంటున్నారు. బ్రహ్మాకార వృత్తి అది. బ్రహ్మ మెలా ఉంది. హిరణ్య నిధి లాంటిది. అమూల్యమైనది. ప్రజ్ఞాన ఘనం. అలాటి ధన మెవరికంటే వారికి లభించకుండా దానికి ప్రాకారమయి కూచున్నదీ విద్య. ప్రాకారం కప్పినట్టు కప్పేసింది దాన్ని. కప్పి కాపాడుతున్నది. **ఆర్ద్రాం జ్వలంతీం** ఉత్తమాధికారులైన సాధకుల పాలిటి కది ఆర్ద్ర. సౌమ్యమైనది. ప్రసన్నమైనది. అనుగ్రహిస్తుంది వారిని. అదే అనధికారులైతే జ్వలంతి. బ్రహ్మాండంగా మండిపోతూ దగ్గరికి రానివ్వదు. నిగ్రహిస్తుంది. వారికా విద్య ప్రాప్తించదు.

కనుక అలాటి బ్రహ్మ విద్యను పొందాలంటే సాధికారుల మనిపించు కోవాలి మనం. **తృప్తాం తర్పయంతీం -** అప్పుడది తృప్త అయి మనకు తృప్తి నిస్తుంది. నిత్య తృప్త అమ్మ వారు. కనుక ఆ విద్యారూపిణి అయిన మాత నాశ్రయించిన ప్రతి ఒక్క జిజ్ఞాసువునూ బ్రహ్మ జ్ఞాన మందించి

తృప్తి పరుస్తుంది. మహాశక్తి గనుక దేనికైనా సమర్ధురాలా దేవత. అంత సామర్థ్య ముందని ఏమిటి తార్కాణం.

**పద్మే స్థితాం పద్మ వర్ణాం తామి హోపహ్వయే శ్రియం.**

పద్మంలో నివసిస్తున్న దాశక్తి. పద్మం వంటి వర్ణం కలిగినది. అలాంటిది గనుకనే నన్ను తప్పకుండా అనుగ్రహిస్తుందని నమ్మకం. అందుకే ఆ మహాశక్తిని నా మీది కావాహన చేసుకొంటున్నాను. పద్మంలో నివసించట మేమిటావిడ. పద్మ వర్ణ మేమిటావిడకు. పద్మమంటే కమలం గదా. అది సహస్రార కమలమే. అంటే వేలకొలది వృత్తులు గల మన అంతః కరణమే. ఏ ఆలోచన వచ్చినా మనసులోనే గదా వస్తున్నది. ప్రతి ఆలోచనలో తిష్ఠ వేసుకొని కూచున్నదా పరాశక్తే. ఆ శక్తి పరి స్పందమే ఈ ఆలోచన. ఏ ఆలోచన వస్తుంటే దాని ఆకారమే ధరిస్తుంటుందా శక్తి. అదే దాని వర్ణం.

అయితే మనసులో కలిగే ప్రతి ఆలోచననూ ఆహ్వానించ గూడదు మానవుడు. ధియెూ యెూనః ప్రచోదయాత్తని త్రోసి పారేయాలి ఎప్పటికప్పుడు. మరి అన్ని వృత్తులూ త్రోసివేస్తే ఏ వృత్తిని ఆవాహన చేయాలి. ఏది మోక్ష మార్గానికి తోడు పడుతుందో అలాటి సవితుర్వరేణ్యం భర్గః - బ్రహ్మాకార వృత్తిని మాత్రమే. ఎలా ఉంటుందది.

**చంద్రాం ప్రభాసాం యశసా జ్వలంతీం - శ్రియం లోకే దేవ జుష్టా ము**

**దారాం - తాం పద్మినీం శరణ మహం ప్రపద్యే.** చంద్రాం. చంద్రుడంటే మనస్సు. మనస్సుకు హితమైనదీ సరియైన మార్గంలో నడిపించేదీ కావాలి. **ప్రభాసాం.** సర్వత్రా ప్రకాశించేదయి ఉండాలి. **యశసా జ్వలంతీం.** అలా ప్రకాశిస్తూ మోక్ష మార్గాన్ని ప్రకాశింప జేసి చూపుతూ పోవాలి మనకు. ఎంతోమంది జిజ్ఞాసువుల కలాటి జ్ఞానాన్ని ప్రసాదించి ముక్తులను చేసిన యశస్సున్నది దానికి. అలాటి యశస్సుతో వెలిగిపోతున్నది. **శ్రియం లోకే దేవజుష్టా ముదారాం -** అలా చూపటమే గాక మనమా గమ్యాన్ని అందుకొనేలా చేయాలి. బ్రహ్మవేత్తలైన వారెందరో మనకంటే ముందలా అందుకొన్న వారే. అలాటి ఉదారమైన విద్య అది. **తాం పద్మినీం శరణ మహం ప్రపద్యే.** పద్మాలన్నిటిలో విహరించేదా శక్తి. పద్మాకారంగా ఉండే అండ పిండాది గోళాలే పద్మాలు. అనంత కోటి బ్రహ్మాండ జనని కాబట్టి అన్ని లోకాలనూ వ్యాపించి ఉన్నదా శక్తి అనటంలో ఆశ్చర్యం లేదు. అలాటి మహాశక్తిని శరణు వేడితే చాలు. దాని ప్రభావం నా మీదా పనిచేస్తుంది. అందుకే శరణు వేడుతున్నాను.

**అలక్ష్మీ ర్మే నశ్యతాం త్వాం వృణే.** శరణు వేడితే మనకు కలిగే ఫలితాలు రెండు. ఒకటి అది లక్ష్మి అయి మనకు గమ్యం చూపుతుంది. మరొకటి లక్ష్మి గాని అలక్ష్మి ఒకటి ఉన్నదే అది **నశ్యతాం** నశిస్తుంది. ఇక్కడ లక్ష్మి అంటే దారి చూపేది. అలక్ష్మి అంటే అలా చూపకుండా

మనలనీ సంసార కూపంలో పడేసేది అని అర్థం. మొదటిది అనుకూలం. రెండవది ప్రతికూలం. శక్తి ప్రతికూలంగా గాక అనుకూలంగా మనకు కరావలంబ మిచ్చి కాపాడాలని భావం. అలా కాపాడాలంటే **త్వాం వృణే.** ఓ మహాశక్తీ నా కనుకూలించ మని నిన్ను నను వరిస్తున్నాను లేదా భజిస్తున్నానని ధ్యానించాలి ఈ సాధకుడు.

**ఆదిత్య వర్ణే తపసోఽ ధిజాతో**

**వనస్పతి స్తవ వృక్షోఽ థ బిల్వః**

**తస్య ఫలాని తపసా నుదంతు**

**మాయాం తరాయాశ్చ బాహ్యా అలక్ష్మీః**

ఎలాటి ఉదాత్తమైన భావనతో ధ్యానించాలో దాన్ని కూడా వివరిస్తున్నదీ మంత్రం. ఆ బ్రహ్మ విద్యే గదా ఈ శ్రీ విద్య అని పేర్కొన్నాము. అది **ఆదిత్య వర్ణాం** - ఆదిత్య మండలం లాంటి దీప్తి కలిగినదా విద్య. నిత్యమూ ప్రకాశించే స్వభావం దానిది. తమస్సు కాదది జ్యోతిస్సు. తమస్సు అజ్ఞానానికైతే జ్యోతిస్సు జ్ఞానానికి ప్రతీక. అందులో కూడా జడజ్యోతి కాదు. చైతన్య జ్యోతి. అనుదితా నస్తమిత అన్నారు భగవత్పాదులు. అంటే ఒకప్పు డుదయించేది కాదు. మరొకప్పుడస్త మించేది కాదు. భౌతికమైన ఆదిత్య మండలానికే ఉదయాస్తమయాలు.

Yellamraju Srinivasa Rao www.advaitavedanta.in

అభౌతికమైన ఆత్మ చైతన్యానికి ఉదయాస్తమయాలనే ప్రసక్తే లేదు. అందుకే సకృత్ప్రభాత అని కూడా వర్ణిస్తారు దాన్ని. సకృత్తంటే నిత్యమూ ప్రభాత అంటే ప్రకాశించేదని అర్థం.

అలాటి ఓ మహాశక్తీ **తపసో ఽ ధిజాతో వనస్పతి స్తవ వృక్షో ధ బిల్వః -** నీవు తపస్సు చేశావు. ఆ తపస్సు వల్లనే జన్మించింది ఒక వృక్షం. దాని పేరే బిల్వం. ఆవిడ తపస్సు చేయటమేమిటి. దానివల్ల ఒక బిల్వ వృక్షం జన్మించట మేమిటి. ఆశ్చర్యంగా లేదూ. అంతరార్థం తెలుసుకొంటే ఏమీ ఆశ్చర్యం లేదు. తపస్సంటే ఆలోచన సంకల్పం. యస్య జ్ఞాన మయం తపః అన్న దుపనిషత్తు. సతపో ఽ తప్యత అని కూడా పేర్కొన్నది. పరమాత్మ చేసిన తపస్సాయన ఆలోచనే సంకల్పమే. దానికే ఈక్షణమని కూడా ఒక నామధేయం. తదైక్షత. అది చూచిందట. పరిపూర్ణమైన జ్ఞానం గదా అది. అందుకే ఆలోచించ గలదు. చూడగలదు. ఏమని చూచింది. బహుస్యాం ప్రజాయే యేయ. అనేకమయి పోదామని. అదే ఈ చరా చర ప్రపంచం. ఇది వాస్తవం కాదీ సృష్టి. ఆ పరమాత్మ సంకల్పం లేదా భావనా రూపం. చైతన్య వివర్తమే సంసారం.

అదే వర్ణిస్తున్నదీ మంత్రం. నీ తపస్సు వల్లనే జన్మించిందీ వృక్షమని. వృక్షమంటే యథార్థమైన వృక్షం కాదిది. వృక్షం లాగా దృష్ట నష్ట స్వభావం గనుక వృక్షంతో పోల్చి చెప్పారు. న రూప మస్యేహ తథో

Brahmasri Yellamraju Srinivasa Rao
www.advaitaveda.in

పలభ్యతే నాంతో నచాది ర్న చ సం ప్రతిష్ఠా. ఆది మధ్యాంతాలు లేనిదిది. కనుకనే పైకి ఒక రూపంలో కనిపిస్తున్నా అది ఆ భాసే. వస్తువు కాదు. వస్తువు చైతన్యం. అది బీజమైతే అది శాఖోప శాఖాత్మకంగా విస్తరించి కనిపించటమే ఈ సంసార వృక్షం.

అందులో కూడా మామూలు వృక్షం కాదు. బిల్వ వృక్షం బిల్వమంటే మారేడు. రెండో మూడో దళాలుంటాయి దానికి. రెండుంటే ద్వంద్వాత్మకం. మూడుంటే త్రిగుణాత్మక మనుకోండి. అసలు వృక్షాలలో రెండు రకాలున్నాయి. పూయకుండా ఫలించే దొకటైతే పుష్పించి ఫలించేది మరొకటి. వానస్పత్యః ఫలైః పుష్పా - త్తైరపుష్పా ద్వనస్పతిః అన్నారు నైఘంటికులు – Lexico Graphars. ఇది వనస్పతి ఈ సంసార వృక్షం. పూలు లేకుండా ఫలించిన వృక్షం. అంటే ఎలాటి కారణమూ చూపటానికి లేదు దీని ఆవిర్భావానికి. అనిర్వచనీయం. వాస్తవంగా జన్మించలేదిది. అయినా కనిపిస్తున్నది. అందుకే ఆ భాస అన్నారు దీన్ని. స్వప్నంలో చూచే వృక్షం లాంటిది. లోకంలో బిల్వవృక్షం కూడా పుష్పించ కుండా కాయలు కాస్తుంది. కనుకనే దానితో పోల్చారు సంసారాన్ని. అంతేకాదు. బిలం చేసేదేదో అది బిల్వం. బిలమంటే ఖాళీ. మారేడు కాయ ఖాళీ చేస్తే అది మారేడు బుఱ్ఱ. అలాగే దీన్ని కూడా బ్రహ్మ భావనతో చూస్తే ఖాళీ అవుతుంది. అప్పుడిది వట్టిదే. హుళక్కి. తనపాటికి తాను వట్టిదే అయినా పూర్ణ స్వరూపంగా భావన చేస్తే తదాకారంగా పూర్ణమే మరలా.

అందుకే ఏకబిల్వం శివార్పణ మన్నారు. శివతత్త్వానికి దీన్ని అర్పణ చేయి శివాత్మకంగా దర్శన మిస్తుందని ఉపదేశించారు.

**తస్య ఫలాని తపసా నుదంతు - మాయాంతరాయాశ్చ బాహ్యా అలక్ష్మీః** అని మంత్ర మలాటి ఉపదేశమే ఇస్తున్నది మనకు. ఈ బిల్వ వృక్ష ఫలాల నన్నిటినీ తపస్సుతో సమర్పించు. ఇక్కడ తపస్సు మన భావన. మన బ్రహ్మాకార వృత్తి. అలాటి జ్ఞాన బలంతో ఈ సంసారం వల్ల కలిగే సుఖ దుఃఖాది ఫలాల నన్నిటినీ పరమేశ్వరార్పణం చేయాలని భావం. తుభ్యమహం సంప్రదదే నమమ. నీకే ఇదంతా సమర్పిస్తున్నాను. నాకేమీ అక్కరలేదనే నిష్కామ దృష్టితో ఉండాలి మానవుడు. **నుదంతు-** అలాటి సజాతీయ భావాలే పోగొడుతాయి. వేటిని. విజాతీయమైన **మాయాం తరాయాశ్చ** అవిద్యా నిమిత్తంగా ఏర్పడ్డ ప్రాపంచిక వృత్తులను. ధియో యోనః ప్రచోదయాత్తనే మాట ఎంతో ఇదీ అంతే. విజాతీయ భావమేదీ పనికిరాదు. కారణం. **బాహ్యా** అది మనకు బాహ్యమైనది. బాహ్య ప్రపంచం వైపు లాక్కుపోతుంది. ఆంతరమైన తత్త్వాన్ని చూపదు. చూపితే అది లక్ష్మి. చూపకుంటే అలక్ష్మి. **బాహ్యా అలక్ష్మీః** అంటున్నా డిక్కడ మనకు భిన్నమైన దాన్ని చూపేదంతా అలక్ష్మే. మన మార్గాని కుపయోగ పడేది కాదు. **అలక్ష్మీర్మే నశ్యతా** మని గదా ప్రార్థించా డింతకు ముందు. లక్ష్మిని సేవిస్తే అలక్ష్మి తొలగిపోతుంది. అలక్ష్మి ఏదో

గాదు. జ్యేష్ఠాదేవి. పెద్దమ్మ వారు. లక్ష్మి కంటే ముందుగా పుట్టింది సాగరంలో. అంటే సంసార సాగరంలో. అందుకే పెద్దమ్మ అయిందది. సజాతీయ భావన వల్లనే విజాతీయం తొలగిపోతుంది. సజాతీయ భావమెలా కలుగుతుంది.

**ఉపైతు మాందేవ సఖః - కీర్తిశ్చ మణినా సహ**

**ప్రాదు ర్భూతో௨ స్మి రాష్ట్రేస్మిన్ - కీర్తి మృద్ధిం దదాతు మే**

అనులోమంగా ఒకటి సాధించినప్పుడే ప్రతి లోమమైనది బాధిత మయి పోతుంది. ఇదీ సూత్రం. అందుకే అభ్యాసం మొదట వైరాగ్యం తరువాతా చెప్పారు. ఏమిటా అభ్యాస మిక్కడ. క్రియారూపం కాదది. Actual భావరూపం Ideal . నిరంతరమూ భావన చేస్తూ పోవాలా బ్రహ్మ భావాన్ని. **దేవసఖః** అది దేవసఖం. దీవ్యతీతి దేవః – ఏది ఎప్పుడూ స్ఫురిస్తుంటుందో అది దేవ. అది మన మనస్సే. దానికి సఖ అంటే అంటి పట్టుకొని ఉండేది. అలాటి బ్రహ్మ భావం **ఉపైతు మాం.** నాలో ప్రవేశించు గాక అనే ఆకాంక్షతో భావన చేయాలి. అలా చేస్తూ పోతే ఏమవుతుంది. **కీర్తిశ్చ మణినా సహ.** రత్నం లాంటి ఆ విలువైన భావం దానితో పాటు దాని విభూతీ పదహారు కళలతో మనలో ప్రకాశిస్తుంది. యద్భావ స్తద్భవతి అన్నారు. భావితం తీవ్ర వేగేన. ఏది తీవ్రంగా భావిస్తే అదే మనకు ప్రాప్తిస్తుంది సందేహం లేదు. సంసార

భావనతో సంసార బంధం ప్రాప్తించి నట్టే సాయుజ్య భావనతో మరలా సాయుజ్య సుఖమే లభిస్తుంది.

అసలు మనకెందుకీ ప్రయాస అంటారేమో. **ప్రాదుర్భూతోస్మి రాష్ట్రేస్మిన్ - కీర్తి మృద్ధిం దదాతుమే.** ప్రయాస మనం పెట్టుకొన్నది గాదు. మనకు జన్మతోనే వచ్చింది ప్రయాస అనేది. అదే ఈ జీవ భావం. దేహమే నేననే భావ మెప్పుడేర్పడిందో అప్పుడే ప్రయాస ఆరంభమయింది. అదే మనకీ సుఖదుఃఖా దికమైన సంసారాను భవం. ఇది మనకు తెలియ కుండానే వచ్చి నెత్తిన పడ్డది. అదే చెబుతున్నది మంత్రం. **రాష్ట్రేస్మిన్.** రాష్ట్రమంటే ఈ శరీరం. ఇది మనం పుట్టినప్పటి నుంచీ ధరించే ఉన్నాము. కనుక ధృతరాష్ట్రులం మనమంతా. పుట్టుకతోనే గ్రుడ్డివాళ్లం. అంటే జ్ఞానమనే వెలుగుకు నోచుకోలేదు. కారణం **ప్రాదుర్భూతోస్మి.** దురదృష్టవశాత్తూ వచ్చి పడ్డా మిందులో. ఈ బందిఖానాలోనే జన్మ ఎత్తాము.

తెలియకుండా ఇందులో వచ్చి ఇరుక్కుపోయాడు గనుకనే ప్రతి మానవుడూ మరలా ఇందులో నుంచి ఎంత తొందరగా బయటపడితే అంత మంచిది. లేకుంటే ఇక్కడే పుట్టి ఇక్కడే గిట్టే ప్రమాదానికి గురి అవుతాడు. తెలియకుండా తెచ్చుకొన్నది సమస్య అయితే తెలిసి బయట పడటం పరిష్కారం. అజ్ఞానానికి విరుగుడు జ్ఞానమే గదా. అంచేత **కీర్తి మృద్ధిం దదాతుమే.** అమ్మా మహాశక్తీ నాకు బయట పడే మార్గాన్ని

దానికి తగిన సామర్థ్యాన్నీ ప్రసాదించమని వేడుకోవాలి ప్రతివాడూ. అప్పుడావిడ విద్యారూపిణి కూడా గనుక లక్ష్మి అయి మనకు తరించే మార్గాన్ని చూపుతుంది.

మార్గాని కడ్డు పడుతుందేది. **క్షుత్పి పాసా మలాం జ్యేష్ఠా మ లక్ష్మీమ్.** అలక్ష్మే మోక్ష మార్గాని కడ్డుపడే బండరాయి. అది లక్ష్మి గాదు అలక్ష్మి. దారి చూపదు. ఎక్కడిదీ అలక్ష్మి. ఎలాంటిది. జ్యేష్ఠ అది. అంటే మొదటి నుంచీ మనల నంటి పెట్టుకొని ఉన్నది. అదేదో గాదు. అనాది సిద్ధమైన మానవుడి అజ్ఞానమే. జ్ఞానోదయం కానంత వరకూ ఉన్నది మన కజ్ఞానమే గదా. అంచేత అది జ్యేష్ఠ. లక్ష్మీదేవి కన్నా పెద్దది వయసులో ఈ జ్యేష్ఠాదేవి. ఎలా ఉంటుంది దీని చహరా అని అడుగుతారా. **క్షుత్పి పాసా మలాం.** క్షుత్తూ పిపాసా దీని లక్షణాలు. **మలాం.** అలాటి మాలిన్యాన్ని దగ్గర పెట్టుకొని బ్రతుకుతున్నది. క్షుత్పిపాసలంటే ఆకలి దప్పులు - అవి సూక్ష్మ శరీరోపాధి అయిన జీవుడి లక్షణాలు. వాడే తైజసుడు. అసలైన జీవుడు. అప్పటికీ జీవ భావమే మాలిన్యమని తేలిపోయింది.

తేలింది. బాగానే ఉంది. వ్యాధి ఏదో తెలిసింది. మరి దీన్ని పోగొట్టుకొనే మార్గమేమిటి. అదే చెబుతున్నాడు. **అలక్ష్మీం నాశయా మ్యహమ్.** మార్గం నాకు చూపకపోగా నా మార్గానికి శత్రువైన దీన్ని రూపుమాపుతానని నడుము కట్టాలట మానవుడు. కట్టాలనే మాట బాగానే

ఉంది. కాని ఎలాగని. **అభూతి మ సమృద్ధించ సర్వాం నిర్ణుదమే గృహాత్.** అభూతి ఒకటీ అసమృద్ధి ఒకటీ ఈ రెండూ నా ఇంట్లో నుంచి బయటికి త్రోసి వేయమని ఆ శ్రీ దేవిని మనసారా ప్రార్థించాలి. భావనా గమ్య అని గదా ఆవిడ పేరు. నీవలా భావిస్తే ప్రసన్నురాలయి నీకు ప్రతికూలమైన ఆ రెంటినీ గెంటి వేసి అనుకూలమైన భూతి నీ సమృద్ధినీ నీకు ప్రసాదిస్తుంది. అభూతేమిటి అసమృద్ధేమిటి. అభూతి అంటే నేనీ శరీరం మేరకే గాక బాహ్యంగా కూడా సర్వత్రా సచ్చిద్రూపంగా ఉన్నాననే భావం లేకపోవటం. అదే జీవ భావం. ఇది తొలగిపోతే భూతి అవుతుందది. అది ఈశ్వర భావం. అలాటి ఈశ్వర భావమందు కోలేకపోతే అది అసమృద్ధి. అందుకో గలిగితే సమృద్ధి. కాబట్టి ఆ అభూతి అసమృద్ధి అనే దోషాలు నిర్మూలించి భూతి సమృద్ధుల నిమ్మని వేడుకోవాలా మహాశక్తిని. ఇక్కడ నా ఇంటి నుంచి నెట్టి వేయమంటే అర్థం కేవలం నేను నివసించే గృహమనే గాదు. మనస్సనే గృహం నుంచని అర్థం చెప్పుకొంటే ఇంకా బాగుంటుంది. అసలదే అంతరార్థం.

**గంధ ద్వారాం దురాధర్షాం - నిత్యపుష్టాం కరీషిణీమ్**

**ఈశ్వరీగ్ంం సర్వ భూతానాం - తా మిహోపహ్వయే శ్రియమ్**

సరే మన సాధన మార్గాని కడ్డు పడేదంతా త్రోసి పారేయాలన్నారు. విభూతి సమృద్ధి కావాలని కోరుకొన్నారు. బాగానే ఉంది. కాని

అనులోమంగా దానినెలా సాధించాలిప్పుడు. ఎలా పట్టుకోవాలని ప్రశ్న వచ్చింది. దానికిస్తున్నాడు సలహా. **తా మిహోపహ్వాయే శ్రియమ్ .** ప్రతిలోమంగా మన మనసులో నుంచి నెట్టి వేయవలసింది అలక్ష్మి అయితే అనులోమంగా పట్టుకోవలసింది లక్ష్మి. మోక్ష మార్గాన్ని సూచించేది. మనలను చేర్చేది. అదే శ్రీ. ఆ శ్రీని **ఉపహ్వాయే -** నాదగ్గరికి ఆహ్వానిస్తున్నాను. అది బ్రహ్మ విద్యారూపిణి కాబట్టి నాలో ప్రవేశించి నన్నా మార్గంలో నడిపించాలి.

ఎలాగని. **గంధ ద్వారాం. దురాధర్షాం.** పరమాత్మ ఒక పుష్ప మనుకొంటే దాని గంధం దాని సువాసన శక్తి. పుష్ప మొకే చోట ఉంటే దాని వాసన దశదిశలా వ్యాపిస్తుంది. అలాగే పరమాత్మ కూటస్థ మచలం ధ్రువం. కదలడు మెదలడు వస్తు సిద్ధంగా. కాని ఆయనతో అవినాభూతంగా ఉన్న మహాశక్తి నామరూపాత్మకంగా సమస్త సృష్టినీ వ్యాపించి ఉంది. ప్రత్యక్షంగా కనిపించే ఈ నామరూపాలే ద్వారం మనకా పరమాత్మను చేరటానికి. ఈశావాస్య మిదగ్ం సర్వమని గదా ఉపనిషత్తు మాట. ఇదంతా ఈశవాసనా వాసితమే కాబట్టి ఈ వాసనతో మన బుద్ధి వాసితమైతే చాలు. ఆ ఈశ్వరాకార వృత్తే మనకాలంబమయి పరమాత్మను పట్టిస్తుంది. కనుక అది గంధ ద్వార. గంధద్వారే గాక దురాధర్ష కూడా. ఆధర్ష అంటే అటకాయించటం ఎదిరించటం. ఏదీ దాన్ని ఎదిరించ లేదు. అలాంటి వృత్తి అది. బ్రహ్మమెలా అఖండమో

Yallamraju Srinivasa Rao Brahmasri www.advaitavedanta.in

దాన్ని చేర్చే వృత్తి కూడా అఖండాకారమే. అలాటి దాన్ని ప్రాపంచికమైన ఖండ వృత్తులెలా ఎదిరించి బ్రతకగలవు. ఎదురు లేకుండా వ్యాపిస్తుందది. అంతర్యామి రూపంగా బ్రహ్మాండాన్ని జ్ఞాన ప్రకాశ రూపంగా పిండాండాన్ని అది ఒక్కటే వ్యాపించింది. పరిమితమైన మిగతా వృత్తులు పరిపూర్ణమైన దాన్ని ఎలా నిరోధించ గలవు. కనుక దురాధర్ష అది.

అంతేకాదు. **నిత్యపుష్టాం కరీషిణీం.** నిత్య పుష్ట అది. దాని పుష్టికి కొరత లేదు. ఎప్పుడూ బలంగానే ఉంటుంది. నీవూ నేనూ దానికి క్రొత్తగా బలమివ్వ నక్కర లేదు. మనమివ్వక ముందే అది బలం పుంజుకొని ఉన్నది. అన్ని చిత్తవృత్తుల కన్నా బలమైన వృత్తి. ఆత్మాకార వృత్తి. అది సవితు ర్వరేణ్యం భర్గః - కనుకనే దాన్ని ధీమహి అని మన హృదయంలో నిలుపుకొంటే మిగతా వాటినన్నిటినీ ప్రచోదయాత్ త్రోసి పారేయగలదు. అదే **కరీషిణీం.** కర్షిణీయే కరీషిణీ. కర్షిణి అంటే కర్షణం చేసేది. లాగి పారేసేది. మనసు లోపల పేరుకొని ఉన్న వృత్తులనూ వాసనలనూ అపకర్షణం చేసేది. ప్రక్కకు లాగేసేదని అర్థం. అందరి మనస్సులనూ అలా క్షాళితం చేయాలంటే అందరిలోనూ ఉండాలది. అదే **ఈశ్వరీం సర్వభూతానాం.** సమస్త ప్రాణులకూ ఈశ్వరి. అందరి అంతరంగాలలో వచ్చి కూచొని అందరినీ అజమాయిషీ చేస్తున్న మహాశక్తి అది. ఈశ్వర స్సర్వ భూతానాం హృద్దేశే౽ర్జున తిష్ఠతి అని గీత. భ్రామయన్సర్వ భూతాని అని కూడా అన్నది. అదే ఈశ్వరి.

Valluri Brahmaji Srinivasa Rao
www.advaitavedanta.in

ఐశ్వర్యం. అలాంటి శక్తి మనలో చేరిపోతే మనకిక అడ్డమేముంది. అదే అన్ని ఆలోచనలనూ అరికట్టి మనలను సాధన మార్గంలో చక్కగా నడపగలదు. కనుక దానినే ఆవాహన చేసుకోవాలి మనమెప్పుడూ.

**శ్రీ ర్మే భజతు - అలక్ష్మీ ర్మే నశ్యతు.** ఏమని ఉండాలి మానవుడి కాశంస Aspiration. శ్రీయే ఎప్పుడూ నన్ను భజించు గాక. అలక్ష్మి నశించుగాక అని ఉండాలి మన కామన. శ్రీ భజిస్తే అది లక్ష్మి గనుక మనకు మోక్ష మార్గాన్ని చూపుతూ పోతుంది. దానికి భిన్నమైన అలక్ష్మి మనకు మార్గం చూపదు గనుక దాన్ని మనసుకు తెచ్చుకోకపోతే తొలగిపోతుంది. అంతా మానవుడి భావనను బట్టి ఉంటుంది. సంసారమంతా పరమాత్మ భావనే అయినప్పుడు దాన్ని సాయుజ్యంగా దర్శించటం కూడా జీవాత్మ తాలూకు భావనే గదా. భావనా గమ్యా అని అమ్మవారి నామం. ఏది తీవ్రంగా భావిస్తే అది అవుతాడనేది గొప్ప సూత్రం. అందుకే తద్భావ భావితః అని చాటుతున్నది గీత. సత్యాభి సంధి అనృతాభి సంధి అని ఛాందోగ్య మన్నదంటే ఇదే దాని అంతరార్థం. సత్య భావనతో నిష్క్రమిస్తే మానవుడు - సత్యస్వ రూపుడుగానే నిలిచి ఉంటాడు. అసత్య భావనతో వెళ్లిపోతే అసద్రూపమైన సంసార బంధమే వాడికి ప్రాప్తి.

**మనసః కామ మాకూతిం - వాచస్పత్య మశీమహి**

**పశూనాగ్ం రూప మన్నస్య - మయి శ్రీః శ్రయతాం యశః**

Valluri Brahmasri Srinivasa Rao
www.advaitavedanta.in

ప్రతి మానవుడి మనస్సుకూ కలిగే కోరిక అదే. అదే వాడి ఆ కూతి కూడా. దేన్ని పొందాలని లోలోపల ఆసిస్తుంటాడో అది ఆకూతి. ఏదో గాదది. **వాచస్పత్యం.** వాక్కు కధిపతి వాచస్పతి. వాక్కంటే బ్రహ్మ విద్య. దాని ద్వారా పొందేది వాచస్పతి. దాని భావం వాచస్పత్యం. అది పొందాలని కోరుకోవాలి ప్రతి మానవుడూ. అయితే దాని నెలా పొందాలి. ఏమిటి ఉపాయం. అదే వాక్కు. వాక్కన్నా లక్ష్మి అన్నా శ్రీ అన్నా ఒక్కటే. వాక్కే దారి చూపుతుంది వాచస్పతి అయిన పరమాత్మను పొందటానికి. అలాటి కామ మనండి ఆకూతి అనండి. అది తీవ్రంగా కలిగినప్పుడే **అశీమహి.** పొందగలం. సందేహం లేదు.

అయితే అలాటి జిజ్ఞాస ఎలా కలుగుతుందంటారు. మనసులోనే కలగాలది. మనసు కూడా బలహీనమయితే సుఖం లేదు. చాలా బలిష్ఠమైన మనసు కావాలి. **పశునాం రూప మన్నస్య.** బలమెలా వస్తుంది. అన్నమయం హి సోమ్య మనః అన్నారు. ఆహారం వల్లనే లభిస్తుందది. ఆహార శుద్ధే సత్త్వ శుద్ధి అని గదా చెప్పాడు సనత్కుమారుడు. పశువుల కదే రూపం. పాశ్యతే ఇతి పశుః సంసారంతో కట్టుపడ్డ మానవుడే ఒక పశువు. వాడి రూపం అన్నమయమైన మనస్సే. **యశః** అదే బ్రహ్మాకార వృత్తిని కూడా అలవరుచుకొని వాడికి కీర్తి ప్రతిష్ఠలు తెస్తుంది. కాబట్టి అలాటి బ్రహ్మ విద్యా జన్యమైన యశస్సు **శ్రీః శ్రయతామ్.** ఆ శ్రీ మాత నాకందివ్వాలని కోరుకోవాలి.

**కర్దమేన ప్రజా భూతా - మయి సంభవ కర్దమ**

**శ్రియం వాసయ మేకులే - మాతరం పద్మ మాలినీమ్**

అసలా శ్రీ ఎవరో కాదు. కర్దముడని ఒక ప్రజాపతి ఉన్నాడు. ఆయన కన్న బిడ్డ అని పేర్కొంటాయి పురాణాలు. మహాలక్ష్మి కర్దమ ప్రజాపతి కూతురా. ఏమిటర్ధం. ప్రజాపతులందరూ ప్రజా సృష్టికి కర్తలు. అందుకే వారికి ప్రజాపతులని పేరు వచ్చింది. ప్రజా సృష్టి చేయాలంటే వారికి తపశ్శక్తి ఉండాలి. దానివల్ల ఏర్పడిందే ఈ ప్రపంచ స్థితి. ఇదే లక్ష్మి. కనుక ప్రజాపతి సంతాన మయింది లక్ష్మి. ఇది బాహ్యార్థమైతే అంతరార్థం వేరే ఉన్నది.

కర్దమమంటే బురద. అదే ఈ సంసారం. సంసార పంక నిర్మగ్న అని లలితా నామం. **కర్దమేన ప్రజాభూతా** ప్రజాయంతే ఇతి ప్రజాః - చరాచర పదార్థాలన్నీ ఈ సంసార మనే కర్దమం నుంచే జన్మించాయి. పృథివీ తత్త్వం నుంచే గదా సర్వమూ ఏర్పడింది. అలా జన్మించటం వరకే అయితే అది గొప్ప గాదు. దానినుంచి బయటపడా లెప్పటికైనా. ఎలాగ. **మయిసంభవ కర్దమ.** అందుకే చెబుతున్నారు. నాలోనే ఈ కర్దమం చేరి పోవు గాక. సంసారం నాకు బాహ్యంగా గాక నాలో చేరి నా స్వరూపంలో ప్రవిలయ మయి పోవాలని కోరుకోవాలి మనం. అప్పుడు మన ఆత్మ విశ్వాత్మగా పరిణమిస్తుంది. ఇక మనకన్యంగా ఒక సంసారమనీ తన్నిమిత్తంగా కష్టసుఖాలనీ ఉండబోవు.

కాని అలా జరగాలంటే బ్రహ్మ విద్యా బలం లేకుండా జరగదు. ఆ విద్య ఏదో గాదు. శ్రీ. **శ్రియం వాసయ మేకులే - మాతరం పద్మ మాలినీం.** కనుక అలాటి శ్రీని **వాసయమే కులే.** నా ఇంటిలో ప్రవేశపెట్టు. అక్కడే నివసించేలా చేయి. ఇల్లంటే ఇల్లనే గాదు. మనసే ఒక ఇల్లు. అందులోనే గదా ఉదయించాలా విద్య. చిక్లీత అంటే రజస్సు. అది మానవుడికి ప్రత్యేకమైన గుణం. సత్త్వం దేవతలకూ తమస్సు దానవులకైతే రజస్సు మానవుల గుణం. అన్నీ పోగు చేసుకొనే లక్షణం. అందుకే ఓ చిక్లీతా ఓ రజోగుణమా నా ఇంట్లో అన్నీ తెచ్చి పెట్టు. నా ఒంట్లో అన్నీ తెచ్చి పెట్టమని బ్రతిమాలుతున్నాడు.

కాని కోరుకోటం వీడి స్వభావమే అయినా ఇవీ అవీ ఐహికమైనవన్నీ పోగు చేసుకొంటే క్షేమం లేదు వీడికి. ఇదంతా ప్రేయస్సే గాని శ్రేయస్సుగాదు. శ్రేయస్సు వీడి కెప్పటికైనా శ్రీయే. అదే మోక్షాన్ని చేర్చే లక్ష్మి. కనుక **నిచదేవీ మాతరం శ్రియం వాసయమే కులే** - ఓ చిక్లీత. వీటన్నిటి కంటే నాకు శ్రేయోదాయకమైన నాకు జీవిత గమ్యమైన మోక్షానికి దారి చూపే తల్లి లాంటి శ్రీ ఏదైతే ఉన్నదో ఆ తేజోరూపిణి అయిన బ్రహ్మ విద్యనే **మేకులే** నా మనసులో **శ్రియం ని వాసయ** ప్రవేశ పెట్టు. నిరంతరం నాకా ఆలోచన కలిగేలా చూడు. అని కోరుకోవాలి మానవుడు.

Brahmasri Vallamraju Srinivasa Rao
www.advaitavedanta.in

**ఆర్ద్రాం పుష్కరిణీం పుష్టిం - పింగళాం పద్మ మాలినీం**

**చంద్రాం హిరణ్యయీం లక్ష్మీం - జాతవేదో మమా వహ**

అది ఎలాంటిదా విద్య అంటే దాని లక్షణాలు వర్ణిస్తున్నాడు. ఆర్ద్ర అది. పుష్కరిణి అది. చాలా సౌమ్యమైనదా విద్య. భయానకమైనది కాదు. ప్రాపంచికమైన వెంత పోగు చేసుకొన్నా అవి ఎప్పటికైనా తొలగిపోయే భయముంది వాటిలో. ఇది అలాటిది కాదు. బ్రహ్మతత్త్వమెంత శాంతమూ స్తిమితమైనదో దాని జ్ఞానం కూడా అలాంటిదే. అది ఎంత పుష్కలమైనదో ఇదీ అంత పుష్కలం. అంటే పరిపూర్ణం. రలయో రభేదః అన్నారు పుష్కరమూ పుష్కలమూ ఒకటే. **పుష్టిం.** పుష్కలత్వం దానికి తెచ్చి పెట్టుకొన్నది కూడా కాదు. సహజం. పుష్టి దాని స్వభావమే. నిత్య పుష్టా అని పేరు అమ్మవారికి. **పింగాళాం పద్మ మాలినీం.** అంతేగాక అది పింగళ. పద్మమాలిని. పింగళ మంటే పసుపు వన్నె. బంగారాని కుపలక్షణమది. బంగారం జ్ఞాన ప్రకాశానికి ద్యోతకం. హిరణ్మయీ మని గదా శ్రీ దేవిని సంబోధించారు మొదట. పోతే పద్మము లంటే అండ పిండాదు లన్నింటినీ వ్యాపించి ఉన్నదా శక్తి. మహా పద్మాటవీ సంస్థ అని అందుకే పేర్కొన్నారా మహాశక్తిని. అదే పద్మమాలిని. **చంద్రాం హిరణ్మయీం లక్ష్మీం.** ఈ మూడు మాటలకూ అర్థమింతకు ముందే వివరించి ఉన్నాము. దానినిక్కడ అనుసంధానం చేసుకోవచ్చు.

Yallamraju Srinivasa Rao www.advaitavedanta.in

మొత్తం మీద అలాటి మోక్ష లక్ష్మిని మోక్ష విద్యను **జాతవేదో మమావహ.** ఓ పరిమిత జ్ఞానరూపమైన మనసా నాకు ఆపాదించమని ప్రార్థన.

**ఆర్ద్రాం యః కరిణీం యష్టిం సువర్ణాం హేమమాలినీం సూర్యాం హిరణ్మయీం లక్ష్మీం - జాతవేదో మ మావహ - యః** ఎవడైతే అలా అందుకోవాలని కోరుతాడో వాడెవడో గాదు. **జాతవేదో మమావహ.** నేనే కనుక నాకే ఆ ఆర్ద్రమైన విద్యను ప్రసాదించు. **కరిణీం యష్టిం సువర్ణాం హేమ మాలినీం.** అది కరిణి. అన్నిటినీ నాకు సమకూర్చేది. ఒక యష్టి లాగా చేతి బెత్తంలాగా ఆలంబనమైనది. సువర్ణమైనది. మంచి ప్రకాశం గలది. హేమమాలిని. ఎడ తెగకుండా నిత్యమూ ప్రకాశించేది కూడా అది. **సూర్యాం** - సూర్యుడిలాగా దేదీప్యమానమైనదే గాక బుద్ధికి సంకేతం సూర్యుడంటే. బుద్ధికి ఆ చైతన్య ప్రకాశాన్ని అనుగ్రహించమని కూడా అర్థమే. అది హిరణ్మయి లక్ష్మి. కనుక ఎప్పుడూ వాంఛనీయమే మానవుడికి.

**తాం మ ఆవాహ జాతవేదో - లక్ష్మీ మనపగామినీం**

**యస్యాం హిరణ్యం ప్రభూతం - గావో దాస్యోశ్వాన్ విం**

**దేయం - పురుషానహమ్** ఈ మంత్ర మింతకు పూర్వం వచ్చిందే. అదే మరలా ఆవృత్తమవుతున్నది. కాబట్టి దాని అర్థమే ఇక్కడా

స్మరించవచ్చు. అంతకన్నా విశేషమేమీ లేదు. అభ్యాసమంటారు Repetation. దీన్ని. ఒక విషయం పదే పదే అభ్యాసమయ్యే కొద్దీ మనసులో బాగా గట్టి పడుతుంది. అందుకే వేదాంత గ్రంథాలలో కూడా మంత్రాలూ శ్లోకాలూ వాక్యాలూ తరుచుగా చెప్పినవే చెబుతుంటారు. అలాంటి వ్యవహారమే ఇదీ.

**యశ్శుచిః ప్రయతో భూత్వా జుహుయా దాజ్య మన్వహం**

**శ్రియః పంచ దశర్చంచ శ్రీకామ స్సతతం జపేత్ -**

ఇక్కడికి శ్రీ సూక్త భాగం సమాప్తమైనా దాని ఫలశ్రుతి భాగం మిగిలి పోయింది. దానినిప్పుడు వర్ణిస్తున్నారు. ఫలశ్రుతి అనే మాటే చెబుతుందది ఏమిటో. శ్రీసూక్త మర్థయుక్తంగా పారాయణం చేస్తే కలిగే ఫలితమేమిటో అది వినాలి మనం. అదే ఫల శ్రుతి.

**య శ్శుచిః ప్రయతో భూత్వా - జుహుయా దాజ్యమన్వహం**

**శ్రియః పంచ ద శచర్చంచ - శ్రీ కామ స్సతతం జపేత్**

ఎవడైతే స్నానాచమనాదులు చేసి శుచి అయి నియమ నిష్ఠలతో **అన్వహం** ప్రతిదినమూ **ఆజ్యం జుహుయాత్ -** అగ్నిలో ఆజ్యాన్ని హోమం చేస్తాడో - **పంచ దశర్చంచ -** అంతే కాక శ్రీదేవికి సంబంధించిన పంచదశి పారాయణం చేస్తాడో **శ్రీకామః** వాడికి భోగ భాగ్యాల మీద కోరిక ఉంటే మాత్రం **సతతం జపేత్** వాడీ శ్రీ సూక్తాన్ని నిరంతరమూ

జపించ వలసి ఉంటుంది. ఏమిటీ మాట. ఇది ఐహిక ఫలానికి చెప్పిన మాట. ఇదీ కావలసిందే మనకు. కాని ఇదే గాదు జీవిత పరమార్థం. పరమార్ధాన్ని సూచించే విషయం వేరే ఉంది.

అదేమిటంటే శుచిత్వమంటే మానసికమైన నైర్మల్యం. మనః ప్రసాద మంటారు దీన్ని. దైవ గుణాలలో మొట్టమొదట ఉండవలసిన గుణమిది. అని భగవద్గీత చాటి చెబుతున్నది. మనసు నిర్మలంగా ఉంటేనే జ్ఞాన బీజాలంకురిస్తాయి అందులో. అప్పుడు **జుహుయా దాజ్యం.** ఆ జ్ఞానాగ్ని హోత్రంలో ప్రాపంచికమైన భావాలన్నీ ఒక హవ్యంలాగా అందులో పూర్ణాహుతి చేయాలి ముముక్షులైన మానవుడు.

మనసులో ఉదయించే భావాలూ లేదా వృత్తులనేవి ఎన్నో అసంఖ్యాకంగా ఉన్నాయను కోవచ్చు మనం. అవి ఎన్ని లక్షలు కోట్లయినా అన్నీ కలిసి పంచదశ. పదిహేనింటిలో చేరిపోతాయి. గతాః కలాః పంచదశ ప్రతిష్ఠాః అని ఉపనిషత్తు. ఈ పదిహేనుకూ కళలని పేరు. కళ అంటే పరిపూర్ణ చైతన్యంలో ఏర్పడే భాగాలు. అవే వృత్తులు. వృత్తి రహితమైనది అఖండం పరిపూర్ణం. అప్పుడది నిర్వికల్పం Without parts అదే వృత్తులుగా మారిపోతే సవికల్పం. వికల్పం వృత్తి కళ అన్నీ ఒకటే. సవికల్పానికి సకలమనీ నిర్వికల్పానికి అకలమనీ పేరు. సకలంగా ఉన్నంత వరకూ మోక్షం లేదు. అది నిష్కలమైతేనే.

Yallamraju Srinivasa Rao
www.advaitavedanta.in

నిష్కలం నిష్క్రియం శాంతమన్నారు బ్రహ్మతత్త్వాన్ని. పంచదశీ మంత్రం దానికి దారి తీయాలి. అది అఖండ జ్ఞానరూపంగా మారితే పంచదశి కాదది. షోడశి అంటారు దాన్ని. హస కహల హ్రీం అని ఇత్యాదిగా ఉన్న పంచదశి జ్ఞానాగ్నిలో ఆహుతి అయి షోడశిగా మారుతుందప్పుడు. అలా మారితేనే అది కేవలం భోగాన్నే గాక అపవర్గాన్ని కూడా ప్రసాదిస్తుందీ సాధకుడికి. ఇదీ ఇందులో గుప్తమయి ఉన్న పరమార్థం.

**ఆనందః కర్దమ శ్చైవ - చిక్లీత ఇతి విశ్రుతాః**

**ఋషయస్తే త్రయః పుత్రాః - స్వయం శ్రీ రేవ దేవతా -**

ఆనంద చిక్లీత కర్దములని ముగ్గురు ఋషులున్నారు చాలా ప్రసిద్ధులు. వీరు ముగ్గురూ శ్రీ మాత కుమారులే. కాగా శ్రీ మాత స్వయంగా దేవతా స్వరూపిణి. అంతరార్థ మేమంటే శ్రీదేవి ఎవరో గాదిక్కడ. పరమాత్మ నాశ్రయించి ఉన్న మాయాశక్తి. ఆవిడ కుమారులని ప్రసిద్ధులైన ఆనందాది ఋషులెవరో కారు. సత్త్వరజస్తమో గుణాలే. అందులో సత్త్వ మానందం. కర్దమం తమస్సు. పోతే చిక్లీత రజస్సు. వీరు ఋషులంటే అర్థం మనః ప్రాణ శరీరాలుగా మారి ఆ గుణాలు బాహ్య ప్రపంచాన్ని నిత్యమూ దర్శిస్తుంటాయని.

**పద్మాననే పద్మ ఊరు - పద్మాక్షీ పద్మ సంభవే**

**త్వం మాం భజస్వ పద్మాక్షీ - యేన సౌఖ్యం లభా మ్యహామ్**

అలాటి మహాశక్తిని విద్యా స్వరూపిణిగా భావించి నన్ను ఆ రూపంతో భజించమని వేడుతున్నాడు సాధకుడు. ఏమని. అమ్మా నీవు పద్మం నుంచి జన్మించావు. కనుక నీ ముఖమూ ఊరువులూ అక్షులూ అన్ని అవయవాలూ పద్మాకృతులే. అలాటి నీవు నన్ను ఆశ్రయిస్తే తద్బలంతో నేను అన్ని సౌఖ్యాలూ పొందగలను. పద్మమంటే ఇక్కడ అండ పిండాది గోళాలు గనుక వాటన్నిటినీ వ్యాపించిన చైతన్య శక్తి నావాహన చేసుకొంటే తదాకార వృత్తి ఏర్పడి తరించగలనని సాధకుని తాత్పర్యం.

**అశ్వదాయీచ గోదాయీ - ధన దాయీ మహా ధనే**

**ధనం మే జుషతాం దేవి - సర్వ కామార్థ సిద్ధయే**

అశ్వాలను గోవులనూ ధనాలనూ - అన్నింటినీ దానం చేస్తావు నీవు. అలాంటి శక్తి నీకున్నది. నీవు మహాధనవు. కనుకనే అన్నీ మాకీయ గలవు. అలాటి ధనమంతా నాకు ప్రసాదించు తల్లీ. ధనమూల మిదం జగత్. సకలమైన కామ్యములూ మాకు దానివల్లనే ఫలించగలవు. అంతేకాదు.

**పుత్ర పౌత్రం ధనం ధాన్యం - హస్త్యశ్వావి గో రథమ్**

**ప్రజానాం భవసి మాతా ఆయుష్మంతం కరోతు మామ్ -**

పుత్రులూ పౌత్రులూ - వారి పోషణకు ధనధాన్యాలూ - అక్కడా ఇక్కడా తిరగటానికి ఏనుగులూ గుఱ్ఱాలూ గొఱ్ఱెలూ మేకలూ గోవులూ

రథాది వాహనాలూ - ఇలా జీవితానికి కావలసిన సౌకర్యాలన్నీ నాకు నీవే ప్రసాదించగలవు. ప్రజలందరికీ నీవే మాతవు. కనుక అన్నీ నీవే నీకన్న సంతానమైన మాకందివ్వాలి. అన్నిటితో పాటు వాటి ననుభవించ టానికి దీర్ఘాయుస్సు కూడా మాకు ప్రసాదించు తల్లీ.

**చంద్రాభాం లక్ష్మీ మీ శానాం - సూర్యాభాం శ్రియ మీశ్వరీమ్**

**చంద్ర సూర్యాగ్ని సర్వాభాం - మహాలక్ష్మీ ముపాస్మహే -**

మహాలక్ష్మివైన నీవెవరో గావు. ఈశ్వర చైతన్యాన్ని ఆశ్రయించిన ఈశ్వరివి. చంద్ర సూర్యాగ్ని సంబంధి అయిన ప్రకాశాలన్నీ నీవే. అలాటి దానవు గనుకనే నాకు ఐహికమైన వన్నీ ఇవ్వగలవు. అలాగే వీటి ద్వారా ఆముష్మికమైన మోక్ష మార్గాన్ని కూడా చూపగలవు. కనుక నిన్నే నేనుపాసన చేసి తరిస్తానంటాడు సాధకుడు. ఏమి కారణం. అశ్వాదుల దగ్గరి నుంచీ సూర్యాగ్నుల వరకూ అన్ని పదార్థాలూ ఆ మహాశక్తి ఉపాధులే. Media. ఉపాధులే ద్వారాలు గమ్యం చేరటానికి. కారణం. దాని వ్యక్తమైన రూపాలే ఇవన్నీ. కనుక ఈ వ్యక్తమైన ఉపాధులే అవ్యక్తమైన ఆ చైతన్య శక్తిని మనకు స్ఫురింప జేస్తాయి. ఇవన్నీ కావాలని కోరటంలో ఇదీ తాత్పర్యం.

**ధన మగ్నిర్ధనం వాయు - ర్ధనం సూర్యో ధనం వసుః**

**ధన మింద్రో బృహస్పతి - ర్వరుణం ధన మశ్నుతే -**

Vallamraju Brahmasri Srinivasa Rao www.advaitavedanta.in

ఇక్కడ బయటపెడుతున్నాడిప్పుడా అంతరార్థమేమిటో. అగ్ని వాయువూ సూర్యుడూ వసువూ ఇంద్రుడూ బృహస్పతీ - వరుణుడూ అంటున్నామంటే ఆ దేవత లెవరో కారు ధనమే. ఆ ధనాన్ని పట్టుకొంటే మనం ధనవంతులమై పోగలం. ఆంతర్య మేమంటే అగ్ని మనస్సూ వాయువు ప్రాణమూ - సూర్యుడు బుద్ధీ - వసువులు ఇంద్రియాలూ ఇంద్రుడు జీవుడి అహంకారమూ - బృహస్పతి అతని వాక్కు. వీటికవి సంకేతాలు. ఇవన్నీ మానవుడి ఇంద్రియ సంఘాతమే కాబట్టి భగవద్దత్తమైన ధన మార్జించి జ్ఞాన ధన సంపన్నులం కావాలని భావం.

**వైన తేయ సోమంపిబ - సోమం పిబతు వృత్ర హా**

**సోమం ధనస్య సోమినో - మహ్యం దదాతు సోమినీ**

సోమిని అంటే పరమేశ్వరుడితో అనపాయిని అయిన మాయాశక్తి సోముడాయన అయితే సోమిని ఆవిడ - ధనికుడయిన ఆ సోముని సోమమనే ధనాన్ని నాకీ సోమిని ప్రసాదించు గాక అని ఆకాంక్ష. అది ఎలా నెరవేరుతుంది. ప్రాణమూ మనస్సూ రెండూ సోమపానం చేయగలిగితే నెరవేరుతుంది. వైనతేయుడంటే గరుత్మంతుడు. గరుత్తులంటే రెక్కలు. ప్రాణ గమనాగమనాలే ఆ రెక్కలు. అవి కలిగిన ప్రాణ శక్తే వైనతేయుడైన గరుత్మంతుడు. పోతే వృత్రహా వృత్రా సురుణ్ణి చంపినవాడు. వృత్రాసురుడు చిత్తవృత్తి కదంబమే. అది మనస్సుకు సంకేతం. కాగా

Brahmasri Yallamraju Srinivasa Rao www.advaitavedanta.in

మనః ప్రాణాలు రెండే జీవ భావం గనుక అవి రెండూ సోమమంటే జ్ఞానామృత పానం చేసి పవిత్రమైతే చాలు. పరమాత్మ సాయుజ్యమనే ధనం మూట గట్టు కోగలడు మానవుడు. యస్య బ్రహ్మ చ క్షత్రంచ ఉభే భవత ఓదనః అనే కఠోపనిష ద్వాక్య తాత్పర్యమిదే.

**న క్రోధో నచ మాత్సర్యం - నలోభో నాశుభా మతిః**

**భవంతి కృత పుణ్యానాం భక్తానాం - శ్రీసూక్తం జపేత్సదా**

అసలు క్రోధం గాని మత్సరం గాని లోభం గాని మలినమైన మనస్సు గాని ఏ అవగుణాలూ ఏర్పడవు పుణ్యాత్ములైన దేవీ భక్తులకు. భక్తి ఒక్కటే వాటన్నిటినీ దూరంగా పారదోలగలదు. అంటే బ్రహ్మాకార వృత్తే అన్ని అసుర వృత్తులకూ జవాబు చెప్పగలదని అర్థం. అంచేత నిత్యమూ అలాటి శ్రీ దేవతా సంబంధి అయిన స్తోత్రం జపించట మెంతైనా లాభదాయకం. శ్రేయోదాయకం.

**వర్షంతు తే విభావరి - దివో అభ్రస్య విద్యుతః**

**రోహంతు సర్వ బీజాని - అవ బ్రహ్మ ద్విషో జహి -**

ఇంకా వర్ణిస్తున్నాడా బ్రహ్మాకార వృత్తిని. విభా అస్యాస్తీతి విభావరీ. విభావరి అంటే రాత్రి అని కాదిక్కడ. విభా అంటే అఖండమైన ప్రకాశం. అది దేనికుందో అది బ్రహ్మ విద్య. **తే** అది నీ స్వరూపమే గనుక. ఓ విభావరీ శ్రీ దేవతా **దివో అభ్రస్య విద్యుతః వర్షంతు -** అన్నిటికన్నా

ఉన్నతమైన దివి నుంచి అంటే చిదాకాశం నుంచి. ఎలాంటిదా దివి. అభ్రస్య. అప్పులంటే నామరూప క్రియలు. వాటిని భరించినది. తనలో గుప్తంగా ఉంచుకొన్నది. వాటినే విద్యుత్తులుగా మార్చి వర్షించు గాక. విద్యుత్తులంటే ఇక్కడ చిత్ప్రకాశ కిరణాలు. వాటిని ముముక్షువులైన మామీద **వర్షంతు** వర్షించు గాక.

వర్షిస్తే ఏమవుతుంది. **రోహంతు సర్వ బీజాని.** ఆ తేజః కిరణ బీజాలే మా మనసులలో ప్రవేశించి మొలకెత్తాలి. పెరిగి పెద్దవయి అఖండాకార ప్రకాశంగా మారి మమ్మను గ్రహించాలి. అనుగ్రహిస్తే **బ్రహ్మద్విషః అప జహి.** బ్రహ్మ పదాన్ని మాకు కనపడకుండా దూరం చేసిన శత్రువులున్నారే ప్రాపంచికమైన వృత్తులు. వాటిని నీవు త్రోసి పుచ్చి మమ్ము కాపాడిన దానవవుతావు తల్లీ. ఆధ్యాత్మికంగా చెప్పుకొంటే ఈ మంత్రాని కర్థమిదీ.

**పద్మ ప్రియే పద్మిని పద్మహస్తే - పద్మాలయే పద్మ దళాయతాక్షి**

**విశ్వప్రియే విష్ణు మనోనుకూలే - త్వత్పాద పద్మం మయి సన్నిధత్త**

అతిలోకమైన అత్యుత్తమ పద ప్రాపకమైన విద్య కాబట్టి అది- దానినే పునః పునః వర్ణించి చెబుతున్నాడు. అలా చెబితేనే అది సాధకుల మనస్సులకు బాగా పడుతుందని ఉద్దేశం. అమ్మా నీకు పద్మాలంటే ప్రియం. పద్మాలేవో గావు. ఈ చరా చర ప్రపంచాలే. నీవు పద్మినివి. అవన్నీ నీ సొంతం. పద్మ హస్తవు. వాటిని నీ చేతిలో పెట్టుకొని

నడుపుతున్నావు. పద్మాలయవు. వాటిలోనే నీ నివాసం. నివసిస్తే నీవు వాటి కుపాదానం. నడిపితే నిమిత్త కారణం. రెండూ నీవే. పద్మాదళాయ తాక్షివి. ఎప్పుడూ వాటి ప్రవర్తన నీవు గమనిస్తూనే ఉంటావు. విశ్వాని కంతా నీవు హితకారిణివి. నీకు విశ్వమంతా ఇష్టమైనదే. విష్ణువంటే విశ్వమే గదా. ఆయన మనస్సంకల్పాని కనుకూలంగా నీవూ విశ్వరూపాన్ని ధరించే మెలగుతుంటావు. అలాంటి నీమూల భూతమైన పరతత్త్వాన్ని నేను పట్టుకోవాలంటే ఆ పదాన్ని చూపే నీ పదమే మాకు శరణ్యం. కనుక నీ పాదం నామీద మోపు. నా మనసు కలాటి ఆలంబనం చూపమని దీని ఆంతర్యం.

**యాసా పద్మాసనస్థా విపులకటి తటీ పద్మ పత్త్రాయ తాక్షీ**
**గంభీరా వర్తనాభిః స్తనభర నమితా శుభ్ర వస్త్రోత్తరీయా**
**లక్ష్మీర్దివ్యైర్గజేంద్రై ర్మణి గణ ఖచితైః స్నాపితా హేమకుంభై**
**ర్నిత్యం సా పద్మహస్తా మమ వసతు గృహే సర్వమాంగళ్య యుక్తా**

మహా పద్మాటవీ సంస్థా అన్నట్టు పద్మాల లాంటి లోకాల నన్నింటినీ ఆసనం చేసుకొని కూచున్న మహాశక్తి అది. విపులమైన కటి మండల మంటే మధ్య దేశం కలది. మధ్య దేశం స్థితి కాలమే. అది సృష్టి లయాలు రెండింటి కంటే విశాలమైనదే గదా. ఇది ఆవిడ అచేతన రూపమైతే చేతనమైన దావిడ చూపు. అలాటి చూపుతో తన అచేతన దృశ్యాన్ని తానే చూస్తున్నది. అతి గంభీరమైన సుడిగుండం లాంటి

దావిడ నాభి. అది ఈ సంసార మహా సాగరమే. మహా లోతైనదిది. సుళ్లు తిరుగుతుంటుంది. విరుగు తుంటుంది. స్తనభరమంటే సుఖదుః ఖాది ద్వంద్వాలు. అవి ఈ జీవులను వంచుతున్నాయి. ముంచు తున్నాయి. అయినా శుభ్రమైన వస్త్ర ముత్తరీయంగా కప్పు కొన్నదంటే చైతన్య ప్రకాశం కూడా అక్కడే ఉన్నది మనకందకుండా. అందాలంటే ఆవిడ దాన్ని లక్షింప జేసే లక్ష్మి అయి మనల ననుగ్రహించాలి. అలా అనుగ్రహించిందా ఎవరినైనా - దివ్యమైన గజేంద్రులయి జీవించి పోయారు మనకు ముందే. గజేంద్రులంటే ముక్తజీవులైన మహానుభావులు. వారు అమూల్యమైన రత్న కలశోదకంతో ఆ మహాశక్తి నభిషేకించారు. రత్నకలశాలు వారి మనస్సులే. అందులో అమృత జలం ధారా వాహికమైన వారి వృత్తే. అలాటి పద్మహస్త మాంగళ్య యుక్త అయిన శ్రీదేవి నా మనోగృహంలో కూడా నిత్యమూ వసించాలి నాకా బ్రహ్మ జ్ఞానాన్ని ప్రసాదించాలని ఆకాంక్ష సాధకుడికి.

**లక్ష్మీం క్షీర సముద్ర రాజ తనయాం శ్రీరంగ ధామేశ్వరీం**
**దాసీ భూత సమస్త దేవ వనితాం లోకైక దీపాంకురాం**
**శ్రీ మన్మంద కటాక్ష లబ్ధ విభవ బ్రహ్మేంద్ర గంగాధరాం**
**త్వాం త్రైలోక్య కుటుంబినీం సరసిజాంవందేముకుందప్రియాం**

ఇంతకూ మనకు కావలసిన ఆలక్ష్మి ఎవరో గాదు. క్షీర సాగరం లాంటి ఈ సంసారంలో నుంచి ఆవిర్భవించినదే. శ్రీ రంగ ధామమంటే

బ్రహ్మ విద్యకు యోగ్యమైన మానవుడి మనస్సు. అదే శ్రేష్ఠమైన ఆవృత్తికి కూడా నిలయం. అలాటి బ్రహ్మాకార వృత్తి మనసులో ఉదయించిందంటే ఇక దేవ వనితలంతా దానికి దాసులే కింకరులే. దేవత లెవరిక్కడ. చక్షురా దీంద్రియ వృత్తులు. అవన్నీ ఆ అఖండ వృత్తి చెప్పు చేతల్లో నడుచుకోవలసి ఉంటుంది. లోకాలకన్నిటికీ కలిపి దీపకాంతి అది ఒక్కటే. ఒకే ఒక జ్ఞాన దీప్తి వెలిగిస్తే వెలుగుతున్నాయీ సమస్త లోకాలూ. ఇదమంధం తమః కృత్స్నం జాయేత భువన త్రయ మన్నట్టు చైతన్య మనే దీప్తి లేకుంటే చేత్యమైన ఈ జగత్తంతా అంధకార బంధురమే గదా.

అసలా బ్రహ్మ విష్ణు మహేశ్వరాదు లందరూ దేవతలని పేరే గాని వారి దివ్యత్వమూ వారి ఐశ్వర్యమూ అంతా ఆవిడ కడగంటి చూపు ప్రభావమే. అది మహాజ్ఞానం. మహాశక్తి. మిగతా అల్ప జ్ఞానమూ అల్పశక్తులూ అన్నీ అందులో జేరి పోయి దాని ఆధిపత్యంలో బ్రతక వలసినవే గదా. అలాటి త్రైలోక్య కుటుంబిని ఆ మహాశక్తి. అందరూ ఆవిడ సంతానమే. ఆవిడ పరివారమే. కుటుంబిని ఆదేవి. పరాదేవతే. ఇవన్నీ ఈ లోకాలావిడ సరసిజాలు. ఆ మహాశక్తి వివర్తాలు. అలాటి బ్రహ్మ విద్యారూపిణి అయిన ఆ శక్తిని దాసోహమంటే అదే ముకుంద మోక్షాన్ని ప్రసాదిస్తుంది మనకు. ప్రియం చేస్తుందని భావం.

Yallamraju Srinivasa Rao
Brahmasri
www.advaitavedanta.in

**సిద్ధి లక్ష్మీర్మోక్షలక్ష్మీ - ర్జయ లక్ష్మీస్సరస్వతీ**

**శ్రీలక్ష్మీర్వరలక్ష్మీ శ్చ - ప్రసన్నా మమ సర్వదా -**

కేవలం మోక్షమనే ఫలమే కాదు. మోక్షం పారమార్థికమైతే వ్యావహారికమైన జీవితంలో కూడా అన్ని సిద్ధులూ ప్రసాదించ గలదు. ఏ కార్యం తలపెట్టినా అందులో సాఫల్యమివ్వ గలదు. ఆయా విద్యలలో ఉత్తీర్ణులను చేయగలదు. శ్రీ అంటే ధనధాన్యాది సంపత్తి. అది కూడా లభింప జేయగలదు. ఇంతెందుకు కోరిన వరాలన్నీ ఒసగగలదు. ఇంతకూ ఆవిడను ప్రసన్నురాలిని చేసుకోటం మానవుడి వంతైతే వాటిని ప్రసాదించట మావిడ వంతు. ఇవన్నీ భోగాల క్రిందికి వస్తే మోక్షమనే దొక్కటే అపవర్గం. స్వర్గాపవర్గదా అని అందుకే వచ్చిందావిడకు పేరు. ఐహికాముష్మిక సుఖాలన్నీ అందించే సామర్థ్య మావిడకే ఉంది. మహాశక్తి గదా ఆవిడ. మహాశక్తి అన్నప్పుడి దేమిటి. అదేమిటి. అన్నీ ఇవ్వగలిగి ఉండాలి. అయితే ఇందులో సూక్ష్మమేమంటే ఇవి ఎన్ని ఇచ్చినా తాత్కాలికమే. అశాశ్వతమే. అది గుర్తించి మానవుడు వీటితో తృప్తి చెంది ఆగిపోక మోక్షాభిముఖంగా ప్రయాణం చేయాలి. అలా చేస్తాడా లేదా అని చూస్తుంటుందావిడ. చూచే సంసిద్ధత ఉంటే అప్పుడు వాణ్ణి మోక్ష లక్ష్మి అయి శాశ్వతంగా అనుగ్రహిస్తుంది.

**పరాంకుశే పాశ మభీతి ముద్రాం -**

**కరై ర్వహంతీం కమలాసనస్థాం -**

Vallamraju Brahmasri Rao www.advaitavedanta.in

**బాలార్క కోటి ప్రతిభాంత్రి నేత్రాం -**

**భజేహ మంబాం జగదీశ్వరీం తాం -**

అంచేత ఇవీ అవీ గాక కేవలం మోక్ష ఫలాన్నే కోరి సేవించే ముముక్షువే అయితే మానవుడిలా భావించాలా మహాదేవిని. గొప్ప అంకుశమూ పాశమూ. అంటే రాగద్వేషాలని భావం అవే వరాలు. వాటితో పాటు అభయ మిచ్చే ముద్ర. ఇవన్నీ చతుర్భుజాలతో ధరించి చూపుతున్నది. సమస్త లోకాలూ అధిష్ఠించి కోటి సూర్య ప్రకాశంతో కనిపిస్తూ త్రినేత్రాలతో చూస్తున్నట్టు దర్శించాలా మూర్తిని. కోటి సూర్య ప్రకాశమా చైతన్య దీప్తి. తృతీయ నేత్ర మా చైతన్య స్థానమే. అది కావాలా నీకా రాగద్వేషాది ద్వంద్వాలు కావాలా అని మౌనంగా హెచ్చరిస్తున్నది మనలను. అవన్నీ కాదా చైతన్య ప్రకాశమే కావాలని కోరితే వాటి నుప సంహరించి దీనినే మనకు ప్రసాదిస్తుందని తాత్పర్యం.

**సర్వ మంగళ మాంగళ్యే - శివే సర్వార్థ సాధికే**

**శరణ్యే త్ర్యంబకే దేవి - నారాయణి నమోస్తుతే**

కాబట్టి సర్వమంగళాలకూ నిలయమైన దామంగళ మూర్తి. కర్తవ్యోమహ దాశ్రయః అన్నారు. మిగతా కోరికలు కోరకుండా మానవుడీ జంజాటంలో నుంచి బయట పడేదెలాగా అని మోక్ష ఫలాన్నే కోరుకోవాలి. అప్పుడదే గాక దానితో పాటు ఇవి కూడా సంక్రమిస్తాయి మనకు. ఇదే శివం. నిశ్శ్రేయసం. Summum Bonum సకల పురుషార్థాలూ అది

ఒక్కటే సాధించి పెట్టగలదు మానవుడికి. త్ర్యంబక నారాయణీ గదా ఆవిడ. తృతీయ నేత్రం జ్ఞానానికి చిహ్నమైతే నారాయణత్వం దానివల్ల అందుకొనే పరమ పదానికి సూచకం. ఆవిడనే శరణ్యమని నమ్మిన వాడి కలాటి మహాఫలాన్ని ప్రసాదించటంలో సందేహం లేదు.

**సక్తు మివ తితఉ నాపునంతో -**

**యత్ర ధీరా మనసావాచ మక్రత**

**అత్రా సఖాయ స్సఖ్యాని జానతే -**

**భద్రైషాం లక్ష్మీర్నిహితాధివాచి -**

తితఉ అంటే సంస్కృతంలో జల్లెడ అని అర్థం. సక్తువంటే పిండి. పిండి జల్లెడ పడితే శుభ్రంగా ఉంటుంది. అలాగే వాక్కును జల్లెడ పట్టారట పూర్వం ప్రజ్ఞావంతులైన ఋషులు. వాక్కునెలా జల్లించ గలిగారంటే మనస్సుతో. వాక్కంటే అది రెండు విధాలు. ఒకటి అనాహతం మరొకటి ఆహతం. ఆహతం నోటితో ఉచ్చరించేదైతే అనాహతం మనసులో కలిగే సంకల్పం. దాన్ని పట్టి మొదట పరిశుద్ధం చేసుకోవాలి. సవికల్పం గాక నిర్వికల్ప మైనప్పుడే అది పరిశుద్ధి చెందటం. అలాటి శోధన చేసి అచలమైన స్థితి నందుకొన్న వాడే ధీరుడు.

అలాటి ధీరులైన మహర్షులకు సజాతీయమైన ధీ బలమున్నవారే వారికి సఖులు. సఖిత్వమంటే సాజాత్యం. ఆస్థాయి నందుకొన్న పెద్దలే వారికి కలిగిన ఆత్మానుభవమేదో దాన్ని తమ అనుభవానికి తెచ్చుకోగలరు.

Yalamanchili Srinivasa Rao
www.advaitavedanta.in

తమ స్వానుభవానికి తెచ్చుకొన్నప్పుడు వారేది మాటాడినా ఆవాక్కులో శుశ్రూషువులైన మనబోటి వారికి మేలు చేసే లక్ష్మి నిహితమయి ఉంటుంది. లక్ష్మి అంటే ఏమని చెప్పాము. పరతత్త్వాన్ని చేర్చే అఖండాకార వృత్తి అని గదా చెప్పాము. అది వారి వాక్కే మనకందిస్తుంది. ఆ వాక్కుకు శక్తి వారి నిర్వికల్పమైన చిత్తవృత్తి వల్లనే సంక్రమించింది. అది వారెంత గానో ధారణా ధ్యానాదులు చేసి పదును పెట్టుకొంటేనో అలవడిందని భావం.

**ప్రణో దేవీ సరస్వతీ - వాజేభి ర్వాజినీ వతీ - ధీనా మవి త్ర్యవతు**

అలాంటి మహనీయుల బోధలు విని తద్వారా పరమ పద ప్రాపకమైన ఆ మహాలక్ష్మిని ప్రసన్నను చేసుకొంటే చాలు. ఈ సాధకుడి కది సరస్వతి కాగలదు. సరస్వతి అంటే అర్థం చెప్పామింతకు పూర్వం. మరలా మానవుడి చిత్త వృత్తి నసలైన గమ్యాని కభిముఖంగా ప్రసరింప జేసేదని. అది వాజినీవతి. అతి వేగవతి. వికల్పాలను త్రోసి పుచ్చే కొద్దీ వేగంగా తీసుకెళ్లుతుంది గమ్యాభి ముఖంగా. మన దగ్గరున్న ఇంద్రియ వృత్తులన్నీ కూడా తదభి ముఖంగా శీఘ్ర గతితో ప్రయాణం చేస్తాయి. మన బుద్ధులన్నింటినీ కంటికి రెప్పలాగా కాపాడుతూ పోతుందది. అలాటి స్వభావమున్నది గనుకనే ఆ అఖండ వృత్తి మనకు అవిత్రి అయి అవతు. రక్షణ కల్పించాలని శ్రద్ధాభక్తులు సడలకుండా ధ్యానిస్తూ పోవాలి మనం.

Yallamraju Srinivasa Rao Brahmasri
www.advaitavedanta.in

**గౌరీ మిమాయ సలిలాని - తక్ష త్యేక పదీ**

**ద్విపదీ సా చతుష్పదీ**

**నవ పదీ బభూ వుషీ సహస్రా కర్హా**

**పరమే వ్యోమన్ -**

ఆఖరి మంత్ర వర్ణమిది. మన ప్రయాణం కూడా దీనితో ఆఖరవుతుంది. అధోముఖంగా చేసిన మన ప్రయాణం ఊర్ధ్వముఖంగా సాగాలిప్పుడు. మొదటిది సంసార బంధం తెచ్చి నెత్తిన పడేస్తే రెండవది సాయుజ్య సుఖాన్ని అందిస్తుంది. నిగ్రహాను గ్రహాలకు రెంటికీ సమర్ధ మయిందా శక్తి. ఒకటి అవిద్యా రూపిణి. ఇంకొకటి విద్యారూపిణి.

అవిద్యా రూపంగా ఆ గౌరి **మిమాయ** సృష్టించింది. ఏమిటి. **సలిలాని.** పృధివ్యాది భూత పంచకాన్ని. **తక్షతి.** సృష్టించిందంటే మరలా అది ఆరంభం కాదు. పరిణామం కాదు - వివర్తం. ఒక వడ్రంగి చెక్కను తలుపు రూపంలో మలచినట్టు మలచింది. అదే తక్షణమంటే. చెక్కటమనే అర్థం. అలా మలచే సరికది **ఏకపదీ ద్విపదీ సాచతుష్పదీ అష్టాపదీ నవపదీ.** ఏకరూపంగా ఉన్న ఆ శక్తే రెండూ నాలుగూ ఎనిమిది తొమ్మిది ఇలా అనేక రూపాలలో భాసిస్తున్నది. **బభూవుషీ సహస్రాక్షరా -** వేలకొలది ఆకారాలలో ఇలా కనిపిస్తున్నా అది అక్షరమే ఆ మహాశక్తి. క్షరమై పోలేదు వాస్తవంలో. ఇదంతా కేవలం దాని ఆ

Vallamraju Srinivasa Rao
www.advaitavedanta.in

భాసే. ఆ భాస అని విద్యా రూపిణి అయి మరలా మనకుపదేశిస్తుంది. **పరమే వ్యోమన్.** అలాటి జ్ఞాన బలసంపన్నులం కాగలిగితే తప్పకుండా మనమెప్పటి నుంచో దూరమయి పోయామనుకొన్న పరిపూర్ణ చిదాకాశాన్నే అందుకొని అందులోనే శాశ్వతంగా నిలిచిపోగలం.

**ఓమ్**

**శాంతి శ్శాంతి శ్శాంతిః**

అంతకన్నా మానవుడు తన జీవితానికి కోరదగిన శాంతి ఏమున్నది. ఆధ్యాత్మికాధి భౌతికాధి దైవికములనే త్రివిధ తాపాలూ శాంతించినట్టే. సంసారమనే భ్రాంతి పూర్తిగా తొలగినట్టే. సర్వాత్మ భావమనే దివ్యకాంతి దేదీప్యమానంగా మనకు లభించినట్టే. ఫలశ్రుతి వ్యాజంతో చేసిన ఈ వర్ణన అంతా ఒక విధంగా మానవుడికి చేసే బోధన అనుకోవచ్చు. మరొక విధంగా దాని సాధన అనుకోవచ్చు కూడా. పరమ సిద్ధి ప్రతిపాదన అనుకొన్నా అనుకోవచ్చు. ఏమనుకొన్నా అదంతా అద్వైతానుభవమే అపరోక్ష జ్ఞాన వైభవమే.

Yallamraju Srinivasa Rao
www.advaitavedanta.in

# పురుష సూక్త - రహస్యార్థము

శ్రీ సూక్త రహస్యాన్ని గ్రహించాము. ఇక పురుష సూక్త తాత్పర్య మేమిటో గ్రహించ వలసి ఉంది. శ్రీ పురుష - ఇవి రెండే ఉన్న తత్త్వాలు. తత్త్వమంటే ఏది పోయినా ఎప్పటికీ నిలిచి ఉండేదేదో అదీ. అలాంటివి రెండే ఉన్నాయి. ఒకటి చైతన్యం. మరొకటి దాని శక్తి. దాని శక్తి ఏదో గాదు దాని స్థితే. వీటికే చితి స్థితి అని పేరు పెట్టారు అద్వైతులు. స్వరూప విభూతులని జ్ఞానైశ్వర్యాలని వస్తువూ దాని విభూతి అని ఆత్మా నాత్మలని ప్రకృతి పురుషులని వీటికే ఎన్నో ఉన్నాయి నామాంతరాలు. ప్రకృతిం పురుషం చైవ విద్ధ్యనాదీ ఉభావపి అని భగవద్గీత రెండింటినీ అనాది అని వర్ణించింది. రెండ నాదు లుంటాయా అని అడిగితే మత్తః పరతరం నాన్య త్కించి దస్తి అని ఆ భగవానుడే చాటుతున్నాడు. శక్తి శక్తి మతో రభేదః - శక్తికీ శక్తిమంతుడికీ ఎప్పుడే గాని తేడా ఉండబోదు. సూర్యమండలం పురుష తత్త్వమైతే దాని ప్రకాశం శక్తి తత్త్వం.

ఇప్పుడీ శక్తి తత్త్వమే శ్రీ. అది దేని నాశ్రయించి ఉన్నదో అది పురుష. శ్రీ అంటే ఆశ్రయించేదనే గదా అర్థం చెప్పాము. శక్తి అనే దెప్పుడూ అచేతనం కాబట్టి తనపాటికి తానుండ లేదు. ఒక చేతన పదార్థాన్ని అంటి పట్టుకొని ఉంటేనే దానికి ఉనికి. ఆ చేతన పదార్థమే పురుష. పురుష అంటే మగ అనీ శ్రీ అంటే ఆడ అనీ గాదు అర్థం. అది కేవలం బాహ్యమైన శబ్దార్థం. అంతరార్థ మేమంటే పూర్ణత్వా త్పురుషః - పరిపూర్ణమైన చైతన్యానికే పురుష అని పేరు. అలాగే దానితో అవినాభూతంగా ఉన్న పరిపూర్ణ శక్తికే శ్రీ అని పేరు. అర్థ నారీశ్వరం లాగా రెండూ ఒకే ఒక తత్త్వం. అలాగే భావించాలి మనం. శివ శక్తులివి రెండూ చెప్పు కోటానికి రెండుగా కనపడుతున్నా వాస్తవంలో ఉన్నదెప్పుడూ శివతత్త్వమే. అదే పురుష.

కాని అది తన పాటికి తాను నిరాకారమైన జ్ఞానమే కాబట్టి నామరూపాదులైన ఏ ఉపాధులతో సంసర్గం లేకుండా నిరుపాధికమయి ఉంటుందెప్పుడూ. అయినా దానితో ఒక అఖండమైన శక్తి కూడా కలిసి మెలిసి ఉంది కాబట్టి ఆ శక్తి ప్రభావంతో ఇచ్ఛా క్రియా ఫలానుభవాలనే భూమికలలో క్రిందికి దిగి వచ్చింది. వచ్చిందంటే నిజంగా వచ్చిందని గాదు మరలా. రావటానికీ పోవటానికీ దానికన్యంగా వేరొక దేశమనీ కాలమనీ వస్తువనీ ఉంటేగా. మరి అలాంటప్పుడు దిగి వచ్చిందని ఎలా

Brahmasri Yallamanchili Srinivasa Rao www.advaitavedanta.in

చెప్పారు. అదే గాక దానికొక అద్భుతమైన శక్తి ఉందనే మాట మరచి పోతున్నారు. ఇదుగో ఆశక్తితో అది దేశ కాలాదులన్నీ సృష్టించు కోగలదు. గలదంటే అంతకు ముందు లేనిదాన్ని క్రొత్తగా తయారు చేస్తుందని గాదు. తానే తనపాటికి తానుంటూ క్రొత్త క్రొత్త వేషాలు వేసుకొని కనిపిస్తుంటుంది. తాను స్వరూపమైతే అవన్నీ దాని విభూతి. సువర్ణమూ దాని ఆభరణాలలాగా. ఆభరణాలు సువర్ణానికెలా వేరుగావో ఈ దేశకాల వస్తువులు కూడా దానికి వేరుగావు. వ్యక్తమైన జగత్తు దాని శక్తే. ఆ శక్తి దాని కాశ్రయమైన శివమే. అప్పుడే అది పురుష అవుతుంది. అప్పటికిదీ అదీ ఒకటే. ఇది దాని విభూతి. అది దీని స్వరూపం. ఇదంతా అదేనని గుర్తించటానికే అది ఇలా దిగి వచ్చిందని కల్పించి చెప్పటంలో ఉన్న ఆంతర్యం. అప్పుడే దీని నంత కంతకూ ఆ స్వరూపంలో కలుపుకొంటూ క్రింది భూమిక నుంచి పయి భూమికకు ప్రయాణం చేస్తుంది మన బుద్ధి. ఇదే సాధన అధ్యాత్మ రంగంలో.

అందుకోసమే ఇప్పుడు నిరుపాధికమైన ఆ పురుష స్వరూపాన్నే మన ప్రతిపత్తి సౌకర్యం కోసం సోపాధికంగా వర్ణిస్తూ పోతున్నది పురుష సూక్తం. నారాయణ సూక్తమని కూడా పేరు దీనికి. నరుల కయన మేదో అది నారాయణ. నరులంటే ఇటు జీవుడైనా కావచ్చు. అటు జగత్తయినా కావచ్చు. వీటి సమూహమే నార. నారమే అయన మంటే

ఆధారం నారాయణ. జీవ జగత్తులు రెండూ అందులో నుంచే గదా వచ్చాయి. వచ్చాయంటే దాని వివర్తమే - దాని ప్రకటమైన రూపమే ఇది అని అర్థం. ఇలా వచ్చినట్టు కనిపించే ఈ ఆభాసను పట్టుకొని మరలా మన బుద్ధి తదభిముఖంగా సాగిపోవాలి. కాబట్టి అదీ అయనమే. అయన మంటే ఇక్కడ గమ్యమని అర్థం. రెండు విధాలా సరిపోతుందీ మాట. ఇంతకూ సోపాధికమైన ఈ రూపం ద్వారా నిరుపాధికమైన ఆ తత్త్వాన్ని ఎలా అందుకోవాలో ఆ విధానాన్ని జాగ్రత్తగా వినండి.

**ఓమ్ సహస్ర శీర్షా పురుష - స్సహ స్రాక్ష స్సహస్ర పాత్**

**స భూ మిం విశ్వతో వృత్వా - హ్యత్యతిష్ఠ ద్దశాంగుళమ్ -**

ఓంకారంతో మొదలవుతున్నది మంత్రం. ఓమ్మంటే సోహం. అదే ఇదీ అని అర్థం. అదే గదా ఈ రూపంలో భాసిస్తున్నది. ఎవరా అది. ఏమిటా రూపం. వర్ణిస్తున్నాడు. సః ఆ పూర్ణమైన నిరాకారమైన తత్త్వమే అది అంటే. నిరాకారమైన ఆ పురుష తత్త్వమే ఇప్పుడీ రూపంలో కనిపిస్తున్నది. ఏమిటా రూపం. ఒకటి గాదు. వేలకు వేల శిరస్సులు దానికి. వేలకు వేల అక్షులు. అలాగే వేలకు వేలు పాదాలు. అన్ని వేల అవయవా లెప్పుడు చూచాము దానికి. చూచినట్టు చేసినట్టు పేర్కొంటున్నారే అంటే దాని కున్నాయని గావివన్నీ. ఇవన్నీ ఉన్నవి మనబోటి జీవులకు, కోటాను కోట్లున్నారు గదా ఈ జీవులు. వీరందరికీ

ఉన్న శిరో నేత్ర పాణి పాదాద్యవ యవాలన్నీ కలిస్తే ఎన్నో కోట్ల అవయవాలవుతాయి గదా. కాగా ఇప్పుడీ మనబోటి జీవుల అవయవాలే దాని అవయవాలు. నిరాకారమైన ఆ పురుష స్వరూపం సాకారమైతేనే గదా ఇవన్నీ ఇలా భాసిస్తున్నాయి. దాని చైతన్య ఖండాలే ఈ జీవులైతే దాని శక్తి ఖండాలే ఈ జీవకోటి శిరః పాణ్యాది అవయవాలన్నీ. అప్పటికి మనదంటూ ఏదీ లేదు. మనమే దానికి వేరుగా లేనప్పుడు మన శరీరేంద్రియాలు మాత్రం దానికి వేరెలా అవుతాయి. అయినా ఇలా కనిపిస్తున్నా యంటే ఇవి – అదే ఇలా ఈ ఈ రూపాల్లో భాసిస్తున్నదని అర్థం చేసుకోవాలి మనం.

**సభూమిం విశ్వతో వృత్వా -** అది ఈ రూపాలుగా భాసించటమే కాదు. ఈ భూమండలాన్ని అన్ని వైపులా వ్యాపించి కూడా ఉంది. భవతీతి భూమిః ఏది జన్మించిందో అది భూమి. ఆ పురుష తత్త్వం నుంచి జన్మించిందేమిటి. అండ పిండ బ్రహ్మాండాలన్నీ. అప్పటికి భూమిని వ్యాపించిందంటే సృష్టినంతా వ్యాపించిందని అర్థం. వ్యాపించి ఎలా ఉందది. **అత్యతిష్ఠ ద్దశాంగుళం.** ఒక పది అంగుళాలు దీనిని మించి పయిన ఉన్నదట. తత్త్వాధికా తత్త్వమయీ అని అమ్మవారి నామాలు గుర్తుకు వస్తున్నాయి. ఈ బ్రహ్మాండ రూపంగా ఎంత కనిపిస్తున్నదో అది – దీని కదనంగా అంత ఉన్నది. అంటే స్వరూపంగా

Brahmasri Yallamraju Srinivasa Rao www.advaitavedanta.in

విభూతిగా కూడా ఉన్నదొకే ఒక పురుష తత్త్వం. సోపాధిక మదే. నిరుపాధికమదే.

అయితే ఈ దశాంగుళ మేమిటి. దశాంగుళ మంటే పది అంగుళాలని అర్థం. పది అంగుళాల ఎత్తున ఉన్నదా అది ఈ భూమికి. కాదు. పది అంటే ఇక్కడ పది దిశలు. అంగుళ మంటే కోణమని అర్థం. పది దిక్కులూ పది కోణాలు కేంద్రానికి. దశావరా విరాట్ - విరాడన్న మని - శ్రుతి చెబుతున్నది. దశ దిశలూ విస్తరించి ఉన్నదీ విరాట్టు. వివిధ రూపాలుగా రాజిల్లేది విరాట్టు. భువన కోశం Universe. అదే అన్నం Matter. పాంచ భౌతికమైన ప్రపంచం. జ్ఞానానికి విషయం. జ్ఞాన మన్నాద అయితే ఇది దాని కన్నం. ఈ అన్న రూపమైన ప్రపంచమే దశాంగుళం. దశాంగుళ మంటే మరొక అర్థం కూడా చెప్పుకోవచ్చు. మన హృదయం నాభి నుంచి పది అంగుళాల పైన - మెడ నుంచి పది అంగుళాలు క్రిందా ఉంది. అది ప్రాజ్ఞ రూపుడైన జీవుడికి నిలయం. ఈశ్వరుడే జీవరూపంగా వచ్చి హృదయంలో చేరాడు గనుక దశాంగుళాల మేర అతిక్రమించి పురుషుడున్నాడనే మాట సరిపోతుంది. దీన్ని దాటి కూడా ఉన్నదా పురుష. దీన్ని వ్యాపించీ ఉంది. విభూతిగా వ్యాపించింది. స్వరూపంగా అతిక్రమించింది.

**పురుష ఏవేదగ్ం సర్వం - యద్భూతం యచ్చ భవ్యం**

**ఉతామృత త్వస్యేశానో - యదన్నే నా తిరోహాతి**

అంతే కాదు. ఇంతవరకూ వర్ణించిన దాన్ని బట్టి దేశమంతా పురుషుడే వ్యాపించి ఉన్నాడని తెలుసుకొన్నాము. ఒక్క దేశమే గాదు. కాలాన్ని కూడా వ్యాపించి ఉన్నాడా పురుషుడు. **పురుష ఏవేదగ్ం సర్వం.** ఈ సర్వమూ పురుషుడితోనే నిండి పోయింది. నిండటమే గాదు. ఇదంతా పురుషుడే అసలు. ఏమిటా ఇది. కాలం **యద్భూతం యచ్చ భవ్య** మంటున్నాడు. భూత భవిష్యత్తులు రెండూ అటూ ఇటూ నిండి పోయి ఉన్నాడు. అవి రెండూ కూడా అదే తత్త్వం. ఇటూ అటూ అన్నప్పుడు మధ్యమే మయింది. మధ్యమంటే వర్తమానం. ఇటూ అటూ అన్నప్పుడు మధ్యం మాత్రమది గాదా. మధ్యలో ఉండే గదా వ్యాపిస్తా డిరువైపులా. అప్పటికి భూత భవిష్య ద్వర్తమాన రూపంగా కనపడే కాలమంతా పురుషుడే.

ఇంకా ఎలా ఉన్నాడా పురుషుడు. త్రికాలాలూ వ్యాపించి త్రికాలాలూ తన స్వరూపమే కాబట్టి **ఉతామృత త్వస్య ఈశానః** అమృతత్వమనేది అతని అధీనంలో ఉన్నది. అంటే అతడమృతుడు. ఎప్పటికీ నిలిచి ఉంటాడు. కాలమతని మీద పని చేయదు. కాలాని కీశ్వరుడయిన వాడి మీద కాలమెలా చేయి చేసుకోగలదు. నామ రూపాత్మకమైన ప్రపంచమనే అన్న మొకటి ఉంది గదా. దానిచేత పరిచ్ఛిన్నుడు కాడా అంటే **యదన్నే నా తిరోహతి** ఈ అన్నం దాన్ని తిరోహితం చేయదు. మరుగు పరచదు. అది ఈ ప్రపంచంలాగా

Yalamanchi Brahmaji Srinivasa Rao www.advaitavedanta.in

నామరూపాత్మకమైనది కాదు. జీవుడి లాగా దీనిచేత తిరోహితమైన చైతన్యమూ కాదు. అతి రోహితం. దీని క్షేత్రాన్ని అతిక్రమించి దీనికి విలక్షణంగా ఉన్నది. అయితే ఈ దేశకాలాలు రెండింటి స్వరూపమూ అదే నన్నారు గదా. దీనితో చేతులు కలిపినప్పుడు దీని ప్రభావం దాని మీద పనిచేయదా. ఏ మాత్రమూ చేయదు. కారణం.

**ఏతావా నస్య మహిమా - అతో జ్యాయాంశ్చ పూరుషః**

**పాదోఽస్య విశ్వా భూతాని - త్రిపాదస్యా మృతం దివి -**

**ఏతావా నస్య మహిమా -** ఇదంతా ఏదో పరాయిది గాదు దానికి. దాని మహిమే ఇది. మహత్త్వమే మహిమ. విస్తార Expansion మని అర్థం. దీన్నే విభూతి అని కూడా పేర్కొనవచ్చు. వివిధ రూపాలుగా విస్తరించి కనిపించే దేదో అది విభూతి. సౌరమండలమే విస్తరించి కనిపిస్తే ఆ ప్రకాశం దాని విభూతి. విభూతి స్వరూపాన్ని ఏమీ చేయదు. చేయలేదు కూడ. ఎందుకంటే అదే ఇది. అంటే ఈ దేశ కాల వస్తు రూపంగా వ్యాపించిన దంతా అదే. ఆ పురుష తత్త్వమే.

అయితే ఇలా వ్యాపించిందన్న మాత్రాన ఈ మేరకే అది ఆగిపోయింది – ఇక్కడికే సమసి పోయిందని మరలా అపోహ పడరాదు. ఇక్కడికే పరిచ్ఛిన్న మయి పోలేదట. మరేమిటంటారు. **అతో జ్యాయాంశ్చ పూరుషః -** దీన్ని మించి దీని కదనంగా కూడా ఉన్నదా తత్త్వం.

కారణమనే దెప్పుడూ రెండు విధాలుగా ఉంటుంది. ఒకటి ఉపాదానం. Material Cause మరొకటి నిమిత్తం Efficient Cause. ఇందులో ఉపాదానం సామగ్రిని సప్లయి చేస్తుంది. నిమిత్తం దాని నుపయోగించి పని చేస్తుంది. మొదటిది జడం. రెండవది చేతనం. మట్టి జడమైతే కుమ్మరి చేతనుడు. కేవలం మట్టి కుండగా మారలేదు. మట్టి లేకుండా కేవలం కుమ్మరి దాన్ని తయారు చేయలేడు. రెండూ తోడ్పడాలి కుండ అనే కార్యం జన్మించటానికి. అయితే ఒక విశేష మేమంటే కుమ్మరి బయటనే ఉంటాడు. కుండలోపలికి రాడు. మట్టి లోపల జేరి కుండనంతా వ్యాపిస్తుంది. అంటే నిమిత్తం వెలపల మాత్రమే ఉంటే ఉపాదానం కార్యం లోపల ఉంటుంది.

ప్రస్తుతం జగద్వ్యవహారం కూడా ఇంతే. బ్రహ్మాండ భాండ మన్నారు దీన్ని. దీనికి కూడా కుమ్మరి లాంటి ఈశ్వరు డొకడున్నాడు. వాడు నిమిత్త కారణం. కాగా ఉపాదాన కారణమూ ఒకటున్నది. అదే ఆయన నాశ్రయించి ఉన్న పరాశక్తి. తన శక్తి ద్వారా ఈ బ్రహ్మాండ మనే కార్యం లోపలికి వచ్చాడా ఈశ్వరుడు. అంటే సద్రూపంగా జగత్తునంతా వ్యాపించి కనిపిస్తున్నాడు. చిద్రూపంగా దీని కతీతంగా ఉండి దీని వ్యవహారమంతా గమనిస్తున్నాడు. తానూ తన శక్తీ వేరుగావు గనుక నిమిత్తమూ తానే ఉపాదానమూ తానే అనుకొన్నప్పుడు లోపలా వెలపలా కూడా అభిన్న

నిమిత్తోపాదాన రూపంగా తానే ఉన్నాడు. అప్పుడే అది పురుష అంటే పూర్ణమనే మాట చెల్లుతుంది కూడా.

అదే వర్ణిస్తున్నాడిప్పుడు నారాయణ మహర్షి. ఏమని. **పాదోస్య విశ్వాభూతాని.** సమస్తమైన ఈ చరాచర ప్రపంచమూ నాలుగు పాదాలలో కేవలమొక పాదమే ఆ పురుషుడికి. అంటే అర్థం. ఉపాదానం కూడా తానే గనుక సమస్త భూతాల రూపంగా తానే ఇలా భాసిస్తున్నాడా పరమాత్మ. మరి ఇంతేనా ఇక్కడికే సమసిపోయాడా అంటే అలా కాదు మరలా. **త్రిపాదస్యామృతం దివి.** ఇంకా మూడు పాదాలున్నా యదనంగా. అవి ఈ సృష్టితో ఖర్చయి పోలేదు. అలా ఖర్చయి పోతే అది మృతం. మృతమంటే ఎప్పటికప్పుడు మారిపోయేది. మారుతూ మారుతూ చివరకు మాసిపోయేది. ప్రాపంచికమైన పదార్థాలన్నీ అలాంటివే. ఇది మన కనుభవ సిద్ధమే. మనమూ పోతున్నాము మనం చూచేదీ పోతున్నది. కారణం రెండూ విశేష రూపాలే. ఈ దృక్కూ విశేషమే. ఇది చూచే ఆ దృశ్యమూ విశేషమే. విశేషాని కెప్పుడూ నిలకడ లేదు. క్షణ క్షణ పరిణామ శీలం.

పోతే ఆ పురుష స్వరూపమీ జీవ జగద్రూపంగా ఒక వంతు మారుతున్నా మిగతా మూడు వంతులు మారకుండా అలాగే నిలిచి ఉన్నది. **త్రిపాదస్య అమృతం దివి.** ఇంకా మూడు పాదాలున్నా

యదనంగా. అవి ఈ సృష్టితో ఖర్చయి పోలేదు. అలా ఖర్చయి పోతే అది మృతం. మృతమంటే ఎప్పటికప్పుడు మారిపోయేది. మారుతూ మారుతూ చివరకు మాసిపోయేది. ప్రాపంచికమైన పదార్థాలన్నీ అలాంటివే. ఇది మన కనుభవ సిద్ధమే. మనమూ పోతున్నాము. మనం చూచేదీ పోతున్నది. కారణం రెండూ విశేష రూపాలే. ఈ దృక్కూ విశేషమే. ఇది చూచే ఆ దృశ్యమూ విశేషమే. విశేషాని కెప్పుడూ నిలకడ లేదు. క్షణ క్షణ పరిణామ శీలం.

పోతే ఆ పురుష స్వరూపమీ జీవ జగద్రూపంగా ఒక వంతు మారుతున్నా మిగతా మూడు వంతులు మారకుండా అలాగే నిలిచి ఉన్నది. **త్రిపాదస్యఅమృతం దివి.** ఎక్కడ ఎలాగా. **దివి.** తన చైతన్య ప్రకాశంలో. ఎలాగ. **అమృతం -** ఏలాటి మార్పూ లేకుండా. మృత మంటే మారట మన్నప్పు డమృతమంటే మార్పు లేదనే గదా అర్థం. ఏమిటా మూడు వంతులు. తేజో బన్నాలే ఆ మూడూ. తేజస్సు అప్పు అన్నం. అప్పంటే జలం. అన్నమంటే పృథివి. అప్పటికి పృథి వ్యప్తేజస్సులే ఆ మూడు పాదాలూ. ఇవి మూడూ అమృతం మారవంటున్నాడు. ఇది ఎలా సాధ్యం. పృథి వ్యాదులు మారుతున్నట్టే గదా మనకు కనిపిస్తున్నాయి. మనకు కనిపిస్తున్నాయంటే అవి భూతాలు. అవి మారుతూనే ఉంటాయి. పురుష సూక్తం చెబుతున్నవి భూతాలు కావు. వాటికి మూలమైన భూత

తన్మాత్రలు. వీటి సూక్ష్మాతి సూక్ష్మమైన మూల తత్త్వాలు. అవి స్థూల రూపం ధరిస్తే భూతమవుతాయి. ధరించకుండా అలాగే అవ్యక్తంగా ఉండిపోతే ఆ దశలో నిరాకారం. గనుక మృతం కావవి అమృతం. భూతాలుగా మారి సాకారమైతే అమృతం కావప్పుడు మృతం.

ఇప్పు డేమయిం దింతకూ. ఒకే పురుష తత్త్వం తేజోబన్నాత్మక మైన శక్తి రూపంగా ఎలాటి మార్పు లేకుండా అమృతంగా ఉంటూనే అదే వ్యక్తమయి భూత ప్రపంచ రూపంగా బయటపడితే మృతమై పోతున్న దెప్పటికప్పుడు. అప్పటికి మారుతున్నదీ అదే. మారకుండా ఉన్నదీ అదే. మారకుండా ఉన్నదే ప్రతిక్షణమూ మారిపోతూ ఉన్నది. ఇలా క్షణ క్షణమూ మారుతున్నదని మాటే గాని వాస్తవంలో ఏ మాత్రమూ మారటం లేదది. అనేజ దేకం - మనసో జవీయః - అని ఈశావాస్యం ఘోషిస్తున్న సత్యమిదే. నిర్గుణంగా మారదు. సగుణంగా మారుతుంది. నిర్గుణంగా అమృతమూ. సగుణంగా మృతమూ. అయితే ఒక పదార్థం మృతమని చెప్పినప్పు డమృతమెలా కాగలదు. ఇది పరస్పర విరుద్ధం గదా అంటే వైరుధ్యమేమీ లేదంటా రద్వైతులు. ఎలాగంటే అమృతం దాని స్వరూపం. మృతం దాని ఆ భాస. ఆ భాస వస్తువు గాదు. కాక పోదు. మన నీడ మన శరీరమేనంటారా కాదంటారా. నీడగా చూస్తే కాదు. శరీరంగా చూస్తే అవును. సర్వం వస్తు సదాత్మ నా సత్యం

స్వతస్తు అనృత మేవ అన్నారు భాష్యకారులు. నీడ స్వతహాగా సత్యం కాదు. మన శరీరమే అలా కనిపిస్తున్నదని చూస్తే సత్యం. అలాగే చైతన్య చ్ఛాయగా ఈ ప్రపంచం మిథ్య. చైతన్యంగా తథ్యం. కనుక మృతమని పేర్కొన్నా ఇబ్బంది లేదు. అన్యోన్య వైరుధ్య మంత కన్నా లేదు. రెండూ వస్తువు Actual లైతే వైరుధ్యం గాని ఒకటి వస్తువయి వేరొకటి ఆభాస అయితే లేదు. ఏతా వతా ముందు చెప్పిన దేశ కాలాలే గాక సమస్త భూతాలూ పరమాత్మే నని వర్ణించటం వల్ల దేశ కాల వస్తువులనే మూడింటినీ పరమాత్మే వ్యాపించాడని చెప్పినట్టయింది. అంతేగాక అవి కూడా పురుష స్వరూపానికి అన్యం కావని నిరూపించటం వల్ల పరమాత్మ తప్ప సృష్టిలో మరేదీ లేదనే ఏకాత్మ భావం లేదా సర్వాత్మ భావం మనకు స్పష్టంగా బోధ పడుతున్నది. ఇప్పుడంతా కలిపి ఒకే ఒక నారాయణ స్వరూపంగా వాచా బయట పెడుతున్నదీ మంత్రం.

**త్రిపా దూర్ధ్వ ఉదై త్పురుషః - పాదో స్యేహా భవా త్పునః**

**తతో విష్వ జ్ఞ్వక్రామ - త్సాశనా నశనే అభి**

**త్రిపాదూర్ధ్వ ఉదైత్** - మూడు భాగాలా నారాయణ స్వరూపం పైన ఎక్కడో మన బుద్ధుల కందకుండా ఉందని గదా చెప్పాము. అందకుండా ఉందని చెప్పిన మాటా కరెక్టే. అలాగే **పాదోస్య ఇహా**

**భవాత్.** అందులోనే ఒక భాగమీ క్రింద మనం చూచే ఈ ప్రపంచంగా కనిపిస్తున్నదనే మాటా కరెక్టే. రెండూ వాస్తవ మయినప్పుడు అక్కడా ఇక్కడా పైనా క్రిందా అనే తేడా ఎందుకు వచ్చినట్టు. తేడా లేదు వాస్తవంలో. ఎందుకంటే పైనా క్రిందా అదే ఉందని ఎప్పుడు పేర్కొన్నామో అప్పుడది పైనే ఉంది క్రింద లేదని గాని క్రిందనే ఉంది పైన లేదని గాని ఏక దేశాన్ని భావిస్తే పొరబాటు గదా.

మరేమిటంటారు. సర్వత్రా అదే ఉన్నట్టు చూడాలి. అందుకే చెబుతున్నాడు మరలా. **తతో విష్వజ్ వ్యక్రామత్.** అన్ని వైపులా అదే వ్యాపించి ఉందని. అన్నివైపులా అదే అనే అభిప్రాయ మున్నప్పు డొక వంతు క్రిందా మూడు వంతులు పైనా అని ఎందుకన్నారు. నీవు నీ బుద్ధి కతీతంగా ఎంతో ఉన్నదని – బుద్ధితో పట్టుకొనేది కొంతేనని – ఈ సృష్టిని చూస్తున్నావు. కాబట్టి ఇలాటినీ భ్రాంతిని పోగొట్టటాని కిక్కడ నీవు చూస్తున్నది కొంచెమే సుమా – మిగతా నీవు చూడవలసిన దెంతో ఉన్నదీ సృష్టి – అని నీకు జ్ఞానోదయం కలిగించటానికి చెప్పిన మాట అది. కార్య జగత్తే కనపడుతుంటుంది మన కంటికి మామూలుగా. దీనికి కారణమేదో అది దృష్టికి రాదు. మరుగుపడి ఉంటుంది. దీన్ని బట్టి దాన్ని క్రమంగా విచారణ చేస్తూ పోతే గాని అది గోచరం కాదు. అంతకంతకు మన బుద్ధికి పదును పెట్టుకొని దాని స్థాయి కెదిగి

Yellamraju Brahmasri Srinivasa Rao www.advaitavedanta.in

చూస్తేనే గాని వస్తు సిద్ధమయినది బుద్ధి సిద్ధం కాదు. అయితే ఇప్పుడు మనకది బుద్ధికి రాకపోయినా దాని పాటికది వస్తురూపంగా ఉంది కాబట్టి ఉన్న దాన్ని అక్కడ అని - వచ్చినంత వరకిక్కడ అని - విభజించి చూపవలసి వచ్చింది.

అంతా వస్తుసిద్ధంగా ఉండనే ఉంది కాబట్టి సర్వమూ అదేనని మరలా పేర్కొంటున్న దిప్పుడు. సర్వమూ నంటే ఏమిటా సర్వమూ. **సాశనా నశనే అభి.** అశన మంటే ఆహారం. ఆహారాన్ని తీసుకొనేది సాశనం. తీసుకోకుంటే అది అనశనం. ప్రాణమూ జ్ఞానమూ ఉన్నదొకటీ ఆ రెండూ లేనిదొకటి. సజీవ నిర్జీవ పదార్థాలు. జీవ జగత్తులు. ఈ రెండు జాతుల పదార్థాలను అభి - లోపలా వెలపలా వ్యాపించిందా పురుష తత్త్వం. ఇంతకు పూర్వం దేశం కాలం రెండూ వర్ణించాడు. ఇప్పుడు చరా చర పదార్థాలను చెప్పటం మూలాన వస్తువును కూడా పేర్కొన్నాడు. అప్పటికి దేశకాల వస్తువులనే మూడింటినీ ఒకే నారాయణ స్వరూపం వ్యాపించిం దనటం వల్ల ఇవి మూడూ పరిచ్ఛిన్నమయి అది అపరిచ్ఛిన్నం పరిపూర్ణం అద్వితీయమైన తత్త్వమని చెప్పినట్టయింది. మరి ఇవన్నీ ఏమిటీ దేశ కాల వస్తువులంటే. ఇవి వస్తువు కావు. కేవలం దాని ఆ భాసలు. అర్థం చేసుకొంటే దాని విభూతి దాని విస్తారం. అదే ఈ రూపంగా విస్తరించి భాసిస్తున్నది మన దృష్టికి.

**తతో విరా డజాయత - విరాజో అధి పూరుషః**

**సజాతో అత్యరిచ్యత - పశ్చా ద్భూమి మధో పురః**

ఇలా విస్తరించిన ప్రపంచమంతా ఆ పరమ పురుషుని మహిమ అని గదా పేర్కొన్నది పూర్వ మంత్రం. ఆ విస్తారమేమిటో ఎలాంటిదో వర్ణిస్తున్నాడిప్పుడు. **తతో విరాడజాయత - తతః** అంటే ఆ మూలతత్త్వం నుంచే విరాట్. వివిధ రూపాలుగా రాజిల్లే దేదో అది విరాట్. చరా చర పదార్థ రాశి గర్భితమైన బ్రహ్మాండమని భావం. అలాటి ఈ బ్రహ్మాండమంతా అజాయత జన్మించిందట. జన్మించిందంటే ఇది ఆరంభం కాదు. పరిణామం కాదు. వివర్తం. అంటే లేనిది రాలేదు. ఉన్నది మారలేదు. అదే ఇలా మరొక రూపంలో భాసిస్తున్నది అంత మాత్రమే.

**విరాజో అధి పూరుషః -** ఇలా భాసిస్తున్నదంటే ఈ బ్రహ్మాండాన్ని Universe మరలా ఒక చైతన్యం అధిష్ఠించి దీన్ని నడుపుతున్నది. అదీ పురుషుడే. దీన్ని పూరించి ఉన్నది గనుక. పూరించటమంటే లోపల అంతర్యామి రూపంగా. వెలపల ఈశ్వర రూపంగా దీన్ని వ్యాపించి ఉంది. దీని మీద ఆధిపత్యం వహించి ఉంది. **సజాతో అత్యరిచ్యత.** ఇలా ఆ పురుషుడే ఈ పురుషుడుగా వివర్త రూపంగా జన్మించాడు గనుక దీనిలోనే సమసి పోక దీని కతీతంగా కూడా ఉంటున్నాడు.

ఉపాదానంగా ఇది అవుతూ నిమిత్తంగా దీన్ని దాటి పోతున్నాడు. నిమిత్తో పాదానాలు రెండూ ఒకటే అద్వైతంలో.

రెండూ ఒకటి గనుకనే **పశ్చా ద్భూమి మథో పురః** భూమినీ పురములనూ రెండింటినీ వ్యాపించ గలిగాడు. భూమి అంటే సమష్టి శరీరమైన బ్రహ్మాండ Cosmos - Universe - భవతీతి భూః – ఏది మొదట ఆ నారాయణ తత్త్వానికి వివర్త రూపంగా ఏర్పడిందో అది. దానినంతా వ్యాపించిందా తత్త్వం. అంతే గాక పురః పురాలను కూడా వ్యాపించింది. పురాలంటే వ్యష్టి శరీరాలు. అవి కొన్ని ద్విపాత్తులు. కొన్ని చతుష్పాత్తులు. చెబుతున్నది బృహ దారణ్యకం. వినండి. పురుశ్చక్రే ద్విపదః – పురశ్చక్రే చతుష్పదః – రెండు కాళ్లవి మనుష్య శరీరాలూ – నాలుగు కాళ్లవి పశు మృగాది శరీరాలూ – ఇలాటి శరీరాలనే పురాలను సృష్టించి వాటిలో జీవ రూపంగా ప్రవేశించింది. అది సమష్టి శరీరంలో నైతే హిరణ్య గర్భుడన్నారు Cosmic Person. వ్యష్టి శరీరాలలో నైతే జీవుడన్నారు. Individual. దీనినే అన్నమూ అన్నాద Matter and mind అని చమత్కారంగా పేర్కొన్నారు. తినబడేది అన్నం. తినేవాడు అన్నాదుడు. అంటే భోగ్యమైన జగత్తు. భోక్త అయిన జీవుడు.

ఇవి రెండూ ఇలా ఏర్పడ్డాయంటే అది ఈరూపంగా ఖర్చయి పోకపోతే ఏర్పడవు. బంగారం ఖర్చుగాక పోతే సొమ్ములుగా

తయారవుతుందా. అలాగే ఇక్కడా జరిగింది. ఎలాగో వర్ణిస్తున్నది వినండి పురుషసూక్తం.

**యత్పురుషేణ హవిషా - దేవా యజ్ఞమ తన్వత**

**వసంతో అస్యాసీ దాజ్యం - గ్రీష్మ ఇధ్మ శ్శర ద్ధవిః**

**సప్తా స్యాసన్ పరిధయ - స్త్రి స్సప్త సమిధః కృతాః**

**దేవా యద్యజ్ఞం తన్వానా - అబధ్నన్ పురుషం పశుమ్ -**

స్వరాట్టయిన ఆ మూల పురుషుడు విరాట్పురుషుడుగా మారాలిప్పుడు. అలా మారాలంటే **యత్పురుషేణ హవిషా.** హవిస్సయి పోవాలీ మానస యజ్ఞకుండంలో. హవిస్సయి పోవటమంటే ఆహుతి అయి పోవటం, యజ్ఞంలో ఆజ్యాన్ని హోమం చేస్తారు. దానికి హవిస్సని పేరు. ఇది మానసమైన జ్ఞాన యజ్ఞం. భౌతిక యజ్ఞం కాదు. ఒక యజ్ఞం లాగా దీన్ని భావిస్తే ఇందులో హోమమయ్యే పదార్ధ మేమిటని ప్రశ్న వచ్చింది. అది ఏదో గాదీ పురుషుడేనట. దీన్ని హోమం చేసిన వారెవరు. **దేవా యజ్ఞమతన్వత.** దేవతలే చేస్తున్నారు. కాబట్టి యజ్ఞంగాని ఈ యజ్ఞంలో సాక్షాత్తూ ప్రజాపతే ఆహుతి అయ్యాడు.

అసలెవరీ దేవతలు. దీవ్యంతి ప్రకాశంతే ఇతి దేవాః ప్రకాశించే స్వభావమున్న వారెవరో వారు దేవతలు. ఆధ్యాత్మిక జ్ఞాన సంపన్నులైన

Yalamanchili Brahmasri Srinivasa Rao www.advaitavedanta.in

మహర్షులు. వారీ సృష్టినంతా పరమాత్మ స్వరూపంగానే దర్శిస్తుంటారు. అలాటి అద్వైత దర్శనమే జిజ్ఞాసు లోకాని కందివ్వాలని వారు కల్పించిన ఒక అర్థవాద Anecdote మిది. దాని కనుగుణంగా ఒక యజ్ఞంతో పోల్చి వర్ణిస్తున్నారీ సృష్టిని. ఆ మూల తత్త్వమే ఉపాదానం దీనికి. అదే నామరూపాత్మకమైన భౌతిక ప్రపంచంగా కనిపిస్తున్నదంత కన్నా ఏమీ లేదని – అలా వేరుగాదని – చెప్పటమే – పురుషుడే ఇందులో హవిస్సయ్యాడని భంగ్యం తరంగా చెప్పటం మనకు.

మరి యజ్ఞానుష్ఠానానికి ఋతు నియమముంది గదా. ఎప్పుడంటే అప్పుడు చేయరు గదా యజ్ఞం. మరి ఆ ఋతువు లేమిటిక్కడ అని అడిగితే బయటపెడుతున్నది మంత్రం. **వసంతో అస్యాసీ దాజ్యం.** వసంత ఋతువీ యజ్ఞ కుండంలో పోసే ఆజ్యమే. అలాగే గ్రీష్మ ఋతు విధ్మం. సమిధలు. పోతే శరదృతువు హవిస్సే. హవిస్సంటే ఇక్కడ మిగతా యజ్ఞ ద్రవ్యాలు. అంటే అర్థం త్రిగుణాత్మకమైన ప్రకృతే ఆహుతి అవుతున్నదీ యజ్ఞంలో. పురుషుడూ ప్రకృతీ ఒకటే గదా. పురుషుడు నిమిత్తం ప్రకృతి ఉపాదాన మని ఎప్పుడన్నామో రెండూ ఒకటి కావలసిందే తప్పదు. కనుక పురుషుడాహుతి అయ్యాడంటే ఆయన శక్తి కూడా ఆయనతో పాటు ఆహుతి కావలసిందే. శక్తి అంటే ప్రకృతికి మారు పేరు. ఆయన స్వభావమది Nature. అదే త్రిగుణాత్మకమని గదా

Yellamraju Srinivasa Rao
www.advaitavedanta.in

పేర్కొన్నాము. సత్త్వర జస్తమో గుణాలే త్రిగుణాలు. అవే సాంకేతికంగా Symbolic చెబితే ఋతువులు. వాటిలో వసంతమనేది సత్త్వ గుణం. గ్రీష్మం రజస్సు. శరత్తు తమస్సు.

కాగా ఇక **సప్తా స్యాసన్ పరిధయః** - యజ్ఞ కుండానికి నలువైపులా నాలుగు హద్దులు రేఖాకారంగా ఉంటాయి. అవే పరిధులు. ఎన్ని అవి. సప్త ఏడట. అనుష్టుప్ త్రిష్టు భాదులైన ఏడు ఛందస్సులని బాహ్యార్థం. ఏడంటే ఇక్కడ లక్ష్యార్థం చెప్పుకొంటే మనస్సూ ప్రాణమనే అంతరింద్రియాలు రెండూ - చక్షురాదులైన బాహ్యేంద్రియా లైదూ - కలిసి ఏడింద్రియా లవుతాయి. ఇవి త్రిస్సప్త - త్రిగుణాల చేత గుణిస్తే ఇరవయి ఒకటవుతాయి. **త్రిస్సప్త** అంటే ఇరవయి ఒకటి. **సమిధః కృతాః** ఇవి సమిధలయి పోతున్నాయా యజ్ఞంలో. అంటే అప్పటికీ కాల్పనికమైన యజ్ఞంలో పురుషుడూ ఆయన శక్తీ దాని గుణాలూ - సమస్తమూ ఆహుతి కావలసిందే. ఖర్చయి పోవలసిందే. లేకుంటే అభౌతిక తత్త్వం భౌతికంగా మారలేదు. బహుస్యాం ప్రజాయేయ అని గదా ఉపనిషత్తు. పరమాత్మ తాను దీన్ని సృష్టించాడనే గాక తానే ఇది అయిపోవాలను కొన్నాడట.

**పోతే దేవా యద్యజ్ఞం తన్వానా అబధ్నన్ పురుషం పశుం** - జ్ఞానులైన మహర్షులు చేసే మానస యజ్ఞం గనుక ఇది - ఆ

విరాట్పురుషుణ్ణి వారొక యజ్ఞ పశువుగా చేసి యూప స్తంభానికి కట్టినట్టు కట్టి వేశారట. యజ్ఞంలో పశువును శాస్త్రోక్తంగా మంత్ర జలంతో ప్రోక్షణ చేసి వధిస్తే గాని యజ్ఞ ఫలం ప్రాప్తించదు. ఇక్కడ కూడా అదే సూత్రం. ఇక్కడ మానస యజ్ఞంలో ప్రజాపతి స్వరూపం మృతమై భౌతికంగా మారితే గాని భౌతికమైన ప్రపంచ సృష్టి ఫలించదని తాత్పర్యం. అయితే ఈ మారటం వివర్త రూపమైన ఆ భాసే కాబట్టి మారినట్టు భాసించటమే గాని వాస్తవమైన మార్పు కాదు. కార్య కారణాలు రెండూ ఒకే ఒక తత్త్వం. ఈ అద్వైత భావం మనకు బాగా అవగాహనకు రావటానికి ఒక గొప్ప కల్పన చేసి వర్ణిస్తున్నది పురుష సూక్తం మరలా. దీనినే అర్థ వాదమని పేర్కొన్నామింతకు ముందు. వినండి. ఎంత చిత్రంగా వర్ణిస్తున్నదో.

**తం యజ్ఞం బర్హిషి ప్రౌక్షన్ - పురుషం జాత మగ్రతః**

**తేన దేవా అయజంత - సాధ్యా ఋషయశ్చ యే**

**తం యజ్ఞం.** ఆ యజ్ఞాన్ని. యజ్ఞమంటే ఇక్కడ జ్ఞానమే యజ్ఞమని గదా చెప్పాము. ప్రజాపతి భావనే అది. **పురుషం జాత మగ్రతః -** అదే మొట్టమొదట జన్మించిన పురుషుడు. పరమ పురుషుడైన నారాయణుడి తాలూకు సంకల్పమే ప్రజాపతి రూపంగా జన్మించింది. దాన్ని మరలా **బర్హిషి ప్రౌక్షన్.** బర్హిస్సంటే అగ్ని హోత్రం. అందులో **ప్రౌక్షన్.**

మంత్రపూర్వకంగా ఆహుతి చేశారు. ప్రజాపతి నాహుతి చేయటమేమిటి. జ్ఞానమేగా ప్రజాపతి అంటే. అది ఎలా ఏర్పడిందసలు. పరమ పురుషుడి సంకల్పమే గదా ప్రజాపతి రూపం ధరించింది. అదే మరలా సంకల్ప బలంతో మరొక రూపం ధరించబోతున్నది. ఆంతర్యమేమంటే జ్ఞానం సంకల్పంగా మారటమే అది ఆహుతి కావటం. అది వేరొక సంకల్పం చేస్తే అదీ ఆహుతే. ఇలా అమూర్తమైన సంకల్పం మూర్తీభవిస్తే అదే జన్మ. మూర్తమై కనిపించటమే జన్మ.

అయితే ఆహుతి అయినదేదో చెప్పారు. ఆహుతి చేసిన వారెవరు. వారే దేవతలూ సాధ్యులూ ఋషులూ నంటున్నది మంత్ర వర్ణం. **అయజంత -** వీరు ముగ్గురే చేశారు యజనం. ఎవరీ ముగ్గురూ ఎలా అర్థం చేసుకోవాలి మనం. దీవ్యతీతి దేవః – ప్రకాశించే స్వభావమున్న దేదో అది దేవ. ప్రకాశమేదో గాదు జ్ఞానమే ప్రకాశం. దేవాః అంటే అప్పటికి జ్ఞానులన్న మాట. వారే సాధ్యులు సాధన సంపత్తి దగ్గరున్న వారు. అలాటి వారే ఋషులు కూడా. ఋ అనే ధాతువుకు దర్శనమని అర్థం. దర్శించే వాడే ఋషి. పరమార్థాన్ని దర్శించే వారే ఋషులంటే అలా దర్శించాలంటే మనః ప్రాణాది సాధన సంపత్తి ఉండాలి వారికి. సాధన సామగ్రి ఉన్నా దాన్ని ఉపయోగించుకొని తద్వారా పరతత్వాన్ని దర్శించే విజ్ఞాన బలముండాలి. కనుకనే **దేవా స్సాధ్యా ఋషయః** అనే మాటలతో భంగ్యంతరంగా సూచిస్తున్నాడీ రహస్యం.

Yellamrazu Srinivasa Rao www.advaitavedanta.in

ఏతా వతా మరొక రహస్యం కూడా బయట పడుతున్నదీ మంత్రంలో. తన పాటికి తాను చైతన్యమేదీ సృష్టించటం లేదు. అజాత వాద మద్వైతులది. ఏదీ దేనిలో నుంచీ జన్మించదు. అంతకు ముందున్నదీ జన్మించదు. లేనిదీ జన్మించదు. అయినా ఏదో జన్మించినట్టు చేసినట్టు భాసిస్తున్నదంటే అది భాసే గాని వాస్తవం కాదు. అద్దైనా ఎలా జరిగిందంటే రజ్జు సర్ప దృష్టాంతాన్ని విచారిస్తే తెలిసిపోతుంది. రజ్జువుకు సర్పంగా మారే శక్తి ఉంది. కాని తన పాటికి తానెప్పుడూ మారి కనిపించదు. అలాగైతే ప్రపంచమంతా సర్పమయమయి పోయేది. అలాగే మానవుడు భ్రాంతి పడి రజ్జువునే సర్పమని చూడకున్నా కనిపించదా సర్పం. పోతే మానవుడి దృష్టీ రజ్జు స్వభావమూ రెండూ తోడయినప్పుడే సర్ప సృష్టి జరుగుతుంది. ఇందులో ఏది కొరవడ్డా లేదు. రజ్జువు రజ్జువుగానే ఉండి పోతుంది.

అలాగే ప్రస్తుతం పరమాత్మ ప్రపంచంగా మారాలంటే సృష్టించే శక్తి ఆయనలో అవ్యక్తంగా ఉండాలి. అలాగే అవ్యక్తమైన దాన్ని వ్యక్తం చేసుకొని చూచే లక్షణ మీ జ్ఞానమూ ప్రాణమూ ఉన్న మనబోటి జీవులకూ కూడా ఉండాలి. అప్పటికీ జీవులే తమ జ్ఞానంతో అవ్యక్తమైన ఆతత్త్వాన్నే ఆయా రూపాలుగా వ్యక్తమయినట్టు భావిస్తూ పోతే వీరి వీరి దృష్టి కనుగుణంగా అది అనేక రూపాలుగా సృష్టి అయి

కనిపిస్తున్నదని అర్థం. మరి అంతా భావనే గాని వాస్తవం కానప్పుడెందు కిదంతా ఇంత దూరం వర్ణించటమని అడుగుతారేమో. అలా వర్ణిస్తే గాని ఈ సృష్టి అంతా ఏదోగాదా సృష్టి కర్త స్వరూపమేనని దీన్ని దానితో ముడిపెట్టి తద్రూపంగానే సమస్త ప్రపంచాన్నీ దర్శించే అద్వైత దృష్టి అలవడదు. అసతోమా సద్గమయ అన్నట్టు అసత్యం ద్వారానే సత్యమైన తత్త్వాన్ని అందుకోవలసి ఉంటుంది. అందుకొంటే అప్పుడీ అసత్తు అసత్తుగా కనిపించదు. ఇది కూడా సత్తుగానే అనుభవానికి వస్తుంది. అలాటి అఖండమైన అద్వైతానుభవాన్ని మానవుడి కందివ్వటమే సృష్టిని వర్ణించటంలో ఉన్న ఏకైక ప్రయోజనం. కాబట్టి సృష్టి జరిగిందని చిలవలు పలువలు పెట్టి వర్ణించారంటే ఇదే పరమార్థమని పట్టుకోరాదు మనం. పరమార్థాన్ని పట్టుకోటానికిది ఒక ఉపాయమనీ సంకేతమనీ మాత్రమే భావించాలి ఇదే అర్థవాదమని మేము పేర్కొనటం. ఈ అర్థవాదాన్నే సాగదీసి వర్ణిస్తున్నది మంత్రం వినండి.

**తస్మా ద్యజ్ఞా త్సర్వహుతః - సంభృతగ్ం పృషదాజ్యం**

**పశూంస్తాం శ్చక్రే వాయవ్యా - నారణ్యా గ్రామాశ్చయే -**

ఆ హిరణ్యగర్భుడి రూపంగా అవతరించినది పరమాత్మేనని గదా చెప్పాము. అతడే ప్రజాపతి. తరువాత సృష్టికి కారకుడు. స వై శరీరీ ప్రథమ స్స వైపురుష ఉచ్యతే. ఆయనే మొట్ట మొదట శరీరం ధరించి

బయటపడ్డవాడు. అతడే మొదటి పురుషుడు. ఆది కర్తా స భూతానాం. సమస్త భూత సృష్టికీ అతడే మొదట కర్తృత్వం వహించినవాడు. శరీరమంటే ఇక్కడ విశ్వ శరీరం. సమష్టి ప్రపంచం. అదే ఆయన శరీరం. అందులోనే ప్రవేశించి వ్యాపించాడు కాబట్టి పురుషుడు. సమష్టి జీవుడు. **తస్మాద్యజ్ఞాత్సర్వహుతః** అతడే ఇప్పుడు యజ్ఞం. యజనం చేయవలసిన స్వరూపం. యజ్ఞ మాయన సంకల్పమే. సృష్టి చేయాలనే భావం. సర్వహుత మది. సర్వమూ బీజరూపంగా హుతమయి ఉన్నాయందులో. గుప్తంగా తనలోనే ఉన్న ప్రపంచాన్నే తాను బయటపెట్టాడు. పెట్టాడు గాదు. తానే ఈ రూపంగా బయటపడ్డాడు. **సంభృతం పృషదాజ్యం.** పృషదాజ్యమంటే దధి ఘృతాది భోజ్య పదార్థ జాతం. భోగ్య ప్రపంచాని కంతా ఉపలక్షణ మీ మాట. అంటే జీవుల నుభవించ వలసిన సామగ్రి అంతా. ముందు భోగ్యమైన అన్నం తయారయితే గాని భోక్త అయిన జీవుడు రంగంలోకి రాడు.

ఇప్పుడా భోక్త ఎవరంటే వర్ణిస్తున్నారు. **పశూంస్తాం శ్చక్రే.** పశువులట అవి. పశ్యతీతి పశుః - ఏది దీన్ని వర్ణిస్తూ దీనితో సంబంధం పెట్టుకొంటుందో అది పశువు. అలా పెట్టుకొంటూనే దానిలో బందీ అయిపోతే కూడా అది పశువే. పాశ్యతే ఇతి పశుః - అప్పుడది దీనితో కట్టి పడేసి నట్టయి పోతుంది. ఏదటా అది. మనబోటి ప్రాణి కోటే.

ఎలా ఉంటాయిా ప్రాణులు. **వాయవ్యాన్** ప్రాణ వాయువుతో కూడినవివి. జీవులని అర్థం. ఎక్కడ ఉంటాయి. **ఆరణ్యాన్ గ్రామ్యాశ్చ యే -** అరణ్యాలలో గ్రామాలలో క్రూరంగా సౌమ్యంగా బ్రతుకు సాగిస్తున్నవి ఏవి ఉన్నాయో అవి. ఈ జీవ జగత్తులుగా ఖర్చయి పోయిందదే. కనుకనే సృష్టి కర్తే సృష్టి కూడానని చాటుతున్నది బృహదారణ్య కోపనిషత్తు. సోవే దహం వావ సృష్టి రస్మి - అహం హీదం సర్వ మసృక్షి. ఇదంతా నేనే సృష్టించాను గనుక ఇది నేనే నని అర్థం.

అయితే చరా చరాత్మకంగా సృష్టి జరిగిందంటున్నారే అది వివర్త రూపంగా జరిగినా సృష్టి సృష్టే గదా. సృష్టి కర్తే సృష్టి అయినా సృష్టే అది. మరి దీనికొక క్రమమంటూ ఉండాలి గదా. Method in Madness అంటారు పెద్దలు. ఒక క్రమం చెప్పు కోవాలి మనం. లేకుంటే మనకు తృప్తి లేదు. కాబట్టి సృష్టి ఏ క్రమంలో జరిగిందో కొంచెం చెబుతారా అంటే చెబుతున్నారు. ఆలకించండి.

**తస్మా ద్యజ్ఞా త్సర్వహుతః - ఋచ స్సామాని జజ్ఞిరే**

**ఛం దాంసి జజ్ఞిరే తస్మా - ద్యజు స్తస్మా దజాయత -**

సర్వమూ హుతమైన మహాయజ్ఞమది. ఏమిటది. ఆది కర్త అయిన ప్రజాపతి స్వరూపం. అదే యజ్ఞం. మానస యజ్ఞం. ఆయన సంకల్పమే

Yalamanchi Brahmasri Sriniyasa Rao www.advaitavedanta.in

ఆలోచనే ఒక యజ్ఞం. భౌతికం కాదది. అలాటి ఆలోచనా రూపమైన యజ్ఞం నుంచి జన్మించాయట. **ఋచ స్సామాని.** ఋగ్వేద మంత్రాలూ సామవేద మంత్రాలూ **జజ్ఞిరే.** అంటే జన్మించాయి. అంతే కాదు. **యజుస్తస్మా దజాయత.** యజుర్వేదం కూడా అందులో నుంచే ఆవిర్భవించింది. మరి అధర్వ వేదమో. అది చెప్పలేదేమిటి. ఋగ్య జుస్సామాలే. అసలు వేదాలు. కనుకనే వేదాలకు త్రయీ అని పేరు వచ్చింది. త్రయ అంటే మూడని అర్థం. ఋగాదులు మూడే వేదాలని అభిప్రాయం. అయితే అధర్వం వేదం కాదా అంటే ఋగాది మంత్రాలే చాలా వరకందులో కూడా కనిపిస్తాయి. కాబట్టి ప్రత్యేకించి దాన్ని పరిగణించ లేదు.

అయినా అది కూడా వేదమే గదా అని ప్రశ్న వస్తే దానికి జవాబు చెబుతున్నారు **ఛందాంసి జజ్ఞరే** అని. మిగతా ఛందస్సులు కూడా అందులోనే ఉత్పన్న మయినాయని చెప్పటంలో అధర్వమనే నాలుగవ వేదం కూడా కలిసి వచ్చిందని భావించవచ్చు. ఛందాంసి అనటం వల్ల గాయత్ర్యాది సప్త విధ చ్ఛందస్సులను కూడా కలుపుకొని చెప్పినట్టు కూడా అర్థమవుతున్నది.

అంతా బాగానే ఉంది గాని పారమేశ్వరమైన జ్ఞాన యజ్ఞంలో నుంచి మొదట ఋగాది వాఙ్మయం పుట్టిందని పేర్కొనట మేమిటి.

చరా చర పదార్థాలు - ఇవి గదా ప్రపంచం. భౌతికమైన ప్రపంచం పుట్టిందని చెప్పి తరువాత గదా వైజ్ఞానికమైన వాఙ్మయం సృష్టి అయిందని పేర్కొన వలసింది. అది పోనిచ్చి వరస తప్పి చెబుతారేమిటి శాబ్దకమైన సృష్టే మొదట జరిగిందని. అలా చెప్పటమే వరస. అదే సబబు. ఎలాగంటే - శబ్దమంటే నామం. అర్థమంటే రూపం - శబ్దార్థాలంటే నామరూపాలే. నామరూపాలలో నామమే మొదటిది. రూపం కాదు. నామం చెబితే మనకు రూపమనేది స్ఫురిస్తుంది. నామ మంటే ఏదో గాదు మరలా. నోటితో ఉచ్చరించే శబ్దం కాదు. ఉచ్చరించక ముందే మనసులో ఏర్పడే ఆలోచనే నామం. చిత్త వృత్తి అంటారు. జ్ఞానం కదిలితే అది వృత్తి. అనాహతమైన Inarticulate శబ్దమది. భావరూపంగా ఉంటుంది. పరమాత్మ జ్ఞానం మొదట ఆలోచనా రూపంగా ప్రసరిస్తుంది. ఆ ఆలోచన కనుగుణంగా చరా చర పదార్థాల నాయన సృష్టిస్తూ పోతాడు. అది ప్రణాళిక. ఇది బాహ్యమైన ప్రక్రియ.

అందుకే శాస్త్రంలో కూడా వాగు త్సృష్టా స్వయంభువా ఆదౌ వేదమయీ దివ్యా - యత స్సర్వాః ప్రవృత్తయః అని పేర్కొన్నారు. వేద శబ్దేభ్య ఏవాదౌ నిర్మమే స మహేశ్వరః అని మనువు కూడా అంటాడు. సభూరితి వ్యాహరత్ సభూమి మసృజత అని వేదం చెబుతున్నది. ఆ సృష్టి కర్త భూః అనే శబ్ద ముచ్చరించాడట. అంటే భూ సంబంధి

Yallamraju Srinivasa Rao Brahmasri
www.advaitavedanta.in

అయిన ఆలోచన చేశాడు. ఆయన జ్ఞానంలో కలిగిన ఆ వృత్తి జ్ఞేయమైన భూమిగా అవతరించిందట. అప్పటికి నామమే రూపంగా మారి మనకిలా బయట పడి కనిపిస్తున్న దన్న మాట. మనం కూడా చూడండి. ఒకటి మనసులో సంకల్పిస్తాము. ఆ తరువాత దానికి సంబంధించిన పదార్థాన్ని బాహ్య ప్రపంచంలో చూస్తాము. తత్సంబంధమైన ఆలోచన కలుగుతుంది. ఆ పదార్ధం గోచరించదు. కనుక ఆలోచనా రూపమైన నామమే ముందు. తరువాతనే దాని పరిణామమైన రూపం. అందుకే మొదట నామమే సృష్టి అయింది ఋగాది మంత్ర రూపంగా. నామ సృష్టిని చెప్పి ఇప్పుడిక రూప సృష్టిని వర్ణించి చూపుతున్నాడు. ఏమని.

**తస్మా దశ్వా అజాయంత - యే కే చోభయా దతః**

**గావోహ జజ్ఞిరే తస్మా - త్తస్మా జ్ఞాతా అజావయః -**

**తస్మా దశ్వాః -** ఆ ప్రజాపతి జ్ఞానంలో నుంచే తరువాత వరుసగా చరా చర పదార్థాలన్నీ జన్మించాయి. అశ్వములంటే గుఱ్ఱాలు. **యే కే చోభయా దతః -** పై వరుసా క్రింది వరుసా రెండు వైపులా పండ్లున్న ప్రాణులు. మానవులు మొదలైన వారు. జంతువులలో కూడా అలాంటి జంతవులు. అలాగే **గావోహ జజ్ఞిరే తస్మా త్తస్మా జ్ఞాతా అజావయః -** గోవులూ జన్మించాయి. అంతేగాక **అజ -** మేకలూ **అవి -** గొఱ్ఱెలూ

Brahmasri Vallamraju Srinivasa Rao www.advaitavedanta.in

కూడా పుట్టుకొచ్చాయి. ఏమిటిదంతా. వీటిని మాత్రమే చెప్పటమేమిటి. మిగతా జంతు జాలం రాలేదా. వచ్చింది. మానవులూ అశ్వాలూ గోవులూ మేకలూ గొఱ్ఱెలూ అన్నప్పుడన్ని ప్రాణులకూ అది ఉపలక్షణంగా Indication తీసుకోవాలి మనం. ప్రాణులేనా. ప్రాణం లేని జడపదార్థాల మాటేమిటి. అవి సృష్టి కాలేదా. అయ్యాయి అవి కూడా. వాటిని కూడా సూచన చేయబోతాడు తరువాత. సమస్తమూ అందులో నుంచి సృష్టి అయినప్పుడే ఇదంతా దాని స్వరూప మేననే సర్వాత్మ భావ మందుకో గలడు మానవుడు. అప్పుడే అది సంసారమనే సమస్యకు పూర్తి పరిష్కారం.

**యత్పురుషం వ్యదధుః - కతిధా వ్యకల్పయన్**

**ముఖం కిమస్య కౌ బాహూ - కావూరూ పాదావుచ్యేతే**

ఆ ప్రజాపతి స్వరూపాన్ని ప్రపంచంగా మలిచి తయారు చేశారన్నారే. **కతిధా వ్యకల్పయన్.** ఎన్ని భాగాలుగా విభజించారా యనను. ఎవరా విభజించిన వారు. మానవుల మనోవృత్తులు. అవే దేవతలు. అవే ఋషులు. మన ఆ ఆలోచనలే అలా వికల్పించి చూస్తున్నాయనా తత్త్వాన్ని. **ముఖమ్ కిమస్య కౌ బాహూ.** వికల్పించినప్పుడా పురుషుడి ముఖమేమిటి. బాహువు లేమిటి. మరి ఊరువులేమిటి. పాదాలేమిటని ప్రశ్న వచ్చింది. నిర్వికల్ప మయినప్పుడే గొడవా లేదు. అదే సవికల్ప మయినప్పుడీ దృష్టి కనుగుణంగా కనపడాలి

గదా అది. అలా కనిపించే గుణం శక్తి రూపంగా దానికే ఉంది కాబట్టి అదే వ్యక్తమై ఒక శరీరంగా అవయవాలుగా భాసిస్తున్నది.

**బ్రాహ్మణోస్య ముఖ మాసీత్ - బాహూ రాజన్యః కృతః**

**ఊరూ తదస్యయ ద్వైశ్యః - పద్భ్యాం శూద్రో అజాయత**

ముఖాదులైన అవయవా లేవంటా రింతకూ. ఏవో గాదు. బ్రహ్మణుడే ముఖమాయనకు. **బాహూ రాజన్యః -** క్షత్రియు డాయన బాహువులు. **ఊరూ వైశ్యః -** వైశ్యుడే ఊరువులు. **పద్భ్యాం శూద్రః -** శూద్రుడే పాదాలు. బ్రహ్మ క్షత్రియ వైశ్య శూద్రులనే నాలుగు వర్ణాలూ ఆ ప్రజాపతి నాలుగవయవాలట. ఏమిటర్థం. ముఖం జ్ఞానానికీ. బాహువులు బలానికీ ఊరువు లాదాన ప్రదానాలకూ పాదాలు సర్వత్రా సంచరించటానికీ సంకేతాలు. ప్రతి మానవుడికీ ఈ నాలుగు లక్షణాలూ ఉండవలసిందే. అప్పుడే పరిపూర్ణత జీవితానికి. ఇవి మనకు మూలపురుషుడైన ప్రజాపతి వల్లనే సంక్రమించాయని చెప్పటాని కాయనకే వీటి నవయవాలుగా ఆరోపించి చెబుతున్నది మంత్రం. అంతే గాని వర్ణ భేదాన్ని బోధించటానికి గాదు. అలాటిదే ఉద్దేశమైతే మిగతా అవయవాల నిలా ఏకరువు పెట్టదు మరలా. వినండి ఏమంటుందో.

**చంద్రమా మనసో జాతః - చక్షో స్సూర్యో అజాయత**

**ముఖా దింద్ర శ్చాగ్నిశ్చ - ప్రాణా ద్వాయు రజాయత**

Brahmasri Yellamraju Srinivasa Rao www.advaitavedanta.in

**నాభ్యా ఆసీ దంత రిక్షం - శీర్ష్ణో ద్యౌ స్సమవర్తత**

**పద్భ్యాం భూమిర్దిశః శ్రోత్రా - త్తథా లోకా నకల్పయన్ -**

చంద్రుడాయన మనసు నుంచి జన్మించాడట. చక్షుస్సు నుంచి సూర్యుడు జన్మించాడట. **ముఖాదింద్రశ్చ అగ్నిశ్చ.** పోతే ముఖం నుంచి ఇద్దరు జనించారు. ఒకరు ఇంద్రుడు. మరొకరు అగ్ని. అలాగే **ప్రాణాద్వాయుః -** ఆవిరాట్పురుషుడి ప్రాణం నుంచి వాయువు జనిస్తే **నాభ్యా అంతరిక్షం.** నాభి నుంచి పుట్టింది అంతరిక్షం. మరి **శీర్ష్ణోద్యౌః** ద్యులోకం శిరస్సు నుంచి - **పద్భ్యాం భూమిః -** పాదాల నుంచి భూమండలం ఏర్పడ్డాయి. పోతే **దిశః శ్రోత్రాత్ -** దిక్కులన్నీ ఆయన కర్ణద్వయం నుంచి జన్మించాయి. **తథా లోకా నకల్పయన్.** ఇంతెందుకు. అసలీ భూరాది ఊర్ధ్వ లోకాలూ - అతల వితలాది అధో లోకాలూ అన్నీ ఆదేవతలు ప్రజాపతిని వికల్పిస్తే ఉత్పన్నమయినవే. అంతకన్నా ఏమీ లేదు. ఇదీ ఈ మంత్రాని కున్న దున్నట్టు చెప్పుకొంటే మన కర్థమయ్యే విషయం.

కాని ఇప్పుడు ప్రశ్నే మంటే. ఇంతకు ముందు బ్రాహ్మణుడే ఆయన ముఖమని క్షత్రియుడే బాహువులనీ వర్ణించాడు మీకు గుర్తుందో లేదో. అప్పుడు బ్రహ్మ క్షత్త్రాదులాయన అవయవాలే నని పేర్కొన్నాడే దాని వాటి నుంచి వీరు జన్మించారని చెప్పలేదు. ఇక్కడ అలా కాక అవయవాల

Brahmasri Yalamraju Srinivasa Rao www.advaitavedanta.in

నుంచి ఏకా జన్మించారనే వర్ణిస్తున్నాడు. ఏమిటీ తేడా ఎందుకు వచ్చింది. దీనికి  సమాధానం కావాలి మనకు. కాగా ఇక్కడ తేడాగా కనిపించినా మరలా ఈ విరాట్పురుషుణ్ణే వేరొక చోట ఉపనిషత్తు  చిలువలు పలువలు పెట్టి  వర్ణించింది. అక్కడ ఇలాటి తేడా కనపడదు. అక్కడ జన్మించటం పేర్కొన దుపనిషత్తు. మీదు మిక్కిలి బ్రాహ్మణోస్య ముఖమా సీత్తని వర్ణించినట్టే రెంటికీ కార్యకారణ భావాన్ని గాక అభేదాన్ని వర్ణిస్తుంది. చూడండి.

తస్యహ వా ఏతస్య  ఆత్మనో వైశ్వానరస్య  మూర్ధైవ సుతేజాః – చక్షు ర్విశ్వరూపః – ప్రాణః  పృథ గ్వర్త్మా – సందేహో  బహులో – వస్తిరేవ రయిః – పృథివ్యేవ  పాదౌ –  అని మంత్రం. దీని అర్థమేమంటే ఆ వైశ్వానరుడికి అంటే విరాట్పురుషుడికి ద్యులోకమే శిరస్సు. సూర్యుడే నేత్రం  – వాయువే  ప్రాణం – ఆకాశమే దేహం – జలమే మూత్ర స్థానం – పోతే పృథివే పాదాలు. చూచారా పురుష సూక్త మంత్రంలోనూ ఇక్కడా ఇంద్రియాలూ  అవయవాలూ అన్నీ చక్కగా సరిపోతున్నాయి. కాని  అక్కడ పురుష  సూక్తంలో కార్య కారణాలకు  జన్య జనక భావం చెబితే ఇక్కడ రెండింటికీ ఏకత్వం వర్ణిస్తున్నాడు. ఇది బ్రాహ్మణోస్య ముఖ మాసీత్తనే వర్ణనకు సరిపడే వర్ణన.

Yallamraju Srinivasa Rao
Brahmasri
www.advaitavedanta.in

దీన్నిబట్టి మన మిక్కడ పురుష సూక్తంలో ఈ ఘట్టం కూడా వాటి కనుగుణంగానే అన్వయించి చెప్పుకోటమే సరియైన మార్గం. అలా అన్వయిస్తే అందులో నుంచి ఇది అనిగాక అదే ఇది అని సామానాధి కరణ్యం Identity చెప్పవలసి ఉంటుంది. ఎలా గంటే చంద్రుడాయన మనసు నుంచి వచ్చాడని గాక విరాట్పురుషుడి మనస్సే చంద్రుడని - నేత్రమే సూర్యుడని ఇలా వ్యాఖ్యానిస్తూ పోవటమే. ఇది కార్య కారణాలకు తాదాత్మ్య సంబంధం చెప్పే అద్వైత సంప్రదాయానికి సరిపడుతుంది కూడా. సరే బాగానే ఉన్నది. తాదాత్మ్యం చెప్పినా ఇంతకూ ఈ మంత్రాని కేమని చెప్పాలర్థం. ఎలా చెప్పాలని ప్రశ్న.

చంద్రుడే మనస్సంటే మనస్సనేది సంకల్ప వికల్పాత్మకం. సంకల్ప రూపంగా ఒక ప్రణాళిక వేసుకొని వికల్ప రూపంగా దాన్ని అమలుపరిచి ఈ చరా చర ప్రపంచంగా పరిణమించాడా ప్రజాపతి. సృష్టి కర్తే సృష్టి అయ్యాడని ఇంతకు ముందుపనిషత్తు చెప్పింది. అలాగే సూర్యుడే చక్షుస్సంటే సూర్యుడెలా ఒకేచోట ఉన్నా ఆయన దీప్తి సర్వత్రా ప్రసరిస్తున్నదో అలాగే ఆ ప్రజాపతి దృష్టి సర్వతో ముఖంగా వ్యాపించి ఉందని భావం. మరి ఇంద్రుడూ అగ్నీ ముఖమేమిటి. అగ్ని తేజస్సుకూ ఇంద్రుడు జలానికీ సంకేతం. ముఖంలోనే వాక్కు జిహ్వా ఉన్నాయి. వాక్కు అగ్ని దైవత్యం. జిహ్వా రసాత్మకం. అంటే తేజోజల భూతాలు.

ప్రాణం వాయువేనంటే ప్రాణం శరీరమంతా వ్యాపించినట్టే విశ్వశరీరమంతా వాయుమండలం వ్యాపించి ఉంది. పోతే ఇక నాభి అంతరిక్షం - శిరస్సు ఆకాశం - పాదాలు భూమి అన్నారంటే భూమి క్రింద ఉంది పాదాలలాగా - నాభి మధ్యలో ఉంది. కాబట్టి అంతరిక్షమే అది. ఆకాశం రెండింటికీ పైన ఉంది. శిరస్సూ అలాగే అన్నిటికీ మీదనే ఉంటుంది. ఇక్కడికి పృథివి అంతరిక్షం ఆకాశం మూడూ కలిసి వచ్చాయి. పృథి వ్యాకాశాలు గాక మిగతా మూడు భూతాలూ కూడా ఇంద్రాగ్ని ప్రాణాలనే మూడు సంకేత శబ్దాల మాటున తొంగి చూస్తూ ఉన్నాయి గనుక మొత్తం మీద పంచభూతాలు కలిసి వచ్చాయి. వీటితో పాటు సూర్య చంద్రులు కూడా కలిసి వచ్చారు. సూర్యచంద్రులు అహోరాత్ర రూపంగా నడిచే కాలానికి సంకేతం. అవి అయిదూ పంచభూతాత్మకమైన ప్రపంచానికి. అంటే మరొక మాటలో చెబితే వస్తు జాతానికి. సూర్యచంద్రులనే ఇవి రెండూ కాలానికి సూచక మవుతున్నాయి. కాగా దేశమనే దొకటి మిగిలి ఉందీ వరుసలో. అది **దిశః శ్రోత్రాత్** దిక్కులే ఆయన శ్రోత్రాలనటంలో కలిసి వచ్చింది. అప్పటికి దేశ కాల వస్తువులన్నీ వ్యాపించిన ప్రజాపతి విరాడ్రూపం కండ్లకు కట్టినట్టు దర్శన మిస్తున్నదీ వర్ణనలో. అంతేకాదు. మరొక విశేషమేమంటే మనకేది మనస్సో అది అక్కడ చంద్రుడు. మనకేది శ్రోత్రమో అది అక్కడ సూర్యమండల మని ఇలా వర్ణించం వల్ల మన

శరీరాలూ అవయవాలూ వ్యష్టి రూపంగా పరిమితమైతే – సమష్టి రూపంగా అవి ఆ పురుషుడికి పరిపూర్ణంగా ఉంటాయని భావన. పరిపూర్ణమైన తత్త్వమే పరిమితంగా కూడా భాసిస్తున్నదే గాని పరిమితమంటే దానికన్యంగా వేరొకటేదీ లేదని కూడా ఇందులో మనం గ్రహించవలసిన ఇంకొక రహస్యం.

అయితే ఇదంతా ఎందుకిలా వర్ణించటం. దీనివల్ల మనకు శాస్త్రం చేస్తున్న ఉపదేశమేమిటి అని ప్రశ్న వచ్చింది. దానికి సమాధాన మేమంటే నిరుపాధికమైన ఆ పురుష స్వరూపమే సోపాధికమైన ఈ దేశకాల వస్తు ప్రపంచంగా భాసిస్తున్నది. కాబట్టి మనమీ ఉపాధులను గాదు పట్టుకోవలసింది. ఇవన్నీ దేనికి చెందిన ఉపాధులో దాని స్వరూపాన్ని ఈ ఉపాధుల ద్వారా అందుకొని దానితో తాదాత్మ్యం చెంది జనన మరణాదికమైన ఈ సంసార బంధాన్ని తప్పించుకొని బయట పడాలని శాస్త్ర హృదయం. అదే ఇప్పుడు క్రమంగా బోధిస్తున్నదీ పురుష సూక్తం మనకు పూర్వులైన మహర్షుల స్వానుభవం ద్వారా.

**వేదాహ మేతం పురుషం మహాంత**

**మాదిత్య వర్ణం తమస స్తు పారే**

**సర్వాణి రూపాణి విచిత్య ధీరో**

**నామాని కృత్వా உ భివదన్ యదాస్తే.**

Yallamraju Srinivasa Rao
www.advaitavedanta.in

ఒక బ్రహ్మవేత్త అయిన మహర్షి తన అనుభవాన్ని ఇలా బయటపెడుతున్నాడు. అవధరించండి. **వేదాహం.** నేను బాగా ఎరుగుదును. వేద అంటే ఎఱుగుదుననే గాదు. అసలా శబ్దాని కర్థం దర్శించటమని. ఇది ఇంతకు పూర్వమే అక్కడక్కడ పేర్కొని ఉన్నాను. తెలియట మనేది పరోక్షమైనా కావచ్చు కాని దర్శన మన్నప్పుడది పరోక్షం కాదు. ప్రత్యక్షం. అనుభవమెప్పుడూ ప్రత్యక్షమే గదా. కనుక వేదాహ మంటున్నాడంటే అనుభవించి మాటాడుతున్నాడాయన. దేని ననుభవించాడు. **పురుషం మహాంతం.** అణోరణీయాన్ మహతో మహీయానని పరావరాలను రెండింటినీ సమానంగా వ్యాపించిన ఆ పురుషుణ్ణి. పూర్ణమైన తత్త్వమే గదా పురుషుడంటే. పూర్ణమెప్పు డవుతుంది. దేశకాలాదులన్నీ వ్యాపిస్తే.

ఎలా ఉంటుందది. **ఆదిత్య వర్ణం తమసస్తుపారే.** పెంజీకటి కవ్వల అన్నట్టు ఈ తమస్సును దాటి ఉన్న తేజో మండలమది. తమస్సంటే ఇక్కడ అజ్ఞానం. తేజస్సంటే జ్ఞానం. అజ్ఞానం లేశ మాత్రం కూడా సోకని కేవల జ్ఞాన స్వరూపమది. ప్రజ్ఞానం. Pure Perfect consciouness ఇది పరమాత్మ స్వరూపమైతే Substance ఇక ఆయన విభూతి Formation or Expansion వర్ణిస్తున్నాడు. ఏమని. **సర్వాణి రూపాణి విచిత్య నామాని కృత్వా.** నామాలు మొదట తయారు చేసుకొని వాటితో

రూపాలనన్నింటినీ వెదకి వెదకి పట్టుకొని ఇది ఫలానా అది ఫలానా అని చూస్తూ కూచున్నాడట.

ఏమిటర్థం. చెప్పాము గదా. నామమే ముందు. రూపమే తరువాత అని. నామమంటే ప్రజాపతి మనసులో ఉదయించిన సంకల్పం. ఆలోచన. అనాహతమది Inarticulate నోట ఉచ్చరిస్తే శబ్దమవుతుందది. Articulate. అదే సూక్ష్మావస్థ నుంచి అంతకంతకు స్థూలమైన దశకు దిగి వచ్చి వ్యక్తమైన జగత్తుగా పరిణమిస్తే అది రూపం. ఇవే శబ్దార్థాలు. లేదా ప్రత్యయ Idea విషయాలు Thing. వీటి రెండింటి పరస్పర సంవ్యవహారమే Transaction క్రియ. నామరూప క్రియలే మొత్తం సంసారం. ఇది నిరుపాధికమైన ఆ పురుషుడి ఉపాధి. అవి స్వరూపమైతే ఇది ఆయన విభూతి విస్తారం. కాని ఇది ఆ పరమాత్మ తాలూకు విభూతి అని చూడటం లేదు మనబోటి మానవులం. దాని నుంచి దీన్ని విడగొట్టి కేవలమిది సంసార మనే భావనతో చూస్తున్నాము. కనుకనే బంధకమయి కూచుంది మనకిది. పోతే అలా విడగొట్టి కాదు. దీన్ని దాని కొక ఆలంబనగా చేసుకొని దీని ద్వారా దాన్ని దర్శించండని మనకు మహర్షి చేసే బోధ ఇది. కనుకనే **వేదాహం పురుషం** - పురుష సృష్టిని గాక సృష్టి ద్వారా స్రష్ట అయిన పురుష తత్త్వాన్ని దర్శిస్తున్నాము మేము. మీరూ అలాగే దర్శించండని మనకు భంగ్యంతరంగా సలహా ఇస్తున్నాడు.

**ధాతా పురస్తా ద్యముదా జహార**

**శక్రః ప్రవిద్వాన్ ప్రదిశ శ్చతస్రః**

**తమేవ విద్వా నమృత ఇహ భవతి**

**నాన్యః పంథా అయనాయ విద్యతే**

వసిష్ఠాది మహర్షులే గాక ఇలాగే ఇంద్రాది దేవతలు కూడా పూర్వమిదే అనుభవాన్ని లోకాని కావిష్కరించి చెప్పారు. ద్వీర్బద్ధం సుబద్ధం భవతి అన్నారు. రెండు మూడు మార్లు అవీ ఇవీ పెట్టి గట్టిగా పాతితే ఇక కదలకుండా ఉంటుందా స్తంభం. అలాగే ఋషుల మీద దేవతల మీద పెట్టి చెబితే మానవులు కూడా అదే మార్గంలో అసలైన పరమార్థాన్ని గట్టిగా పట్టుకొని స్వానుభవానికి తెచ్చుకోవాలని శాస్త్ర వివక్షితం.

అయితే ఎవరా దేవతలు - ఎలా తెచ్చుకొన్నా రనుభవానికని ప్రశ్న వస్తే చెబుతున్నారు. **ధాతా పురస్తా ద్యము దాజహార** బ్రహ్మ దేవుడు మొదటి గురువు బ్రహ్మవేత్తలందరికీ. ఆయన గారు బోధ చేశారు మొదట దేవేంద్రుడికి. శక్రుడంటే దేవేంద్రుడే. శక్నో తీతి శక్రః గ్రహణ శక్తి ఉన్నవాడెవడో వాడు శక్రుడని లక్షణార్థం. అలాటి పాత్రుడైన వాడికి విద్యాదానం చేస్తే అది సత్ఫలిత మిస్తుంది. ఎలా ఫలించిం దాయనకది. **శక్రః ప్రవిద్వాన్ ప్రదిశ శ్చతస్రః** - నలుదిక్కులూ వ్యాపించి

ఉన్నదంతా ఆ బ్రహ్మ చైతన్యమే అదే దేశ కాలాది రూపంగా ఇలా పరచుకొని కనిపిస్తున్నదని **ప్రవిద్వాన్** చక్కగా గ్రహించ గలిగాడట ఆ దేవేంద్రుడు. బ్రహ్మ దేవుడి లాంటి ఆచార్య పురుషుడు బోధిస్తే శక్రుడి లాంటి సచ్ఛాత్రుడు గ్రహించ లేకపోవట మేమిటి. ఆచార్యవాన్ పురుషో వేద అని వేద వాక్యం. ఆచార్యుడే మార్గదర్శకు డెప్పుడైనా. అందుకే దేశికుడన్నారు. Demonstrator ఆచార్యుణ్ణి. అతడా బ్రహ్మం ఫలానా అని నిర్దేశిస్తే అలాగే దర్శించాడా ఇంద్రుడు.

**తమేవ విద్వాన్.** అలాటి బ్రహ్మ స్వరూపాన్నే మనబోటి మానవులమూ గ్రహించగలిగితే మనమూ జ్ఞానులమే. జ్ఞానులం కావటమే కాదు. **అమృత ఇహ భవతి.** అమృతులం కూడా కాగలము. మృతి లేని వాడెవడో వాడ మృతుడు. అంటే మృత్యుంజయు డయి పరమాత్మలాగా వీడూ ఎప్పటికీ నిలిచి ఉంటాడు. నామరూపాత్మకంగా కాదు. సచ్చిదాత్మకంగా. నామరూపాలు నశించినా సచ్చిదాత్మకమైన తత్త్వం నశించదు. నిరాకారంగదా ఎలా మారుతుంది. మారటమే మరణం. అంచేత బ్రహ్మైవాహ మస్మి సచ్చిదాత్మకమని ఎప్పుడు భావించాడో ఆ భావాని కనుగుణంగా భ్రమర కీట న్యాయాన్ని అనుసరించి బ్రహ్మమే అయిపోతాడీ జ్ఞాని. బ్రహ్మ వేద బ్రహ్మైవ భవతి అని గదా వేద వచనం. కాబట్టి **అమృత ఇహ భవతి.** జ్ఞానమే అనుభవం

Brahmasri Yallamraju Srinivasa Rao
www.advaitavedanta.in

గనుక ఎప్పుడు జ్ఞానోదయమైతే అప్పుడే మోక్షం. అందుకే **ఇహ** అంటున్నాడు. మరణకాలం వరకూ కనిపెట్టుకొని ఉండనక్కర లేదు. జీవించి ఉండగానే. అలాగే దీనికన్నా వేరుగా పరమేదో ఉందని అందుకోసం పరుగెత్తటం కూడా కాదు. **ఇహ** ఇక్కడ. ఇక్కడే ఇప్పుడే **అమృతో భవతి.**

మంచిదే - కాని కేవలం దాన్ని గుర్తించి దాని జ్ఞానం సంపాదించినంత మాత్రాన సరిపోతుందా. ఫలితమిస్తుందా అని సందేహించ వచ్చు నీవూ నేనూ. అందుకే వేదాంత శ్రవణంతో తృప్తి చెందక మరలా కర్మానుష్ఠాన యోగాభ్యాస మంత్రం తంత్రాది మార్గాలన్నీ త్రొక్కలేక సతమతమయి పోతున్నారు మానవులు. జ్ఞానం సిద్ధాంతం వరకే చూచుకొని అది అనుభవానికి రావాలంటే ఏదో ఒక ఆచరణ కూడా ఉండాలని భావించి కర్మాదులన్నీ నెత్తిన పెట్టుకొంటున్నారు. జిజ్ఞాసువులే గాక జ్ఞానులైన వారు కూడా. ఇలాగే చాలామంది ప్రవర్తిస్తున్నారు. సన్న్యాసులు స్వాముల వార్లు పీఠాధిపతులందరూ చేస్తున్న పిచ్చి పని ఇదే. ఇది కేవల మొక భ్రాంతి ఒక అపోహ - అని చెప్పటానికే **నాన్యః పంథా అయనాయ విద్యతే** అని పనిగట్టుకొని మరలా దాన్ని నిషేధిస్తున్నది మంత్ర వర్ణం.

**యజ్ఞేన యజ్ఞ మయ జంత దేవాః**

**తాని ధర్మాణి ప్రధమాని ఆసన్**

**తేహనాకం మహిమాన స్సచంతే**

**యత్ర పూర్వే సాధ్యా స్సంతి దేవాః**

ఇది ఒక సంప్రదాయం. ఒక పరంపర Tradition. గురు శిష్య వంశం. వంశమనే పేరు పెట్టింది దీనికి ఛాందోగ్యం. ఇది ఎలాంటి వంశమో సంప్రదాయమో వర్ణిస్తున్నాడు మహర్షి. ఏమని. **యజ్ఞేన యజ్ఞ మయ జంత.** పూర్వం మన వంశీయులైన బ్రహ్మవేత్తలంతా చేస్తూ వచ్చిన యజ్ఞ మొకటి ఉందట. యజ్ఞంతోనే చేసిన యజ్ఞమట అది. యజ్ఞంతో యజ్ఞమేమిటి. యజ్ఞమంటే ఇది భౌతికంగాదు బాహ్యమైనది గాదు. జ్ఞానమే యజ్ఞం. అందులో ఒక జ్ఞానం మరొక జ్ఞాన సాధనకు చేస్తున్నది. మొదటి జ్ఞానం పరిచ్ఛిన్నమైన జైవ జ్ఞానం. అది సంపాదించాలను కొన్నది పరిపూర్ణమైన ఈశ్వర జ్ఞానం. పరిమితం పరిపూర్ణ స్థితి నందుకొనే ప్రయత్నమే జ్ఞాన యజ్ఞమంటే. ఎవరా చేస్తున్నదింతకూ. దేవాః దేవతలని బాహ్యార్థం. కాని ఇక్కడ లక్ష్యార్థంలో నడుస్తున్నది. దీవ్యంతి ప్రకాశంతే ఇతిదేవాః చక్షురాదీంద్రియాలూ లేదా అంతరింద్రియమైన మనోభావాలూ. అది అఖండమైన భావనలో

Yalamanchili Brahmasri Srinivasa Rao www.advaitananda.in

ఖండమైన తమ చిత్తవృత్తులను హోమం చేసి అఖండంగా మారిపోతుంటాయి.

**తాని ధర్మాణి ప్రధమాని ఆసన్.** అలాటి ప్రవిలాపన మార్గమే ఇక్కడ అనుసరించవలసిన ధర్మం. సర్వులూ అనుసరించ వలసినది గనుక ధర్మాలని బహువచనంలో చెబుతున్నారు. అవే మన మూలపురుషులు మొదట చేస్తూ వచ్చారు కాబట్టి ప్రధమ ధర్మాలయ్యాయవి. **తేహ నాకం మహిమాన స్సచంతే** వారందరూ అలా చేస్తూ వచ్చి నందుకు ఫలితవేమిటని అడుగుతారేమో. **మహిమానః** మహిమాన్వితు లయ్యారు వారంతా. అయి **సచంతే** అంటి పట్టుకొన్నారు. దేన్ని **నాకం.** కమ్మంటే సుఖం. అకం అంటే సుఖం కానిది దుఃఖం. న అకం దుఃఖం కూడా కానిది. మరలా సుఖమే. అంటే సుఖదుఃఖాది ద్వంద్వాల కతీతమైన దశ. అదే ఇక్కడ నాకం. మోక్షమని భావం - ముక్తులయ్యారని అర్థం. వీరొక్కరే క్రొత్తగా అయ్యారా. మరెవరూ కాలేదా. కాదు. ఎందరో అయి ఉన్నారీ పాటికే. అలాంటి మహానుభావులు. **యత్ర పూర్వే సాధ్యాస్సంతి** పూర్వమెంతో మంది సాధించి పొందిన మహాసిద్ధే అది.

ఇక్కడ రహస్యమేమంటే మామూలు భౌతికమైన యజ్ఞ మొకడు తాను యజమానుడయి - తాను చేసేది యజ్ఞమని చేస్తాడు. అలాటి

Yallamraju Srinivasa Rao
www.advaitavedanta.in

విధ్యుక్త ధర్మమే ప్రతి అధికార సంపత్తి ఉన్నవాడు అనుష్ఠిస్తూ ఉండాలి. అనుష్ఠిస్తే చివరకు దేహ పాతానంతరం తానాచారించిన యజ్ఞ కర్మకు ఫలంగా నాకలోక సుఖాన్ని అనుభవిస్తాడీ యజ్ఞాయుధి అయిన ధార్మికుడు. అదే వాడి మహిమ. అలాటి మహిమ పొందిన వారు మొదటి నుంచీ ఎందరో ఉన్నారు. వారంతా సాధ్యులే. అంటే ఎంతో సాధన సామగ్రి నుపయోగించుకొని చివరకా స్వర్గ ఫలమందుకొన్న మహానుభావులే. ఇదీ కర్మపరంగా మనం చెప్పుకో గల బాహ్యార్థం. ఇదే బ్రహ్మపరంగా చెప్పుకోవాలి మనం మరలా. అదే దీనికి ముందు మేము చెప్పిన అర్థం.

**అద్భ్యస్సంభూతః పృథి వ్యైరసాచ్చ**

**విశ్వకర్మణ స్సమవర్తతాధి**

**తస్య త్వష్టా విద ధ ద్రూపమేతి**

**తత్పురుష స్య విశ్వ మాజాన మగ్రే**

అసలీ అంతరార్థమే అర్థం. ఎందుకంటే ఇదే పురుష సూక్తం వివక్షించింది కూడా. అదే వివరిస్తున్నదీ మంత్రం మనకిప్పుడు. **అద్భ్యస్సంభూతః -** నీవొక యజ్ఞమని చెప్పు యాగమని చెప్పు. అది చేసే వాడెవడు. జీవుడు. వాడేగా కర్త. కర్త అనేవాడు మొదట ఉంటేగా కర్మ అనేది సంభవం. నేను కర్త నను కోకపోతే వాడు కర్తృత్వం పెట్టుకోలేడు. ఈ అనుకోవటమే సంకల్పం. సంకల్పమనేది ఒక వృత్తి.

Vallamraju Srinivasa Rao
www.advaitavedanta.in

అది ఒక తరంగం లాంటిది. తరంగానికి సముద్రమే గదా ప్రభవం. అలాగే ఈ ఆలోచనా తరంగాలన్నిటికీ ఆశ్రయం మన జ్ఞాన సముద్రమే. అప్పటికి క్రియారూపంగా ఒక యజ్ఞం జరుగుతున్నదంటే ఆంతరికమైన జ్ఞానమే ప్రకటమై కర్మగా కనిపిస్తున్నది **అద్భ్యస్సంభూతః** - అప్పులంటే జలం. ఒక్క జలమనే గాదు. జలమనేది పంచ భూతాలకు సంకేతమని చెప్పాము. పంచ భూతాల కలయిక వల్ల ఏర్పడిందే ఈ శరీరం. **పృథివ్యైరసాచ్చ** ముఖ్యంగా భూమీ జలమూ - ఈ రెండు భూతాలే పనిచేస్తున్నాయి శరీరంలో. అన్నమయమైనది మనస్సు. అది పృథివీ వికారం - ఆపోమయః ప్రాణః అన్నారు. అది జలవికారం. అప్పటికి శరీరం పాంచ భౌతికమైనా అందులో మనస్సూ ప్రాణమే స్పందించే లక్షణమున్నవి కాబట్టి చాలా ప్రధానమైనవి. మనస్సు సంకలిస్తుంది. ప్రాణం చేస్తుంది. ఇదే సూక్ష్మ దేహం. జీవుడి స్థానమిదే.

**విశ్వకర్మణ స్సమవర్తతాధి.** విశ్వాన్ని సృష్టించిన వాడు విశ్వ కర్మ పరమాత్మ. వాడి సంకల్ప బలం వల్ల **సమవర్తత** సృష్టి అయిందిది. ఈ శరీరమూ వాడి సృష్టే. ఇందులో మనః ప్రాణాలనే జీవుడి ఉపాధులూ వాడి సృష్టే. **తస్య త్వష్టా విదధ ద్రూపమేతి.** త్వష్ట అంటే వడ్రంగి. **విదధత్ రూపం** ఒక వడ్రంగి చేతికి కొయ్య ఇస్తే వాడు దాన్ని అనేక గృహోపకరణాలుగా తయారు చేసి చూపుతాడు. కాగా ఇక్కడ వడ్రంగి

ఎవడో కాదు ఈ జీవుడే. విశ్వ కర్మ అయిన పరమాత్మ మనకీ శరీరాద్యుపాధులు సరఫరా చేస్తే జీవుడనే త్వష్ట వాటి నుపయోగించుకొని అనేక ప్రయోజనాలకు వాడుకొంటున్నాడు ఈకలాపాన్ని. అది ఐహిక ప్రయోజనాలకు గాక ఆముష్మిక ఫలాన్ని ఇచ్చే యజ్ఞాది కర్మానుష్ఠానానికే వాడుకోగలిగితే ఆయా కర్మ ఫల రూపమైన స్వర్గాది రూపమే **ఏతి.** పొందగలడు.

**తత్పురుషస్య విశ్వ మాజా నమగ్రే.** కాని దానివల్ల తాత్కాలికమైన ధర్మ పురుషార్ధమే ప్రాప్తిస్తుంది గాని మోక్ష పురుషార్ధం కలగబోదు. అలాటి శాశ్వతమైన మోక్షఫలమే కావాలంటే ఇది గాదు మార్గం. మరేమిటి. ఈ విశ్వమంతా - అంటే ఈ శరీరాద్యుపాధి జాత మంతా - **తత్పురుషస్య -** ఆ పరమపురుషుడికి సంబంధించిన విభూతేనని **ఆ జాన మగ్రే**. అన్నిటి కన్నా పూర్వమే **ఆ జానం** నేను గుర్తించానని భావించాలి. అది కర్మ గాదిప్పుడు జ్ఞానమే. అంటే ఏమిటిప్పుడు తేలిన అంశం. కేవల కర్మానుష్ఠానం స్వర్గాది సుఖాల వరకే గాని శాశ్వతమైన పరిష్కారం కాదు జీవిత సమస్యకు. సమస్యకు పరిష్కారం జన్మ పరంపర కాదు. జన్మరాహిత్యం. అది సర్వాత్మ భావ రూపమైన బ్రహ్మ జ్ఞానమే నని వ్యంగ్యంగా బోధిస్తున్నది మనకీ సూక్తం.

Yalamanchi Brahmasri Srinivasa Rao www.advaitavedanta.in

**వేదాహ మేతం పురుషం మహాంతం**

**ఆదిత్య వర్ణం తమసః పరస్తాత్**

**తమేవం విద్యానమృత ఇహ భవతి**

**నాన్యః పంథా విద్యతేఽ యనాయ -**

ఇంతకు ముందు వచ్చిందే ఈ శ్లోకం. మరలా దాన్నే పునరావృత్తం చేస్తున్నాడు. అక్కడ **తమసస్తు పారే** అంటే ఇక్కడ **తమసః పరస్తా**త్తన్నారు. **తమేవ** అని అక్కడ అంటే **ఏవం** అని ఇక్కడ ఉంది. **అయనాయ విద్యతే** అని అక్కడంటే **విద్యతేఽయ నాయ** అని ఇక్కడ ఉంది. అంత మాత్రమే తేడా. శబ్ద విన్యాసంలోనే గాని ఈ తేడా అర్థ క్రమంలో లేదు. అర్థమక్కడా ఇక్కడా ఒకటే. అలాంటప్పుడెందుకీ పునరుక్తి. చెప్పాము గదా ద్విర్బద్ధం సుబద్ధం భవతి అని. రెండు మారు లేదైనా ఉచ్చరిస్తే అది తప్పకుండా యధార్థమని భావం. అహం శ్వః ప్రభాతే తవగృహ మాగమిష్యామి. ఆగమిష్యా మి తవ గృహ మహం ప్రభాతే. రేపు తప్పక మీ ఇంటికి నేను వస్తాను. వస్తాను తప్పకుండా రేపు మీ ఇంటికి. ఈ రెండు వాక్యాలూ ఒకే అర్థం చెబుతున్నాయి. ఒకే అర్థం చెబుతున్నా నేను రావట మనేది తథ్య మనే నిశ్చితమైన జ్ఞానాన్ని మనకందిస్తున్నది. అలాగే ఇదీ. జ్ఞానా దేవతు కైవల్యం.

Yalamanchili Brahmasri Srinivasa Rao www.advaitavedanta.in

మోక్షానికి జ్ఞాన మొక్కటే మార్గం మరేదీ కాదనే నిశ్చయ మిక్కడ మనకు స్ఫురిస్తున్నది. లేకుంటే కర్మోపాసనాదులతోనే యావజ్జీవం కాలక్షేపం చేసి ఈ జీవుడెప్పటికీ మోక్షానికి నోచుకోలేడని తాత్పర్యం.

అంతేకాక పునరుక్తి అయినప్పటికీ ఇందులో ఒకటి రెండు చోట్ల కొద్దిపాటి విశేషం కూడా కనిపిస్తున్నది. అదేమిటంటే ఆ మంత్ర వర్ణంలో ఏవ అని ఉంది. తమేవ అని గదా మాట ఇక్కడ. ఏవ అంటే దాన్ని మాత్రమేనని అర్థం. అంటే దాన్ని మాత్రమే తెలుసుకోవాలి గుర్తించాలి మనం. మరేది నీవు గుర్తించినా ప్రయోజనం లేదు. ఫలకారి కాదు. అంటే స్వరూపాన్ని గాక మరేది గుర్తించినా సమస్యకు పరిష్కారం లేదని అర్థం. అదేగా మనమిప్పుడు చేస్తున్న పని. మనమీ అనాత్మ ప్రపంచాన్ని నిత్యమూ చూస్తూనే ఉన్నాము. దీనితో లావాదేవీ పెట్టుకొంటూనే ఉన్నాము. కాని జీవిత సమస్య పరిష్కృతమయిందా. లేదు గదా. కారణం. అసలైన దీని తత్త్వాన్ని గుర్తించ లేదింత వరకూ. గుర్తిస్తే ఇది రజ్జు దర్శనం చేస్తే సర్ప భ్రాంతి తొలగినట్టు ఎప్పుడో తొలగిపోయేది. కనుకనే దాన్నే గుర్తించమని అవధారణార్థకమైన శబ్ద ప్రయోగం.

అలాగే మరొక్క చిన్న అంశమేమంటే అక్కడ **అయనాయ విద్యతే** అని అయన శబ్దం ముందు ప్రయోగించాడు శ్లోకంలో. ఇక్కడ అలా కాక **విద్యతే అయనాయ** అని ప్రయోగించాడు. అయన

మంటే రెండర్థాలున్నాయి. ఒకటి గమ్యమని రెండవది ప్రయాణమని. గమ్యం చేరాలంటే ప్రయాణం చేయాలి. గమ్యానికి మరొక మార్గం లేదు జ్ఞానం తప్ప అని మొదటి మంత్రం చెబుతున్నది. ఇక్కడ మరొక మార్గమే లేదు గమ్యాని కని మార్గానికి ప్రాధాన్యమిస్తున్నది. అక్కడ ప్రయాణానికి మార్గం లేదంటే ఇక్కడ గమ్యానికి వేరే మార్గం లేదని మాట. ఒకచోట గమ్యానికి మరొక చోట గమకానికి ప్రాధాన్యమిచ్చి మాటాడటం వల్ల గమ్య గమకాలు రెండూ ఏమరకుండా పట్టుకోవాలి సాధకుడని హెచ్చరించి నట్టవుతున్నది.

**ప్రజాపతి శ్చరతి గర్భేంతః**

**అజాయమానో బహుధా విజాయతే**

**తస్యధీరాః పరిజానంతి యోనిం**

**మరీచీనాం పద మిచ్ఛంతి వేధసః**

అయితే ఇంతకూ మనం సాధించి పట్టుకోవలసిన ఆ పురుషోత్తమ స్వరూప మెక్కడ ఉంది. ఎలా ఉంది. దాని చిరునామా ఏమిటో తెలిస్తే గదా దాన్ని గుర్తించే ప్రయత్నమంటూ చేయగలం. తెలియనంత వరకూ ఎంత ఉబలాట పడి ఏమి సుఖమని ప్రశ్న వచ్చింది మరలా. వస్తే దానికిప్పుడీ మంత్రం సమాధాన మిస్తున్నది. **ప్రజాపతి శ్చరతి గర్భే**

Yellamraju Srinivasa Rao
www.advaitavedanta.in

**అంతః** - ప్రజాయంతే ఇతి ప్రజాః - అనేక రూపాలుగా జన్మిస్తున్న ఈ చరా చర పదార్థాలే ప్రజ. వీటన్నిటి గర్భంలోపల **చరతి** నిత్యమూ సంచరిస్తూ ఉన్నాడు. ఎవరు. ప్రజాపతి. వీటిని సృష్టించిన ఆ పురుషుడు. సృష్టించి దూరమై పోలేదు. అలాగైతే ఎప్పటికీ ఆయన పొలకువ మనకు తెలియదు. మరేమిటంటారు. అది కేవలం నిమిత్త కారణమే గాక ఉపాదానం కూడా అయినందువల్ల సృష్టి అంతా వ్యాపించే ఉన్నదా తత్త్వం. అంతర్బహిశ్చ భూతానాం. మంత్ర పుష్పంలో కూడా వచ్చిందీ భావం. అంతశ్చరతి భూతేషు గుహాయాం విశ్వమూర్తిషు అని శ్లోకం. అక్కడ ఈ భావమే ప్రతిధ్వనిస్తుంది. రెండూ నారాయణ సూక్తాలే గదా. పోలిక లేకుండా ఎలా పోతుంది. అదే మంత్ర పుష్పారంభంలో కూడా వివరించబోతాము. అప్పటికా మూల పదార్థ మెక్కడా ఏమిటి అని ప్రశ్నే లేదు. ఎక్కడ బడితే అక్కడ మనం చూచే ఈ ప్రపంచంలోనే ఉంది. అయితే వస్తు సిద్ధంగా ఉన్నా గర్భే అంతః ఎక్కడో లోపల గుప్తంగా మరుగు పడి ఉంది. అధిష్ఠాన Base మెప్పుడూ మరుగు పడే ఉంటుంది. ఆరోపితం లాగా బయటపడి కనిపించదు.

అయితే ఈ ఆరోపిత మేమిటి. దీనికీ దానికీ ఏమిటి సంబంధం. **అజాయ మానో బహుధా విజాయతే.** అది అజాయ మాన మా మూలతత్త్వం. దానికి జన్మ లేదు. మొదటి నుంచీ ఉన్నది. సిద్ధ మది

Yellamraju Srinivasa Rao
www.advaitavedanta.in

Ready made. సాధ్యం కాదు. మరి ఇదో. **బహుధా విజాయతే.** ఇదంటూ ఒక పదార్థమేదీ లేదు దాని కన్యంగా. అదే **బహుధా** చిత్ర విచిత్రమైన రూపాలలో **విజాయతే.** విభక్తమయి కనిపిస్తున్నది. జన్మ లేనిదే ఆయా ఉపాధుల రూపంలో జన్మిస్తున్నది. జన్మ లేనిదెలా జన్మించ గలిగింది. అదే మాయ. స్వరూపతః తన పాటికితా నద్వితీయంగానే ఉంది. కాని తన మాయా ప్రభావంతో ఎన్నో రూపాలుగా అవతరించినట్టు దర్శన మిస్తున్నది. అది స్వరూపమైతే ఇది దాని మీద ఆరోపితమైన తదీయ విభూతి. ఇదీ రెంటికీ సంబంధం. స్వరూప విభూతుల కున్న సంబంధం. ఆధ్యాసికమైన సంబంధమని పేర్కొంటారు వేదాంతులు. ఇదీ కారణమది మరుగుపడి మనకు కనపడకుండా పోవటానికి.

అయితే మరి ఆ మరుగు తొలగించి దాన్ని దర్శించట మెలాగా అని మరలా ప్రశ్న. దానికే సమాధాన మిస్తున్నారు. **తస్య ధీరాః పరిజానంతి యోనిం.** యోని అంటే దీనికి మూలస్థానమైన ఆ పదార్థం. ఇవి గదా దాన్ని కప్పేశాయి. ఈ కప్పిన నామరూపాలు కూడా ఏవో కావు. అదే ఇలా విస్తరించి ఉంది. కనుక ఇదంతా అదేనని ఆ దృష్టితో ఈ దృశ్య ప్రపంచాన్ని చూచి సమన్వయించుకోటమే ఉపాయం. **ధీరాః** దానికెంతో ధైర్యముండాలి సాధకుడికి. ఎలాటి ధైర్యం. **పరిజానంతి.** పరితః జానంతి - ఎటు చూస్తే అటు విస్తరించి ఉన్నదంతా అస్తి భాతి

ఉంది ఉన్నట్టు భాసిస్తున్నది. ఉండటమనే స్ఫురణ తప్ప మరేమీ లేదనే చూపుతో చూడాలి ప్రతి ఒక్కటీ. అప్పుడది తనలోనే దాగి ఉన్న తత్త్వాన్ని తన పాటికి తానే బయటపెట్టి చూపుతుంది. ఈ భావమే తస్యైష ఆత్మా వివృణుతే తనూం స్వామని చాటి చెబుతున్న దుపనిషత్తు మనకు.

అయితే ఎవరికంటే వారికా సామర్థ్యం లేదు. ధీరులయి ఉండాలి వారు. ధైర్యమనే గుణముండాలి. ఏమిటా ధైర్యం. **మరీచీనాం పదమిచ్ఛంతి వేధసః -** విధించే వాడెవడో వాడు వేధ. చరాచరాలను సృష్టించిన వాడని అర్థం. వాడి పదం స్థానం. వాడెక్కడ ఉన్నాడో ఆ స్వరూపం **ఇచ్ఛంతి.** దాన్ని చూడాలనే కోరిక బలంగా ఉండాలి మానవుడికి. దీన్నే యమే వైష వృణుతే అనే మాటలో సూచించింది ఉపనిషత్తు. అయితే దాన్ని చేరేందుకు తోడ్పడేది ఏది మనకు. **మరీ చీనాం పదం -** మరీచి అంటే కిరణం. సూర్యమండలం లాంటిదది అయితే సూర్యకిరణాల లాంటివి దానిమీద అధ్యారోపితమైన నామరూపాలు. ఈ కిరణాలను పట్టుకొని పోతే ఇవే దారి చూపుతాయా మండలానికి. ఇది ఒక ప్రయాణం లాంటిదీ సాధన. ఒక బస్సులో కూచొని ప్రయాణమయి పోతున్నామంటే అదే దారి చూపుతూ పోతుంది గమ్యస్థానానికి. ఆ మార్గంలోనే పయనిస్తున్నప్పు డది చేరటంలో అభ్యంతర మేముంది.

మరీచి అంటే మరొక అర్థం కూడా ఉంది. మరీచి అంటే ఎండమావులు. ఎండమావులు జలం గాకపోయినా జలంలాగా భాసిస్తుంటాయి. ఇది ఏమిటా అని విచారణ చేసే కొద్దీ అది ఏ సూర్యరశ్మి వికారమో ఆ రశ్మినే క్రమంగా బయటపెట్టి చూపుతుంది. అసతోమా సద్గమయ అనే మాట కిదే అర్థం. అసత్యం ద్వారానే సత్యాన్ని పట్టుకోవాలి. కారణం. అసత్యమంటూ అసలేదీ లేదు సృష్టిలో. సత్యమే ఉన్నది. నీ వ సత్యమని దేన్ని చూస్తున్నావో అది సత్యమే నీ దృష్టి కసత్యంగా కనిపిస్తున్నది. కనుకనే వివేచన చేస్తే ఇది మరలా సత్య స్వరూపంగానే సాక్షాత్కరిస్తుంది. అప్పుడ సత్యం సత్యమనే వికల్పం తొలగిపోయి అంతా ఏకైకమైన సత్యమేననే అద్వైత భావం అనుభవానికి వస్తుంది. ఇదీ ఇందులో ఉన్న సూక్ష్మం.

**యో దేవే భ్య ఆ తపతి - యో దేవానాం పురోహితః**

**పూర్వో యో దేవేభ్యో జాతః - నమో రుచాయ బ్రాహ్మయే -**

పోతే ఇప్పుడలాటి బ్రహ్మ స్వరూపానికి చెందిన జ్ఞానమేదో దాని నందిస్తున్నదీ మంత్రం మనకిప్పుడు. ఏదైనా ఒకటి మన అనుభవానికి రావాలంటే దానికి సంబంధించిన జ్ఞానమేర్పడాలి మనకు. దీనికే వృత్తి అని పేరు. గృహానికి చెందినది గృహాకార వృత్తి. వనానికి చెందినది వనాకార వృత్తి. The Idea of a Thing. వృత్తి అనేదే ప్రమాణం. దాని

ద్వారానే పట్టుకోవాలి అందులో ప్రతిఫలించిన ప్రమేయాన్ని. ప్రస్తుతం పరమాత్మ అనే దొక ప్రమేయం. To be known. అంటే తెలుసుకోవలసిన పదార్థం. అందుకే అదీ ఒక ప్రమేయమని పేర్కొన్నది మంత్ర పుష్పం. మన స్వరూపమేనని గుర్తించే వరకూ తాత్కాలికంగా ప్రమేయమని భావించాలి గదా. అందుకని ప్రమేయమన్నారు.

సరే ఇప్పుడా ప్రమేయం గాని ప్రమేయాన్ని అందించే జ్ఞానమేమిటి. అదే బ్రహ్మాకార వృత్తి. ఎలా కలుగుతుందది. **యో దే వేభ్య ఆతపతి** - దేవతలంటే ఇక్కడ మన ఇంద్రియాలు. అవీ ప్రకాశిస్తూనే గదా ఉంటాయి. అందుకే దేవ అన్నారు. అందులోనూ మనోవృత్తులు మరీ ప్రకాశిస్తుంటాయి. **దేవేభ్యః** అంటే చిత్ర విచిత్రంగా ఏర్పడే చిత్త వృత్తులని అర్థం. కాగా వీటికి అతీతమైన విలక్షణమైన వృత్తి ఒకటి ఉంది. అది **ఆతిపతి.** ఈ వృత్తులన్నిటినీ వ్యాపించిన ఒక వెలుగు. ఒక ప్రకాశం. ఆ ప్రకాశంలో ప్రకాశిస్తున్నాయీ ఆలోచనలన్నీ. వీటికి వెనకాల జేరి వీటిని ప్రకాశింప జేస్తున్నదదే. ఒక దీపకాంతిలో వస్తువులు ప్రకాశిస్తున్నట్టు ప్రకాశిస్తున్నాయీ వృత్తులన్నీ ఆ అఖండమైన బ్రహ్మాకార వృత్తిలో.

**యో దేవానాం పురోహితః** - అదే ఈ ఇంద్రియ వృత్తులన్నింటికీ పురోహితుడు. ముందున్న వృత్తి. అంతేకాదు. **పూర్వో యోదేవేభ్యో జాతః**

వీటన్నిటి కంటే ముందే ఏర్పడిందది. ప్రకాశం ముందుంటే గదా ప్రకాశించే మిగతా వస్తువులన్నీ ప్రకాశిస్తుంటాయి. అలాగే అస్తి భాతి అనే ప్రకాశమొకటి ముందుంటేనే అందులో ప్రతి ఒకటీ అస్తి అనీ భాతి అనీ విశేష రూపంగా స్ఫురిస్తున్నది మనకు. అది సామాన్యమైతే ఇవన్నీ దాని విశేషాలు. **నమో రుచాయ బ్రాహ్మాయే.** అంచేత బుద్ధిమంతుడైన మానవుడు వీటిని గాదు పట్టుకోవలసింది. విశేషాలను పట్టుకొంటే పరిష్కారం లేదు సమస్యకు. మీదు మిక్కిలి సమస్యనింకా జటిలం చేస్తాయి విశేషాలు. అదే గదా ఈ సంసారం. కనుక వీటన్నింటినీ వ్యాపించిన ఆ సామాన్య వృత్తిని పట్టుకోవాలి మనం. అప్పుడది వీటికి జవాబు చెప్పగలదు. అదే **రుచాయ బ్రాహ్మాయే.** బ్రహ్మ సంబంధి అయినది బ్రాహ్మం. ఏమిటది. రుచి. రుచి రుక్కంటే ప్రకాశం. జ్ఞాన ప్రకాశం. బ్రహ్మాకార వృత్తి అని అర్థం. దానికి **నమః -** నమస్కార మంటున్నది మంత్రం. అంటే దానికి వశమైపోవాలి నీ మనస్సని భావం. మిగతా ప్రపంచ వృత్తులన్నీ దాని కధీనమయి అందులోనే ప్రవిలయ మయి పోవాలి. అదే అసలైన నమస్కారం. శరణాగతి.

అసలీ రుచి అనండి. ప్రకాశ మనండి. ఎలా ఏర్పడింది. అంతకు ముందు లేనిది గదా ఇది. అంతకు ముందు నుంచీ ఉన్నది బ్రహ్మమే

Brahmasri Yallamraju Srinivasa Rao www.advaitavedanta.in

గాని బ్రహ్మ జ్ఞానం కాదు. ముందునుంచే తదాకార వృత్తి ఉంటే క్రొత్తగా దాన్ని మనకు శాస్త్రం బోధించటం దేనికి. ఆ బోధ కోసం మనం తాపత్రయ పడటం దేనికి. దానికి నోచుకోకనే గదా దాన్ని సంపాదించటం కోస మింత ఉబలాటం. మరి అది ఎలా ఏర్పడుతుందా బ్రహ్మాకార వృత్తి. ఏది దానికి దోహదం చేస్తుందని ప్రశ్న. సమాధాన మిస్తున్నది చూడండి మంత్రం.

**రుచం బ్రాహ్మం జనయంతః - దేవా అగ్రే తదబ్రువన్**

**య స్త్వైవం బ్రాహ్మణో విద్వాన్ - తస్యదేవా అసన్ వశే -**

బ్రహ్మమంటే పరినిష్ఠితమైన పదార్థం గాని తద్విషయమైన జ్ఞానమలా పరినిష్పన్నం కాదు. నిష్పన్నం చేసుకోవాలది. చేసుకొంటే అది అంతకంతకు విస్తరించి బ్రహ్మతత్త్వాన్ని మన అనుభవానికి తెచ్చి చివరకందులోనే లీనమయి అఖండమైన అనుభూతి నిస్తుంది సాధకుడికి. ఒక సంకేతం లాంటిదది. సంకేతం సత్యాన్ని చూపటానికే ఉంటుంది. చూపి మనమది అందుకొన్న తరువాత సంకేతాని కస్తిత్వం లేదు. ఇది కూడా మానవుడి బుద్ధితో పాటు సత్యంతో ఏకం గాక తప్పదు.

పోతే ఇప్పుడలాటి జ్ఞానవృత్తి జనకమైన సామగ్రి ఏమిటి. అది ఎక్కడ ఉంది. **దేవాః** మన బుద్ధి వృత్తులే అవి. ఇంద్రియ వృత్తులు బుద్ధి

వృత్తులకు మూలమైతే బుద్ధి వృత్తులు బ్రహ్మాకార వృత్తికి హేతుభూత మవుతాయి. బ్రహ్మ వృత్తి కూడా ఒక వృత్తి విశేషమే గదా. మిగతావి విశేష వృత్తులయితే ఇది సామాన్య వృత్తి. అవి అనాత్మ వృత్తులైతే ఇది ఒక్కటీ ఆత్మాకార వృత్తి. ఇదీ తేడా. అయితే ఆ వృత్తుల లోనుంచే ఈ అఖండాకార వృత్తి కూడా జనిస్తుంది. **రూపం బ్రాహ్మం జనయంతః -** అవే దీన్ని సృష్టిస్తున్నాయి. ఎలాగ. ఇవన్నీ ఖండ వృత్తు లెప్పుడయ్యాయో అప్పుడు వీటికి విలక్షణంగా ఒక అఖండ వృత్తి నివే సూచన చేస్తాయి. దాని జన్మకివే కారణం **అగ్రే తదబ్రువన్** అలా జన్మింప జేసిన చిత్త వృత్తులే దేవతలు. ప్రకాశ శీలమైనవి. ప్రకాశ శకలాలవి. ప్రకాశ శకలాలే మహా ప్రకాశాన్ని మనసుకు తేగలవు. అదే దాని జన్మకు కారణమని చెప్పటంలో ఆంతర్యం. అలా జన్మింప జేసి ఆ చిత్త వృత్తులన్నీ ఏమంటున్నాయో తెలుసా.

అంటున్నాయంటే వాటికి నోరావాయనా. ఎలా అనగలవని అడుగుతారేమో. అనట మంటే ఇక్కడ సూచించటం. ఏమని సూచిస్తున్నాయవి. **యస్త్వైవం బ్రాహ్మణో విద్యాత్ -** ఎవడికైతే ఇలాటి బ్రహ్మ జ్ఞానం కలిగి దాని బలంతో బ్రహ్మ స్వరూపాన్ని ఉన్న దున్నట్టు దర్శించగలడో వాడు గొప్ప విద్వాంసుడు. జ్ఞాని. అలాంటి వాడైతే **తస్య**

**దేవా అసన్ వశే.** వాడికీ చిత్త వృత్తులేమిటి ఇంద్రియ వృత్తులేమిటి. అన్నీ వశంలో ఉంటాయి. అంటే వాడి చెప్పు చేతల్లో ఉండి వాడు చెప్పినట్లు నడచుకొంటాయి. యుక్త చేష్ట స్యకర్మ సు అని గీత చెప్పినట్టు అసలు కర్మ చేయకపోడు. చేసినా వాటికి బానిస అయి చేయడు. అది ఎలా సాధ్యం. ప్రకృతి గుణాలే గదా ఏ కర్మ అయినా చేయిస్తుంది నీ చేత. ఆ గుణాలన్నీ వాడి కాత్మాకారంగా మారి కనిపిస్తాయి. కనుక అవి వాడి పట్ల గుణాలూ కావు. అవి చేయించే పనులు పనులూ గావు. గణైర్యో నవిచాల్యతే అన్నట్టు బ్రహ్మ జ్ఞాని మీద గుణాలు దాడి చేయవు. గుణమైనా అది నిర్గుణమే. ఎటు వచ్చీ జ్ఞాన దృష్టితో చూడాలి ఏ కర్మనైనా. జ్ఞాన ప్రసరణే కర్మ - దాని విభూతే నని తెలుస్తుందప్పుడా జ్ఞానికి. ఇదీ ఈ వృత్తులన్నీ మనకు చేసే మహోపదేశం. మౌనంగా చేస్తున్న మహోపదేశం. అలాటి ఉపదేశ మందుకొని బ్రహ్మ జ్ఞానం సంపాదించి బ్రహ్మను భావమే పొందా మనుకోండి. అప్పుడే మవుతుంది. ఆ అనుభవం ఎలా ఉంటుంది. చెబుతున్నది పురుష సూక్తం దాని ఫలశ్రుతి ఆలకించండి.

**శ్రీ శ్చ తేలక్ష్మీశ్చ పత్న్యా అహోరాత్రే పార్శ్వే**

**నక్షత్రాణి రూపం - అశ్వినౌ వ్యాత్తం**

హ్రీ అంటే లజ్జ - లక్ష్మి అంటే సంపద అని బాహ్యార్థం. అవి రెండూ జ్ఞానికి **సత్న్యౌ** భార్యలవుతాయట. లజ్జ లక్ష్మి ఇవి రెండూ అమూర్తమైన భావాలు. అవి జ్ఞానికి భార్య లెలా కాగలవు. కాకున్నా అసలు జ్ఞానేమిటి. వాడికి భార్యలేమిటి. కనుకనే ఇది కేవలం బాహ్యార్థంగా తీసుకోగూడదు మనం. మరేమిటంటారు. ఇంతకు ముందు లాగానే అంతరార్థం చెప్పుకోవలసి ఉంది దీనికి కూడా. ఏమిటది.

హ్రీ అంటే హరించే శక్తి. సంసారం వైపు లాగేసే అవిద్యకే హ్రీ అని పేరు. అలాగే లక్ష్మి అంటే లక్షింప చేసేది బ్రహ్మాకార వృత్తి. విద్య అది. అప్పటికి హ్రీ లక్ష్ములంటే విద్యా విద్యలు. ఇవి రెండూ భార్యలంటే జ్ఞాని కధీనమయి ఉంటాయని భావం. వీటి రెంటి మీదా వాడాధార పడలేదు. మీదు మిక్కిలి ఇవే వాడి కధీనమయి వాడి స్వరూపంలో కలిసి ఏకమయి ఉంటాయి. విద్యా విద్యా స్వరూపిణి గదా అమ్మవారు. జ్ఞానమనేది జ్ఞానా జ్ఞానాలను రెంటినీ లయం చేసుకొన్నప్పుడే అది పరిపూర్ణ జ్ఞానం. ప్రజ్ఞానం.

పోతే అహోరాత్రే పార్శ్వే. పగలూ రాత్రీ రెండూ జ్ఞానికి రెండు పార్శ్వాలు. రెండూ వాడికి చెందినవే ననటం వల్ల కాలమనేది వాడి విషయంలో మారకుండా ఆగిపోతుందని భావం. అంటే ఆంతరమైన

మనస్సూ బాహ్యమైన కాలమూ రెండూ పనిచేయవు జ్ఞాని మీద. రెండూ వాడి స్వరూపంలో చేరి లయమయి పోవాలి. అలాగే **నక్షత్రాణి రూపం.** అప్పుడా జ్ఞాని రూపమేమిటని అడుగుతారా. నక్షత్రాలే రూపమంటున్నది మంత్రం. నక్షత్రాలనేవి భూరాది గోళాలన్నటికీ ఉపలక్షణం. అవి భూత భౌతిక పదార్థాలన్నిటికీ సంకేతం. దీన్ని బట్టి సమస్త ప్రపంచమూ వాడి రూపమే. వాడు ద్రవ్యమైతే Substance ఇదంతా వాడి ధర్మం. Form. అంటే జ్ఞానం వాడి స్వరూపమైతే జ్ఞేయమైన ఈ ప్రపంచమంతా వాడికి విభూతిగా కనిపిస్తుంటుంది. **అశ్వినౌ వ్యాత్తం.** మరి వాడెలా బ్రతుకుతుంటాడు. ప్రాణముంటే గదా బ్రతుకు. జ్ఞానమే చెబుతున్నారు గాని ప్రాణం సంగతేమిటి. జ్ఞానం చిత్తను కొంటే దాని అస్తిత్వం సత్తు గదా. అదే గదా ప్రాణశక్తి. అది లేకుండా చిత్తెలా నిలుస్తుంది అని అడిగితే జవాబిస్తున్నది మంత్రం.

**అశ్వినౌ వ్యాత్తం.** అశ్వినులే వ్యాత్తమంటే. సర్వత్రా స్థితి రూపంగా వ్యాపించి ఉన్న తత్త్వం. అశ్వనీ దేవతలని ఉన్నారిద్దరు దేవ వైద్యులట వారు. ఇది పురాణ కథ. దీనిలో ఉన్న శాస్త్ర రహస్య మేమంటే అశ్వంలాగా ఇటూ అటూ పరుగెడుతున్నవి మన ఉచ్ఛ్వాస నిశ్వాసాలు ప్రాణా పానాలంటారు వీటినే. ఇది మన శరీరం వరకే గాక సర్వత్రా

ప్రసరిస్తే వ్యాప్తం. అంటే వ్యాపకమైన అస్తిత్వం. జ్ఞానం సర్వత్రా ఉన్నవాడు కాబట్టి జ్ఞాని - వాడి ప్రాణం కూడా సర్వవ్యాపకం కావలసిందే తప్పదు. సర్వజ్ఞం సర్వశక్తి సమన్వితమైన తత్త్వమది.

ఇలాటి జ్ఞానిని సంబోధించి చెబుతున్నాడు మనబోటి సాధకు డొకడు. ఏమని. **ఇష్టం మనిషాణ - అముం మనిషాణ - సర్వం మనిషాణ.** మనిషాణ అంటే నా మనస్సుకు ఇదంతా ప్రసాదించు నేను ధన్యుణ్ణవుతాను. ఏమిటా ప్రసాదించవలసింది. **ఇష్టం.** ఇహానికి సంబంధించి నేను కోరింది. **అముం.** అలాగే పరానికి చెందింది. అంటే పరావర జ్ఞానం నీకున్నదే నాకూ అనుగ్రహించు. అలా రెండూ అనుగ్రహిస్తే **సర్వం మనిషాణ.** సర్వమూ నాకు అనుగ్రహించినట్టే. ఆచార్యా ద్ధైవ విదితా విద్యా సాధిష్ఠం ప్రాపతి అన్నారుగా. అంచేత నీలాటి మహనీయుడి వల్ల శ్రవణ మననాదులు చేస్తే నీ అంతే వాసినైన నాకూ నీలాటి అనుభవమే కలుగుతుందని నా నమ్మకం - అని ప్రార్థన.

పోతే ఇదంతా మనసులో పెట్టుకొని శాస్త్రానికంతా సారభూతమైన ఉపదేశం మనబోటి సాధకుల కందరికీ అందిస్తున్నదిప్పుడీ శాంతి వాక్య మనే మిషతో పురుష సూక్తం. వినండి.

**ఓమ్**

**తచ్ఛం యో రా వృణీ మహే**

**గాతుం యజ్ఞాయ**

**గాతుం యజ్ఞపతయే**

**దైవీ స్వస్తి రస్తు నః**

**స్వస్తి ర్మా ను షేభ్యః**

**ఊర్ధ్వం జిగాతు భేషజమ్**

**శం నో అస్తు ద్విపదే**

**శం చతుష్పదే**

**ఓం**

**శాంతి శ్శాంతి శ్శాంతిః**

శం అంటే సుఖం. బ్రహ్మానందం. అది **ఆవృణీ మహే.** మేము కూడా మీలాగే కాంక్షిస్తున్నాము. ఎందుకు. **గాతుం యజ్ఞాయ.** జ్ఞాన యజ్ఞాన్ని కీర్తించటానికి. **గాతుం యజ్ఞపతయే.** ఆ జ్ఞానం ద్వారా జ్ఞాన యజ్ఞాధిపతి ప్రజ్ఞాన స్వరూపమైన పరమాత్మను దర్శించటానికి.

Brahmasri Vallamraju Srinivasa Rao
www.advaitavedanta.in

దైవీ స్వస్తి రస్తునః - అందుకోసమీ శరీరమనే ఉపాధి బలంగా ఉండాలి. ఇంద్రియ పటుత్వముండాలి. అలా ఉండాలంటే ఆధి దైవికమైన శక్తుల అనుగ్రహముండాలి మనకు. **స్వస్తి ర్మానుషేభ్యః** - దైవికమైనదే గాక మానుషమైన సహకారం కూడా ఉండాలి మనకు. సు అస్తి - స్వస్తి Well being అని అర్థం. సుఖమైన స్తిమితమైన జీవిత మని అర్థం. అలాటి శాంతినీ సుఖాన్నీ దైవమూ మానుషమూ రెండింటి వల్లా మనకు ప్రాప్తించాలని కోరుకోవాలి. **ఊర్ధ్వం జిగాతు భేషజం.** అయితే అది ఎప్పుడు ఫలిస్తుంది. భేషజమంటే కల్మషం. అది మన మనస్సుల నుంచి దూరమై పోయినప్పుడు -

అందుకే **శంనో అస్తు** మనకే గాదు సుఖ శాంతులుండాలని ఆసించ వలసింది. మరి ఎవరికి. **ద్విపదే** తోడి మానవులందరికీ. అంతేకాదు. **చతుష్పదే.** ద్విపాత్తులైన మానవులకే గాక చతుష్పాత్తులైన జంతువులకు కూడా ఉండాలని కోరుకోవాలి సుఖశాంతులు. సర్వేసంతు నిరామయాః - ఎవరికీ ఎలాటి ఆధివ్యాధులూ కలగరాదు. లోకాస్సమస్తా స్సుఖినో భవంతు. ప్రాణులందరూ సుఖంగా జీవయాత్ర సాగించాలని పెద్ద మనస్సుతో కోరుకోవాలి ప్రతి మానవుడూ. అది సర్వమూ ఆత్మ

Yalamanchi Brahmasri Srinivasa Rao www.advaitavedanta.in

స్వరూపంగా దర్శించిన మహాజ్ఞానులకే ఉంటుందా విశ్వజనీనమైన భావన. మనబోటి సాధకులకు కూడా అలాటి మహోన్నతమైన భావనే ఉండాలి. అప్పుడే త్రివిధమైన శాంతీ లభిస్తుంది మనకు. ఆధ్యాత్మికాధి భౌతికాధి దైవిక తాపత్రయాని కప్పుడే సంపూర్ణమైన శాంతి.

Brahmasri Yallamraju Srinivasa Rao www.advaitavedanta.in

# మంత్ర పుష్ప - రహస్యార్థము

మన సూక్త త్రయంలో శ్రీసూక్త పురుష సూక్తాలయినాయి. పోతే ప్రస్తుతం మూడవదైన మంత్ర పుష్పానికి వచ్చాము. పురుష సూక్తం నారాయణాను వాకం క్రిందికి వస్తే ఇదీ దాని క్రిందికే వస్తుంది. చాలావరకు దానికీ దీనికీ అంత తేడా ఉన్నట్టు కనిపించదు. అది సహస్ర శీర్షా అని ఆరంభమైతే సహస్ర శీర్షమని ఇదీ మొదలవుతుంది. అయితే పురుష సూక్తం పయి నుంచి క్రిందికైతే మంత్రపుష్పం క్రింది నుంచి పైకి చేసే ప్రయాణం. విరాడ్రూపుడైన పురుషుడు ప్రపంచంగా ఎలా పరిణమించాడో చెబుతుంది పురుష సూక్తం. అలా పరిణమించిన ఈ ప్రపంచం ద్వారా మరలా ఆ పరమ పురుషుణ్ణి ఎలా అందుకోవాలో బోధిస్తుంది ఈ మంత్ర పుష్పం. అద్వైత సిద్ధాంత రీత్యా రెండింటికీ గమ్యమొకటే చివరకు. పైకీ క్రిందికీ అనే ప్రసక్తి లేదు. సమస్తమూ ఏకమని భావించినప్పుడు.

Yallamraju Srinivasa Rao
Brahmasri
www.advaitavedanta.in

కాని గమ్యం చేరే వరకూ వాస్తవంగా కాకపోయినా ఆ భాసగానైనా గమకమైన సాధన మార్గం కనిపిస్తూనే ఉంటుంది. అలా కనిపించినప్పుడే అసతో మా సద్గమయ అన్నట్టు మనబోటి సాధకులు దాన్ని ఆలంబనం చేసుకొని గమ్యాభిముఖంగా పయనించి తరించగలం. అందుకే దీనిని మంత్ర పుష్పమని సాభిప్రాయంగానే పేర్కొన్నారు. పుష్పం పుష్పంగా నిలిచి పోదెప్పుడు. అంతకంతకు వికసించి విస్తరించి ఫలానికి దారి తీస్తుంది. అక్కడికి దాని ప్రయాణ మాఖరు. అలాగే దీన్ని కూడా మననం చేస్తూ పోతే ఈ పుష్పం కూడా ఫలంగా మారి దాని అనుభవాన్ని ప్రసాదించి మనలను కాపాడుతుంది. కాబట్టి దీనికి మంత్ర పుష్పమనే పేరు సార్థకమవుతున్నది.

అంతే కాదు. పుష్పమంటే మానవుడి మనస్సు. అది పుష్పావస్థలోనే ఉంటే ప్రయోజనం లేదు. ఫలోన్ముఖం కావాలి. అలా ఫలితానికి రావాలంటే అసమగ్రమైన ఈ మనో వృత్తులన్నింటినీ సమగ్రమైన బ్రహ్మవృత్తిగా మార్చుకోవాలి. పుష్పమనేది అసంపూర్ణమైన దశ అయితే ఫలం సంపూర్ణత దానికి. ఎలా అవుతుందది సంపూర్ణం. మంత్రం ద్వారా. మననా త్త్రాయతే ఇతి మంత్రః – మననం చేసే కొద్దీ చివరకేది మనలను కాపాడుతుందో అది మంత్రం. అసంపూర్ణమైన మనస్సనే పుష్పాన్ని సంపూర్ణమైన ఫలంగా మారుస్తుంది మంత్రం. అలాటి మంత్రం

ద్వారా మనస్సును సర్వవ్యాపకమైన బ్రహ్మ చైతన్యాని కర్పణ చేయటమే మంత్ర పుష్పమనే మాటలో ఇమిడి ఉన్న ఆంతర్యం. కాబట్టి మనమిప్పుడా అంతరార్థాన్ని దృష్టిలో ఉంచుకొని ఈ మంత్ర పుష్పాన్ని వ్యాఖ్యానించ వలసి ఉంది. ఇందులో రెండు భాగాలున్నాయి. మొదటిది సహస్ర శీర్షమనే దానితో ప్రారంభమయి సముద్రేంతం విశ్వశంభువం వరకూ సాగే పూర్వార్ధం. రెండవది పద్మకోశ ప్రతీకాశ మనే వాక్యం మొదలుకొని చివరిదాకా సాగే ఉత్తరార్ధం. ఇందులో పూర్వార్ధం మనం చేరవలసిన గమ్యాన్ని వర్ణిస్తే ఉత్తరార్థం దాన్ని చేర్చే గమకం లేదా సాధన మార్గాన్ని వర్ణించి చెబుతుంది. కేవలం గమ్యాన్ని వర్ణించి కూచుంటే ప్రయోజనం లేదు. సాధనం లేకుండా దాన్ని అందుకోలేము. అలాగే కేవలం గమకమైన సాధన మార్గాన్ని చెప్పి సుఖం లేదు. గమ్యమేదో తెలియకపోతే ఇది చీకటింట్లో తడుముకోటం లాగా ఫలితమివ్వదు. కాబట్టి రెండింటినీ నిరూపించాలి మంత్రం. అలాగే నిరూపిస్తున్నదీ మంత్ర పుష్పం. అందులో మొదట మన ప్రయాణానికేది గమ్యమో అది బయటపెడుతున్నది. వినండి.

Yallamraju Srinivasa Rao
www.adhyatmika.in

## - పూర్వార్థము -

**ఓమ్ - సహస్ర శీర్షగ్ం దేవం - విశ్వాక్షం విశ్వ శంభువమ్**

**విశ్వం నారాయణం దేవ - మక్షరం పరమం పదమ్**

అ ఉ మ అనే మూడక్షరాలూ కలిసి ఓమయింది. అ సృష్టిని చెబితే మ లయాన్ని చెబుతుంది. సృష్టి లయాలకు రెండూ రెండు సంకేతాలు. మొదట లయావస్థలో ఉన్న ప్రకృతి ప్రపంచ సృష్టిగా మారింది. మ దగ్గరి నుంచి అ దాకా సాగింది. అది సృష్టి. పోతే ఇది సంసార బంధానికి దారి తీసింది. కాబట్టి మరలా మనం దానికి ప్రతిలోమంగా ప్రయాణం చేయాలి. చేస్తే దీన్ని ప్రవిలాపనం చేసుకొని ముక్తులం కాగలము. అలా జరగాలంటే అ దగ్గరి నుంచి మ వరకు ప్రయాణం చేయాలి. అప్పుడది ఓమ్మవుతుంది. అంతేకాదు మ అనే దాన్ని కూడా దాటి నిశ్శబ్ద స్థితి నందుకొన్నప్పుడే అది మోక్షం. మొదటి మూడూ అవస్థాత్రయానికి ప్రతీకలైతే నాలుగవ దశ తురీయ స్థితికి. అదే మోక్షం. అక్కడ ఇక ఓంకారం వినపడ గూడదు. అంతవరకూ అది ఆలంబనం. ఆ పిమ్మట ప్రవిలయం.

ఈ విధంగా భావిస్తే నిరాకారంగా ఉన్న తురీయ చైతన్యమే సాకారమైన అవస్థాత్రయంగా భాసిస్తున్నదని మరలా భావన చేసే కొద్దీ ఈ సాకారమైన చైతన్యమే నిరాకారమైన తురీయ స్థితిగా సాధకుడి

అనుభవానికి రాగలదని అర్థమవుతున్నది. నిరాకారం స్వరూపమైతే సాకారమైన ఈ ప్రపంచమంతా దాని విస్తారం విభూతి. అప్పటికి స్వరూప విభూతులకు తేడా లేదు. రెండూ కలిసి ఒకే తత్త్వం. ఒకే నాణానికి రెండు ముఖాల లాంటివవి. అయినా రెండుగా భాసిస్తున్నదంటే అది కేవలం దానిలో అంతర్గతంగా ఉన్న మాయాశక్తి విలాసమే తప్ప మరేదీ గాదు. ఇది అర్థం చేసుకొని ఈ అనేకత్వం ద్వారా ఆ ఏకైకమైన స్వరూపాన్ని మన స్వరూపంగా దర్శించటమే మనం చేయవలసిన సాధన అంతా. కనుకనే మంత్రం రెండూ చెప్పి రెండింటినీ మరలా ఏకం చేసి చూపుతుంటుంది.

**సహస్ర శీర్షగ్ంం దేవం** - దేవ అంటే కేవల చైతన్య ప్రకాశమది. అప్పుడది నిర్గుణం. అదే సహస్ర శీర్షాలతో సాక్షాత్కరిస్తున్నది. అంతే కాదు. **విశ్వాక్షం - విశ్వశంభువం.** సహస్ర నేత్రాలతో కూడా కనిపిస్తున్నది. మొత్తం ప్రపంచానికి కలిగే సుఖం గాని శాంతి గాని దానివల్లనే కలుగుతున్నది. సరే గాని అది శుద్ధ చైతన్య మన్నప్పుడు కేవల నిరాకారమైన తత్త్వం గదా. అలాంటప్పుడీ సహస్ర శీర్షాలేమిటి. సహస్రాక్షు లేమిటి. ఇవెక్కడి నుంచి వచ్చాయీ ఆకారాలు దానికి. ఎక్కడి నుంచో గావు. మనవే ఆ శిరస్సులూ ఆ నేత్రాలూ ఆ శిద్రుత్రాలు మనబోటి మానవులకున్న ఇంద్రియాలూ అవయవాలే దాని ఇంద్రియాలూ

దాని అవయవాలు. ఆ మాటకు వస్తే మనమెక్కడ ఉన్నాము. మనకు శిరోనేత్రాది ఇంద్రియా లెక్కడ ఉన్నాయి. ఉన్నది వాస్తవంలో ఆ చైతన్యమే గదా. అది పరిపూర్ణమైన చైతన్యమై నప్పుడిక మనబోటి ప్రాణులు ఉండటాని కవకాశమే లేదు.

అయితే మనమంతా ఎవరం. ఎక్కడి నుంచి వచ్చాము. ఆ కీట బ్రహ్మ జననీ అన్నట్టు ఆ చైతన్య శక్తి కన్నా సంతానమే మనం. అంటే అర్థం. దాని వివర్తమే దాని ఆ భాసే. అదే నిర్గుణంగా ఉంటూనే సగుణంగా ఇన్ని రూపాలలో భాసిస్తున్నది. దాని ఆ భాసే ఇప్పుడీ మనమూ మన అవయవాలూ. ఇవి దానివే గాని మనవి గావు. మన మొకళ్ళ ముంటే గదా మనవి కావటానికి. దానికి వేరుగా మనమే లేనప్పుడివి మనవెలా అవుతాయీ ఉపాధులు. పరిశేషంగా దానివే కావాలి. అప్పటి కేమన్న మాట. అదే స్వరూప స్థితిలో నేత్ర శ్రోత్రాదు లేవీ లేని శుద్ధ చైతన్యమైతే విభూతి దశలో వేలకు వేల నేత్ర శ్రోత్రాదుల ఆకారాలు ధరించినట్టు భాసిస్తుంటుంది. అదే ఈ జీవకోటి. ఒకే తత్త్వం నిరాకారంగా సాకారంగా నిరుపాధికంగా సోపాధికంగా కూడా అభినయిస్తున్న దని అర్థం చేసుకోవాలి మనం.

**విశ్వం నారాయణం దేవం -** కనుకనే ఈ ప్రపంచమంతా ఏదో గాదు. నారాయణ స్వరూపవమే. నారములంటే పంచభూతాలు.

నారములంటే జీవుల సమూహం. అటు పాంచ భౌతికమైన జగత్తూ ఇటు పంచ కోశాత్మకమైన జీవులూ ఇద్దరూ కలిసి వచ్చారీ మాటలో. ఇలాటి నారములకు ఏది అయనమో అధిష్ఠానమో ఆశ్రయమో అది నారాయణ. అంటే జీవజగత్తులు రెండూ దేని ఆభాసో అది ఆ పరమాత్మ తత్త్వం. అదే ఈ విశ్వమంతా అంటున్నాడు. అంటే నీవు విశ్వమని చూస్తున్న దేదీ స్వతంత్రంగా ఒక పదార్థమంటూ లేదు నిజానికి. ఇది ఆ నారాయణ తత్త్వమే ఇలా విశ్వరూపంగా మనకు భాసిస్తున్నది. దాని రూపమే ఇది. సువర్ణ రూపమే కాసుల దండ అయినట్టు. దాని రూపమెప్పు డయిందో దాని కన్నా అది ఎప్పుడూ అన్యంగా ఉండలేదు.

అయితే ఒక చిన్న సూక్ష్మముంది ఇక్కడ. అదేమిటో చెబుతున్నాడు. **అక్షరం పరమం పదం.** అది మాత్రం అక్షరమూ పరమమైన స్థానం. ఇది కాదు. క్షరం కానిదేదో అది అక్షరం. క్షరమంటే నశించేది. ఎప్పుడూ వస్తూ పోతూ ఉండేది. నిలకడ లేనిది. అలాటి దీ ప్రపంచం. ఇది దాని రూపమే అయినా దాని తత్త్వం కాదు. రూపం చలిస్తుంది. మారుతుంది. ఉంటుంది. పోతుంది. స్వరూపం మాత్ర మలా మారదు. ఎప్పుడూ అలాగే నిలిచి ఉంటుంది. అలా నిలకడగా ఉన్న దాని నాధారం చేసుకొని దానివల్ల ఏర్పడే నామరూపాలు మాత్రం అనుక్షణమూ మారుతూ పోతుంటాయి. బంగారమెలా తన పాటికి తాను

కూటస్థంగా ఉన్నా దాని రూపాలైన కటక కుండలా ద్యాభరణాలెలా మార్పు చెందుతుంటాయో - సముద్ర జలమలా నిశ్చలంగా ఉన్నా దానిలో ఉదయించే తరంగ బుద్బుదాది రూపాలెలా రాకపోకలు చేస్తుంటాయో - అలాగా ఈ నామరూపాలు కూడా ఎప్పటికప్పుడు వ్యభిచరిస్తూ ఉంటాయి. కనుకనే ఇవి క్షరం. అక్షరం కావు. అపరం. పరం కావు. అక్షరమూ పరమమూ అయినదా మూలపదార్థమే. మరి ఇదంతా అదే నన్నారు గదా ఈ క్షరా క్షర భేదమెలా వచ్చిందని అడగవచ్చు. దానికి సమాధాన మేమంటే నిరాకారంగా నిశ్చలంగా ఏకంగా ఉన్న ఆ చైతన్య స్వరూపమే తన మాయా శక్తి ప్రభావం మూలంగా ఇలా సాకారంగా చలనాత్మకంగా అనేకంగా భాసిస్తున్నది. అప్పటికొకే ఒక నారాయణ స్వరూపం అక్షరంగానూ క్షరంగానూ ద్విపాత్రాభినయం చేస్తున్నదన్న మాట.

### విశ్వతః పరమా న్నిత్యం - విశ్వం నారాయణం హరిమ్

అదే వివరిస్తున్నా డిప్పుడు. ఈ వివిధ రూపాలుగా కనపడే విశ్వం కంటే అతీతంగా ఉన్నదా మూలతత్త్వం. అందుకే దీని ఉదయాస్తమయాలు దాని నంటవు. అంటకపోతే అది నిత్యం. ఒకే స్థితిలో ఉంటుంది. మరి ఈ విశ్వమంతా ఆ స్వరూపమే అయినా దాని శక్తి దాన్ని హరించింది. హరి అంటే హరించటమే. ప్రక్కకు లాగటం లాగి వివిధ రూపాలుగా

Yallamraju Srinivasa Rao
www.advaitavedanta.in

చూపుతున్నది. అలా చూపే ఆ పదార్థమే ఈ ప్రపంచం. కనుకనే ఇది అనిత్యం. అది నిత్యమని చెప్పటం. అంటే ఏమన్న మాట. నిత్య మొకటి అనిత్య మొకటి రెండున్నాయని గాదు పదార్థాలు. ఉన్నదొకే ఒక పదార్థం. అదే ఒక భాగమెప్పుడూ మారకుండా నిత్యంగా నిలిచి ఉంటే మరొక భాగంలో అదే రకరకాలుగా మారుతూ అనిత్యమని పించుకొంటున్నది. సముద్ర దృష్టాంతం విమర్శించి చూస్తే తెలిసిపోతుంది. జల మనేది ఒకే పదార్థం. అదే జలంగా నిశ్చలం. రాకపోకలు లేవు దానికి. అదే తరంగ బుద్బుదాదులగా చూస్తే చంచలం. రాకపోకలక్కడే గదా చూస్తున్నాము మనం. ఇప్పుడీ దృష్టాంతమే ఇంత చిత్రంగా ఉంటే దార్ష్టాంతికమైన ఆ తత్త్వమింకా ఎంత చిత్రాతి చిత్రమో కొంచె మాలోచించండి.

### విశ్వమే వేదగ్ం పురుష - స్తద్విశ్వ ముపజీవతి

ఈ చిత్రంలోనే మరొక చిత్రమేమంటే ఈ విశ్వమంతా ఆ పురుషుడే. పూర్ణత్వమే ఇక్కడ పురుష అనే మాట కర్థం. ప్రపంచమంతా పూర్ణమైన ఆ చైతన్యమే నని గదా చెప్పాము. చైతన్యమే అయి కూడా దానికి భిన్నంగా ఏదో తాను స్వతంత్రంగా తన పాటికి తానున్నట్లు కనిపిస్తూ మరలా దాని నాధారం చేసుకొనే బ్రతుకుతుంటుంది. దానికి వేరుగా ఉన్నప్పుడు తనపాటికి తానే బ్రతకవచ్చు గదా. దానిమీద బ్రతకవలసిన

అగత్యం దేనికి. అయినా అలా బ్రతుకుతున్నదంటే దానికి వేరుగా లేదన్న మాట అప్పటికి. వేరు గాకపోతే దాని నాధారం చేసుకోటమేమిటి. బ్రతకటమేమిటి. అదే చిత్రమైతే దానికన్నా చిత్రమిది. అందుకే చిత్ర విచిత్రమని పేర్కొనటం. మాయ అంటే ఏమిటను కొన్నారు. అఘటన ఘటనా పటీయసీ మాయా. ఏది సంభవం కాదో దాన్ని సంభవం చేసి చూపటమే దాని ఉద్యోగం. లేకుంటే ఆకాశంలో నలుపున్న దనేనా. వట్టి ఖాళీ గదా నల్ల ని రంగెలా వచ్చింది. అసంభవం. అయినా మనకండ్ల కా రంగలా కనిపిస్తున్నదంటే అసంభవమని ఎలా అనగలం. నహి దృష్టే అనుపపన్నం నామ అని భగవత్పాదుల సూక్తి. ఒక ప్రక్క కంటికి కనిపిస్తుంటే ఇది ఎలా చెల్లుతుందనే ప్రశ్నే లేదట. అలాంటిదే ఇప్పుడీ జగద్వ్యవహారం.

## పతిం విశ్వస్యాత్మే శ్వరగ్ం - శాశ్వతం శివ మచ్యుతమ్

అయితే ఒక్క మాట. అదే అది గానూ ఉండవచ్చు. ఇది గానూ భాసించవచ్చు. రెండూ అదే గనుక ఏది పట్టుకొంటే నేమని మాత్రం మనం బోల్తా పడరాదు. ఎందుకంటే ఇది పతిగాదీ విశ్వం. పశువు. పాశానికి కట్టుపడి ఉండేదేదో అది పశువు. జీవజగత్తులు రెండూ అలాంటివే. నామరూప క్రియలే పాశాలు. వాటిచేత కట్టుపడని జీవుడు లేడు. జగత్తు లేదు. పోతే అలా బందీ కాని దొక్క శుద్ధ చైతన్యమే. కారణం. దానికి నామరూపాదుల నిర్బంధం లేదు. నిరాకారం వ్యాపకం.

దానికేమిటి కారణం. అది విశ్వానికంతా ఆత్మ. ఆ తనో తీత్యాత్మా. అంతటా వ్యాపించిందని అర్థం. ఎలా వ్యాపించ గలిగింది. దానికి రెండు లక్షణాలున్నాయి. ఒకటి సత్. రెండు చిత్. సత్తంటే ఉండటం. చిత్తంటే నేనిలా ఉన్నానని గుర్తించటం. ఉన్నాననే స్ఫురణ ఏదుందో అదీ ఆత్మ. ఆ ఉన్నాననే స్ఫురణ ఇప్పుడు మనందరికీ సహజంగానే ఉంది. కాని ఇది ఈ మూడు మూరల జానెడు శరీరానికే పరిమితమయి ఉంది. దీని హద్దులు దాటి నేనున్నానని నీవూ నేనూ అనుకోటం లేదు. శరీరపుటెల్లులు దాటి చూస్తే నాది అంటావే గాని నేనన లేవు. శరీరంలో ఉన్నప్పుడు కూడా శరీరమే నేనని దానితో ఏకమై ఉంటున్నావే గాని దానికి విలక్షణంగా ఉన్నానని భావించ లేవు. ఇదే దేహాత్మ భావం. లేదా జీవ భావ మంటారు.

ఈ భావంతో బ్రతుకు తున్నంత వరకూ నీవూ నేనూ జీవాత్మలమే గాని విశ్వాత్మలం కాము. శరీరం దాటి విశ్వమంతా వ్యాపించినట్టు మన ఉనికిని మనం చూచుకోగలిగి నప్పుడే జీవ భావం పోయి ఈశ్వర భావ మందుకోగలం. అప్పుడు విశ్వాత్ముడూ ఈశ్వరుడూ అవుతాడీ మానవుడు. అయితే ఇక ఈ శరీరానికి కలిగే ఏ ఉపద్రవాలూ వాడినంటవు. జనన మరణాలకు కూడా స్వస్తి చెప్పవచ్చు. అంతవరకూ శరీరంతో తాదాత్మ్య మేర్పడిన నేరానికి దాని ఉపద్రవాలన్నీ మనకే సంప్రాప్తించినట్లు కంగారు పడుతుంటాము. అప్పుడీ పరిమితమైనదే

Yalamanchili Brahmaji Srinivasa Rao www.advaitavedanta.in

నా స్వరూపమని పరిపూర్ణుడైన ఈశ్వరుడెక్కడో దూరంగా ఉన్నాడని కలలు గంటుంటాము. వాడీ ప్రపంచానికంతా అధిపతి అనీ మనబోటి జీవకోటి కంతా ఈశ్వరుడని భావిస్తుంటాము.

అంతేకాదు. జీవులుగా మనమెంతో కాలం బ్రతకం. మన మరణం మనకు కనిపిస్తుంటుంది. ఎప్పటికీ నిలిచి ఉండేది గాదు మన ఉనికి ఈ ప్రపంచంలో. అశాశ్వతం. మరి ఈశ్వరుడో. వాడు సర్వత్రా ఉంటాడు కాబట్టి ఒకానొక దేహంలో బందీకాడు కాబట్టి ఎప్పటికీ ఉండగలడు. అంటే శాశ్వతుడు. శాశ్వతుడు గనుకనే శివం. శవమై పోడు. ఎప్పుడూ బ్రతికి ఉంటాడు. అదే శివమంటే. ఎప్పుడూ నిలిచి ఉంటాడు గనుకనే శివమే గాక అచ్యుతం కూడా ఆ తత్త్వం. చ్యుతి అంటే జారిపడటం. ఒక శరీరంలో వచ్చి పడట మనేది లేదు కాబట్టి చ్యుతుడు కాడు. అచ్యుతుడా ఈశ్వరుడు. పోతే చ్యుతి పొందేవాడీ జీవుడే. చ్యుతుడు కనుకనే శివ స్వరూపుడు కాడు. ఎప్పుడో ఒకప్పుడీ శరీరంతో పాటు తానూ శవమై పోతాడు. అలా పోయేటప్పుడు ఈశ్వరుడిలాగా శాశ్వతుడెలా అవుతాడు. అశాశ్వతుడే. ఈ అనర్థాని కంతటికీ మూలకారణం వీడు వాడిలాగా విశ్వమంతా వ్యాపించిన ఆత్మ కాకపోవటమే.

అయితే రెండున్నాయా ఆత్మలని మరలా కంగారు పడతారేమో. రెండు లేవు వాస్తవంలో. వస్తుతః ఉన్నదొకే ఆత్మ. అది విశ్వాత్మే. జీవాత్మ

అనేది లేదసలు. ఉందనుకొంటే అది కేవల మాభాసే. కారణ మేమంటే అది కేవలం నిమిత్త కారణమే కాక ఉపాదానం కూడా. నిమిత్తం మాత్రమే అయితే కుమ్మరి లాగా దూరమైపోయే వాడీ ప్రపంచానికి. అలాకాక మృత్తికలాగా ఉపాదానం కూడా పరమాత్మే నన్నారు కాబట్టి ప్రపంచమంతా వ్యాపించి ఉండాలి. అలా వ్యాపిస్తే ఇక జీవుడెక్కడున్నాడు. శరీరాలెక్కడున్నాయి. అది కూడా ఆత్మ స్వరూపమే గదా. అలాంటప్పుడది విశ్వాత్మ శాశ్వతం – ఇది జీవాత్మ అశాశ్వతమని తేడా ఎందుకు వచ్చింది. తేడా వస్తుతంత్రం కాదు. మానవుడి బుద్ధి తంత్రం. అది ఉపాదానం కూడా ననుకో లేకపోవటం వల్లనే మనకు దూరమయినట్టు భావిస్తున్నాము. దాని ఆభాస అయిన ఈ శరీరాన్ని నమ్ముకొని ఇదే ఆత్మ మిగతాదంతా అనాత్మ అని హద్దు లేర్పరుచుకొని కష్ట సుఖాలన్నీ మన కాపాదించుకొని జనన మరణాది అనర్థాలన్నీ అనుభవిస్తున్నాము. ఇదీ జరిగిన ప్రమాదం.

అంచేత మన బుద్ధుల ననుసరించి చెప్పవలసి వచ్చింది శాస్త్రం అది విశ్వాత్మ అని – విశ్వం కన్నా పరమమైనదని – దాని మీద ఈ విశ్వమంతా ఆధారపడి బ్రతుకుతున్నదనీ. అంతేగాక అది శాశ్వతమూ శివమూ అచ్యుతమైతే – ఈ పిండ శరీరమే నా స్వరూపమే నని అభిమానించే వీడొక జీవుడని – వీడు మాత్రం అశాశ్వతుడూ చ్యుతుడూ

అశివుడూ నని. ఇలా మన అవిద్యా దృష్టి ననుసరించి చెప్పిన మాటే గాని ఇది - వస్తుస్థితిని బట్టి పేర్కొన్న మాట కాదు.

అయితే మనమిప్పుడేమి చేయాలంటారు. ఏమి చేయాలనే ప్రశ్నేముంది. నేను జీవుడననే భ్రాంతి పోగొట్టుకోటమే మన కర్తవ్యం. అంతకన్నా ఏమీ లేదు. ఎలా పోగొట్టుకోవా లద్దెనా. **నారాయణం మహాజ్ఞేయం విశ్వాత్మానం పరాయణమ్.** ఒకటి పోగొట్టు కొనే ముందు మరొకటి పట్టుకోవాలి. అది పట్టుకోకుండా ఇది పోగొట్టుకోలేము. ఏమిటా పట్టుకోవలసింది - ఎలా పట్టుకోటమంటే వర్ణిస్తున్నాడు. మహా జ్ఞేయమని. జ్ఞేయమంటే తెలుసుకోవలసింది. మనకు జ్ఞానముంది. దాని బలంతో ఎన్నో విషయాలు తెలుసుకొంటూ ఉంటాము లోకంలో. లోకంలో నేమి శాస్త్రంలోనేమి. కళలోనేమి. అన్నీ మనకు జ్ఞేయాలే. కాని వీటన్నిటినీ మనం మన దేహాత్మ భావాన్ని వదలకుండానే మనకు జ్ఞేయమని చూస్తుంటాము. మనమిక్కడి వరకే జ్ఞాన మనుకొంటే అది మనకు బాహ్యంగా జ్ఞేయమై కనిపిస్తుంటుంది. మనమీ శరీరానికి పరిమితమై చూస్తాము ప్రతి ఒక్కటీ. కనుక అది కూడా పరిమితమై ఆమేరకే కనిపిస్తుంది. కాబట్టి అది మహాజ్ఞేయం కాదు. అల్పమైన జ్ఞేయం.

మహచ్చ తద్జ్ఞేయంచ మహాజ్ఞేయం. అన్నిటికన్నా పెద్దదైన జ్ఞేయమేదో అది మహాజ్ఞేయం. ఏదది. ఆకాశం. ఆకాశం అన్నిటి కన్నా

Vallamraju Brahmasri Srinivasa Rao www.advaitavedanta.in

పెద్దది. మన జ్ఞానానికి గోచరిస్తున్నది. కనుక అది మహాజ్ఞేయమే. కాని దానికి ఆత్మ లేదు. అంటే తానున్నాననే జ్ఞానం లేదు దానికి. నేననే జ్ఞానం నాకూ నీకూ ఉన్నది. కాని మహత్తు కాదది. అప్పటికి మహత్తైన ఆకాశానికి జ్ఞానం లేదు. జ్ఞానమున్న నాకు మహత్త్వం లేదు. నేనే నా జ్ఞానాన్ని సర్వత్రా వ్యాపింప జేసుకొన్నా ననుకో. అప్పుడది శరీరంలోనే ఉండటానికి లేదు. శరీరంలో ఎంత ఉందో దాని వెలపలా కూడా ఎక్కడ బడితే అక్కడ ఉండగలదు. అప్పుడది విశ్వాత్మ. విశ్వమంతా వ్యాపించిన ఆత్మ. దానికిక శరీర సంబంధమైన జననమరణా ద్యనర్థాలుండవు. పరాయణ మవుతుంది. అయన మంటే దాటిపోవటం. పరాయణ మంటే అన్ని హద్దులూ దాటిపోతుంది. దేశకాల వస్తువులనే హద్దులు దాటిందంటే నరుడు గాదది నారాయణ. జీవ జగత్తులు రెండింటికీ ఆశ్రయం. అలాంటి తత్త్వమే మనకు మహాజ్ఞేయం. అంటే అర్థం చేసుకొని అందుకోవలసిన గొప్ప జ్ఞేయ పదార్థం. జ్ఞానం గదా. అది జ్ఞేయమెలా అవుతుందని అడగవచ్చు. జ్ఞేయం గాని జ్ఞానం. జ్ఞానమే ఇప్పట్లో మన అల్ప జ్ఞానాని కంతు పట్టటం లేదు కాబట్టి మనకు జ్ఞేయంగా భాసిస్తున్నది. మనది అల్పం గనుక అది మహత్తుగా అనిపిస్తున్నది. మన జ్ఞానమే అంతకంతకు శరీరం దాటి విస్తరించే కొద్దీ అఖండమైన ఆ జ్ఞానమే మన జ్ఞానమని అవగాహన వస్తుంది. కాబట్టి అంతవరకూ తాత్కాలికంగా మనకు జ్ఞేయమే. ఆ తరువాత మన

ప్రయాణం పూర్తి అయ్యేసరి కదే జ్ఞేయంగా గాక జ్ఞానంగానే మనకు సాక్షాత్కరిస్తుంది. ఇదీ ఇందులో ఉన్న సూక్ష్మం.

**నారాయణ పరోజ్యోతి - రాత్మా నారాయణః పరః**

**నారాయణ పరం బ్రహ్మ తత్త్వం నారాయణః పరః**

**నారాయణ పరోధ్యాతా - ధ్యానం నారాయణః పరః -**

ఈ భావాన్నే ఎంతో అద్భుతంగా వివరిస్తున్నారు వినండి. ఉన్నదంతా ఒకే ఒక పదార్థం. జీవుడు లేడు. జగత్తు లేదు. ఆ మాటకు వస్తే ఈశ్వరుడూ లేడు. అవన్నీ పరస్పర సాపేక్షమైన భావాలు. జగత్తుంటే జీవుడు. జీవుడుంటే ఈశ్వరుడు. జగత్తే లేదో - మొదటికే మోసం. అప్పుడీ జీవుడూ లేడా ఈశ్వరుడూ లేడు. అయితే జగత్తు లేదని ఎలా చెప్పగలవు. నారాయణ పరోజ్యోతిః - నారాయణ తత్త్వ మొక్కటే పరమమైన జ్యోతి. ప్రకాశం. పరిపూర్ణమైన చైతన్యమది. చైతన్యం గనుక స్వతః ప్రకాశం. జగత్తు స్వయం ప్రకాశం కాదు. తానున్నట్టు తనకు స్ఫురించదు. అయినా స్ఫురిస్తున్నదంటే ఆ స్ఫురణ దానిది గాదు. పరిపూర్ణమైన నారాయణుడి తాలూకు స్ఫురణ. ఆ స్ఫురణలో మనకిది కూడా స్ఫురిస్తున్నది. స్ఫురించే పదార్థమిది. స్ఫురణ కాదు. స్ఫురణ లేకుండా స్ఫురించే పదార్థమేదైనా ఎలా స్ఫురించగలదు. అన్వయ వ్యతిరేక న్యాయాన్ని బట్టి అప్పటికి స్ఫురణే నిజానికున్న పదార్థం.

స్ఫురించేది గాదు. ఆ స్ఫురణ నారాయణ. కారణమది ఆత్మ. నేనని అనుకోగలదు. దానికదే ప్రమాణం. వేరే ప్రమాణ మక్కర లేదు. నీవూ నేనూ ఉన్నాననే అనుకొంటున్నాము. కాని పరం కాదిది అపరం. అంటే పరిపూర్ణత లేదు మనస్ఫురణకు. కనుక జగత్తులాగా జీవుడు కూడా నరుడే కాని నారాయణుడు కాడు. మరి ఈశ్వరుడో. వాడూ తాను పరిపూర్ణ స్ఫురణే నా స్వరూప మనుకొంటే నారాయణుడే. అనుకోలేకపోతే నరుడే. మహా అయితే పెద్ద నరుడు వైశ్వానరుడు. మనబోటి నరుల జ్ఞానానికి గోచరిస్తే అది కూడా కాదు. జగత్తే. ఏతా వతా స్ఫురణకు గోచరిస్తే అది జగత్తు. స్ఫురణ అయి కూడా అది పరిపూర్ణం కాకుంటే జీవుడు. స్ఫురణ అయి అది పరిపూర్ణమై అది అనాత్మకు భిన్నంగాక ఆత్మే అయితే అప్పుడది నారాయణ శబ్ద వాచ్యమవుతుంది.

నారాయణ పరం బ్రహ్మ. అలాటి ఆత్మనే బ్రహ్మమని కూడా పేర్కొన్నారు. బ్రహ్మ మన్నా ఆత్మ అన్నా ఒకటే. ఒకదాని కొకటి పర్యాయాలు. ఆత్మే పరిపూర్ణమైతే బ్రహ్మం - బ్రహ్మమే నేనని భావిస్తే అది ఆత్మ. రెండూ కలిపి చెబితే పరిపూర్ణమైన నేననే స్ఫురణే బ్రహ్మం. అదే అసలైన ఆత్మ కూడా. తత్త్వం నారాయణః పరః - మన మందుకోవలసిన పరతత్త్వం కూడా అదే. తత్త్వమంటే తస్య భావ స్తత్త్వం. ఏది ఉన్నదో అది. జీవ జగదీశ్వరు లిప్పుడున్నట్టే కనిపిస్తారు.

కాని ఎప్పుడూ నిలిచి ఉండరు. కారణమవి విశేష రూపాలు. విశేషాలన్నీ ఎప్పటికప్పుడు మారి పోతుంటాయి. అదే సామాన్య స్వరూపమైతే మారే ప్రసక్తి లేదు. ఇవి అపరమైతే అది పరమందుకే అయింది. పరతత్త్వమది. దాన్నే మనం నారాయణ తత్త్వ మంటున్నాము.

నారాయణ పరోధ్యాతా - ధ్యానం నారాయణః పరః - ఇంతెందుకు. అది సామాన్యమూ సర్వ వ్యాపకమూ ఎప్పుడయిందో అందులో మరలా ధ్యాతా ధ్యానం ధ్యేయ మనే త్రిపుటి కవకాశం లేదు. ధ్యాత అయినా అదే. ధ్యేయమైనా అదే. ధ్యానమైనా అదే. మూడూ నారాయణ స్వరూపమే. అంటే ఏమన్న మాట. అదే ధ్యాత అయి తననే తాను ధ్యేయంగా భావించి తానే తన్ను ధ్యానిస్తున్న దన్న మాట. ఏమిటీ మాట. ఎలా అర్థం చేసుకోవాలి దీన్ని. చెబుతా వినండి. ధ్యాతృ ధ్యాన ధ్యేయాలనేవి లేవసలు వాస్తవానికి. వస్తుతః ఉన్నదొక అఖండ చైతన్య స్వరూపమైన నారాయణ తత్త్వమే. అదే నేను ధ్యానం చేస్తున్నానుకొంటే ధ్యాత. ఫలాని దాన్ని ధ్యానిస్తున్నానని భావిస్తే అది ధ్యేయం. ఈ పని చేస్తూ దానినందు కొంటున్నానని భావిస్తే అది ధ్యానం. అంతా అబద్ధమే. ఎందుకని. అంతా ఒకే చైతన్య మన్నప్పుడిక ఈ ఫలానా అనే మూడు భావాలెక్కడివి. లేవు వాస్తవంలో. లేకున్నా ఉన్నట్టు కనిపిస్తున్నాయంటే అదే ఆభాస. వస్తువే అనేక రూపాలలో కనిపించటమే ఆ భాస అంటే. ఎందుకు

కనిపిస్తున్నదలా. దానికి లేదా దృష్టి. దానికే అది సహజంగా ఉంటే ఎప్పుడూ అలాగే కనిపిస్తుండాలి. మారకూడదు. మాసిపోగూడదు. అజ్ఞాని దృష్టికి మారుతుంటుంది. జ్ఞాని దృష్టికి మాసిపోతుంటుంది. కాబట్టి అజ్ఞానం వదలకుండా చూస్తున్నంత సేపూ ఒక స్వప్నంలాగా ఉన్నట్టు భాసిస్తుందీ త్రిపుటి. అంతకంతకు జ్ఞానోదయమై అంతా నారాయణ స్వరూపమే గదా అని అద్వైత దృష్టితో చూచామంటే ఆభాస తేలిపోయి అది కేవల మేకైకమైన వస్తువుగానే అనుభవానికి వస్తుంది. ఇదీ రహస్యం.

ఇందులో దాగి ఉన్న ఉపపత్తి ఏమిటో ఇప్పుడీ మంత్రం మనకు బాగా వివరించి చెబుతున్నది. ఆలకించండి.

**యచ్చ కించి జ్జగ త్సర్వం - దృశ్యతే శ్రూయతేపివా -**

**అంతర్బహిశ్చ తత్సర్వం వ్యాప్య నారాయణః స్థితః -**

జగత్తు జగత్తని ఏది మనం నిత్యమూ చూస్తున్నామో ఏదైతే వింటున్నామో ఈ కనే ప్రపంచం ఆ వినే ప్రపంచం – అంటే ఇహపరాలు రెండూ కూడా వ్యాపించి ఉన్నదా నారాయణ స్వరూపమే. నారాయణుడేమిటి. అది దీనినంతటి నీ వ్యాపించటమేమిటి. ఎలా వ్యాపించాడంటారు. అంతర్బహిశ్చ. లోపలా వెలపలా కూడా ఉన్నదదే.

సర్వమంటున్నాడు పైగా. లోపలా వెలపలే గాక దాని ప్రతి అణువూ అదే వ్యాపించి ఉంది. ఒక్క పిసరు కూడా ఖాళీ లేదు. చరా చర పదార్ధాలలో ఏ ఒక్కటి చూచినా అదే. ఏదీ మాకెక్కడా కనపడలేదే ఆ నారాయణుడీ పదార్ధాలలో, నారాయణుడంటే ఒక దేవతా మూర్తి ఒక వ్యక్తి అనుకొంటున్నారా. అది పొరబాటు. నామరూపాత్మకం కాదది. నరుల కన్నిటికీ ఆయన మని గదా చెప్పాము. నరులంటే జీవజగత్తులని కూడా చెప్పాము. జీవజగత్తులుగా విభక్తమై కనిపించే ఈ చరా చర సృష్టి అంతా విశేషాత్మకం. ఎక్కడికక్కడ విచ్ఛిన్నమయి పోతుంటుంది. ఇది అది గాదు అది ఇది గాదు అనిపించుకోటమే విచ్ఛేదం. అదే విశేషమంటే. అలా విశేషాత్మకంగా ఇవి కనిపిస్తుంటే నిర్విశేషంగా సామాన్య రూపంగా వీటి నన్నిటినీ వ్యాపించి ఒకటున్నది. అదే సామాన్యం. సమానంగా విశేషాలన్నింటినీ వ్యాపించిందేదో అది సామాన్యం. ఒక సువర్ణమూ ఆభరణాలను తీసుకొని చూస్తే తెలిసిపోతుంది.

అలాగే ప్రస్తుత మీ చేతనా చేతన ప్రపంచాన్నంతా వ్యాపించి ఒకే ఒకటుంది. దానికే మహా సామాన్యమని పేరు పెట్టింది బృహదారణ్యకం. ఏమిటది ఎలా ఉంటుంది. సత్ చిత్. ఉంది ఉన్నట్టు స్ఫురిస్తుంది. ఉండటమనే స్ఫురణ అనుకోండి. అదీ అది. చూడండి. మీరీ ప్రపంచంలో ఏదైనా తీసుకొని చూడండి. అణువు మొదలు ఆకాశం దాకా ఏది

చూచినా అదంతా ఉందంటావు. స్ఫురిస్తున్న దంటావు. అంతేనా. అంతకన్నా ఏమైనా ఉందా. ఈ ఉండటమనే స్ఫురణ లేదా స్ఫురిస్తూ ఉండటమనే లక్షణం లేని పదార్థమేదైనా ఉందేమో నీవే చెప్పు. ఇదుగో ఈ సదాత్మకమైన స్ఫూర్తికే నారాయణుడని నామాంతరం. ఇలా అర్థం చేసుకొంటే చాలు. ఇక నారాయణ స్వరూపానికి భిన్నంగా ఇహ పరాలలో ఏ ఒక్క భావమూ లేదని నీకిట్టే తెలిసి పోతుంది. లేకుంటే మరి ఈ పదార్థాలు కనిపిస్తున్నాయే అవి ఎలా కనిపిస్తున్నాయంటారు. ఆ కనిపించటమవి గావు. ఆ సచ్చిదాత్మకమైన నారాయణ తత్త్వమే ఇలా ఇన్ని రూపాలుగా దర్శనమిస్తున్నది. అది దాని స్వరూపమైతే Substance ఇదంతా దాని విభూతి Expansion formation. అదే ఈ రూపంలో కనిపిస్తున్నది గనుక అప్పటికంతా అదే. ఇక జీవ జగత్తులంటూ దానికి వేరుగా లేవు. లేకుంటే ఒక జీవుడనీ శరీరమనీ ఇందులో మనం బందీ అయ్యామనీ మనకు జనన మరణాలు తప్ప వనీ ఇలాటి ప్రసక్తే లేదు. అంతా అబద్ధమయి పోతుంది.

వస్తుసిద్ధంగా ఏదీ దానికన్యంగా లేకపోయినా ఉన్నట్టు మన అనుభవానికి వస్తున్నాయీ భావాలన్నీ. ఇది మనం భావిస్తే వస్తున్నాయే గాని లేకుంటే ఏదీ లేదు. అంతా హుళక్కే. మనం భావించక పోయినా వాటి పాటికవి ఉండవచ్చు గదా లేవని ఎలా చెప్పగలమని ప్రశ్న వస్తుంది. దానికి జవాబేమిచ్చారంటే ఏదైనా ఒకటి ఉందన్నావంటే ఆ ఉనికి

జడం. ఆ ఉన్నదీ జడం. జడం తానున్నట్టు తనకు తెలియదు. దాని అస్తిత్వానికి ఒక ప్రమాణం కావాలి. ప్రమాణ మెప్పుడూ జ్ఞానమే. జ్ఞేయం కాదు. జ్ఞేయం ప్రమేయం. అంటే ప్రమాణానికి గోచరించ వలసిన పదార్థం. అలా గోచరించకపోతే అది అప్రమాణ మవుతుంది. అప్రమాణ మైనదెలా ఉందని చెప్పగలవు. జ్ఞానంతోనే గదా చెప్పవలసింది. ఆ జ్ఞానం దానికైనా ఉండాలి నీకైనా ఉండాలి. దానికే ఉంటే నీకెలా గోచరించిందది. నీకు గోచరించిందంటే అప్పటికా జ్ఞానం నీదే. కాబట్టి జ్ఞానమే ప్రమాణం. అది పరిమితమైతే అన్నీ చూడలేదు చెప్పలేదు. అదే ఇప్పుడు మన జీవ భావం. అలా కాక సమస్త సృష్టీ ఇహపరాలతో కలుపుకొని సర్వమూ ఉందని చూడాలంటే సర్వాన్నీ వ్యాపించిన జ్ఞానమయి ఉండాలి. అదే నారాయణ స్వరూపం. నారాయణుడంటే పరిపూర్ణమైన సామాన్య రూపమైన చైతన్యమని అర్థం చేసుకోవాలి. అంతేగాని ఏ వైకుంఠంలోనో నామాలు పెట్టుకొని కూచున్న ఒక పెరుమాళ్లను కొంటే మాత్రం కుదరదు. ఇదే వాసుదేవ స్సర్వమితి అనే గీతా వాక్యానికి కూడా చెప్పుకోవలసిన అర్థం.

### అనంత మవ్యయం కవిగ్ం - సముద్రేంతం విశ్వశంభువమ్

ఎప్పుడైతే అది సర్వవ్యాపకమూ సర్వాత్మకమూ అని నిర్ధారణ అయిందో అప్పుడది సాంతం కాదు. అనంతం. అంతం లేనిదేదో అది అనంతం. అంతమంటే విజాతీయమైన పదార్థం. ఒకదానికి

Vallamraju Brahmasri Srinivasa Rao www.advaitavedanta.in

విజాతీయమేదైనా ఏర్పడితే అక్కడికది ఆగిపోతుంది. అలా ఆగటమే దాని అంతం. లోకంలో ప్రతి ఒక్కటీ విశేషమని గదా పేర్కొన్నాము. విశేషం గనుకనే దానికి భిన్నమైన మరి ఒక విశేషం దగ్గర అది ఆగిపోతుంది. పృధివి ఒక విశేషం. అది జలం దగ్గర అంతమయింది. జలం విశేషం. అది తేజస్సు దగ్గర నిలిచిపోయింది. అప్పటికన్నీ అంతమయ్యేవే. కాని వాటన్నిటిలో సమానంగా పరచుకొని ఉన్న ఈ సత్తా స్ఫూర్తులు మాత్రమలా తెగిపోవు. అన్నిటిలో సాగిపోతుంటాయి. సాగిపోతే ఇవి వాటికంతం గదా అని అడగవచ్చు. ఇవన్నీ మరలా దాని విభూతీ విస్తారమే కాబట్టి అంతమనే ప్రశ్న లేదు. అదే ఇది అని నిరూపించాము. కాబట్టి దానికది అంతమెలా కాగలదు. కనుక ఏకైకమైన ఆ నారాయణ తత్త్వ మెప్పుడూ అనంతమే. జనన మరణాది ప్రసక్తి లేదు దానికి. జనన మరణాలంటే అవీ ఒక విశేషమే వికారమే. వాటిని కూడా వ్యాపించి తన స్వరూపంగా దర్శిస్తున్నదది. కనుకనే అవ్యయం. జనన మరణాలుగా ఖర్చయి పోదు. మారిపోదు. పోదంటే ఇప్పుడీ మాట ఆకాశానికి కూడా వర్తిస్తుంది గదా అని శంకించవచ్చు ఈనాటి భౌతిక శాస్త్రజ్ఞుడు. ఆకాశం ప్రమేయమే గాని ప్రమాణం కాదు. కారణం దానికి జ్ఞానం లేదు. అది ఉన్నదీ కనిపిస్తున్నదని చెప్పేది సామాన్య రూపమైన చైతన్యమే. అదే దీనికి ప్రమాణం. మరి దానికో. దానికేమిటి ప్రమాణం. అక్కర లేదు జ్ఞాన స్వరూపమే కాబట్టి దానికదే ప్రమాణం. దీన్నే స్వతః ప్రమాణ మంటారు. కవి మ్మనే మాట అందుకే వచ్చింది.

దర్శనా ద్వర్ణనాత్కవిః అన్నారు. దర్శించే స్వభావం దానికే ఉంది. తాను దర్శిస్తున్న ఈ చరా చరాలన్నీ ఉన్నాయని వర్ణించి చెబుతున్నది కూడా అదే. కనుక అది కవి. ఆ కవి రచించిన మహాకావ్య మీ ప్రపంచం. దీన్ని చదివి దీనిలోని ఆంతర్యం గ్రహించటానికి జీవరూపంగా దిగి వచ్చి ఈ శరీరంలో కూచున్న పరిమిత స్వరూపుడైన కవి కూడా ఆ మహాకవే. ఇదీ విషయం.

**సముద్రే అంతం విశ్వ శంభువమ్ -** కవే గాక అంతం కూడా అది. అంతం లేదు అనంతమన్నారు గదా. నిజమే దాని కంతం లేదు. మిగతా వాటన్నిటికీ అది అంతం. దేనికంతం లేదో అది తతిమా వాటికంత మవుతుంది. అవి ఈ చరాచర పదార్థాలే. వాటన్నిటినీ వ్యాపించి ఉంది కాబట్టి ఇవన్నీ దాని పరిధిలో చేరిపోతాయి. చేరిపోతే ఇది వాటికి వెలపల ఉండాలి కాబట్టి వాటికంతం లేదా హద్దు అవుతుంది. ఆ హద్దు దాటి మరేదీ లేదు కాబట్టి వీటికంత మయితాను అనంత మవుతుంది. అయితే ఇవి కూడా తన స్వరూపమే అన్నారు గదా వీటికది హద్దు కావటమేమిటి. ఇవి సాంతమయి అది అనంతం కావటమేమిటని ప్రశ్న. నిజమే. దానికి వేరుగా ఏదీ లేదు వాస్తవంలో. కాని ఏదో ఉందని ఊహించుకొంటున్నాడీ జీవుడు. ఇది ఈ జీవుడి భావనే. వాస్తవం కాదు. మరలా ఈ జీవుడెక్కడి నుంచి వచ్చాడని అడుగుతారేమో. నేను పరిచ్ఛిన్నమైన జ్ఞానమనుకొంటే జీవుడు. అలా అనుకోకపోతే నరుడు

కాదు వీడు నారాయణుడేనని చెప్పాము. అంతవరకూ తాత్కాలికంగా ఒక జీవుడున్నాడని ఒప్పుకోవలసి వస్తున్నది. అలా ఎప్పుడొప్పుకొన్నామో అప్పుడీ జీవుడికీ సంసార బాధలు తప్పవు. సంసారమే ఒక సముద్రం. సముద్రే అంతం. ఈ సముద్రంలో మునుగుతూ తేలుతూ ఉన్నంత వరకూ దీని అంతమైన ఆ నారాయణ స్వరూపం మనకంతు పట్టదు. పట్టనంత వరకూ విశ్వ శంభువం - విశ్వానికంతా శం అంటే సుఖశాంతులు లభించే ప్రసక్తి లేదు. విశ్వమంటే ఇక్కడ విశ్వుడైన జీవుడనీ అర్థమే. విశ్వమైన ప్రపంచమనీ అర్థమే. ప్రపంచానికీ లేదు శాంతి జీవుడికీ లేదు.

Yallamraju Srinivasa Rao
Brahmasri
www.advaitavedanta.in

# - ఉత్తరార్ధము -

ఇక్కడికి మంత్ర పుష్పంలో పూర్వభాగం సమాప్తమయింది. ఇక ఉత్తర భాగం ప్రారంభమవుతుంది. ఇంతకు ముందే చెప్పామొక మాట పురుష సూక్త మవరోహణ మార్గంలో నడిస్తే మంత్ర పుష్ప మారోహణ క్రమంలో నడుస్తుందని. ఆరోహణ మంటే మన దగ్గరి నుంచి గమ్యం వైపు చేసే ప్రయాణం. గమ్యమేమిటి జీవితానికి. ఏకాత్మ భావం. జీవ జగదీశ్వరులనే తేడా లేకుండా ఉన్నదంతా ఆత్మ స్వరూపమేననే జ్ఞానం. అది ఇప్పుడు లేదు మనకు. వస్తుతంత్రంగా ఉన్నా బుద్ధి తంత్రం కావటం లేదు. బుద్ధి తంత్రం కానంత వరకూ మోక్షం లేదు. అంచేత ఆ ఏకాత్మ భావాన్ని గమ్యంగా పెట్టుకొని దాని కభిముఖంగా మన బుద్ధి ప్రయాణం చేయవలసి ఉంది.

కాని అలా చేయాలంటే ఊరక గుడ్డెద్దు చేలో పడ్డ సామెతగా చేస్తూ పోయామంటే సుఖం లేదు. ఎన్నటికీ చేరలేమా గమ్యం. గమ్య మగమ్య మవుతుంది. గమ్యమనే దేమిటో అది ఎలా ఉంటుందో ముందు మన అవగాహనకు రావాలి. అలా వచ్చినప్పుడే దాని ఆలోచన లేదా దాని వృత్తి మన మనసు కేర్పడుతుంది. ఏర్పడితే దాని నాలంబనం చేసుకొని మన బుద్ధి దాని ననుసరించి గమ్యం వైపు సాగిపోగలదు. ఏదైనా అంతే. ప్రమాణం ద్వారానే ప్రమేయాన్ని అందుకోవాలి. బుద్ధిశ్చనః ప్రమాణం సదసతో ర్యాథాత్మ్యాధిగమే అన్నారు భగవత్పాదులు. ఒకటి

ఉందో లేదో సంభవమో అసంభవమో నిర్ణయించ వలసింది మొదట మానవుడి బుద్ధే. అది ఉందని నిర్ధారణ చేస్తే తరువాత తదాకారమైన ఆలోచనతో దాన్ని పట్టుకొని ఉంటుంది బుద్ధి. ఘటమనే ఆలోచనతోనే గదా ఘటమొకటి ఉందని దాన్ని గ్రహిస్తున్నాము. ఇది సుఖమనే జ్ఞానంతోనే గదా సుఖాన్ని అనుభవిస్తున్నాము. జ్ఞానమే లేకపోతే ఇది ఘటమని ఇది సుఖమనీ నీ అనుభవాని కెలా వచ్చింది.

అలాగే ప్రస్తుత మిది అఖండమైన ఆత్మ స్వరూపమిది తప్ప మరేమీ లేదనే భావం నీకెలా కలిగింది. దానికి సంబంధించిన ప్రమాణం నీ మనసులో ఏర్పడితే గదా. అది ఎలా ఏర్పడుతుంది. ఆత్మ స్వరూపమనేది ఏమిటో అది ఎలా ఉంటుందో వర్ణించినప్పుడు. అందుకే పూర్వార్ధమంతా దాన్ని చిలువలు పలువలు పెట్టి వర్ణిస్తూ వచ్చింది. సహస్ర శీర్షమని ప్రారంభించి సముద్రేంతం వరకూ దాని వర్ణనే. అది కూడా కేవలం నిర్గుణంగా గాక సగుణ నిర్గుణ రూపంగా సాగింది వర్ణన. అలాంటప్పుడే దాని స్వరూపమూ విభూతీ రెండూ మనసుకు వస్తాయి. లేకుంటే కేవలం నిరాకారమైన జ్ఞానమే నేమో అది సాకారమైన మన చుట్టూ కనిపించే ఈ ప్రపంచం కాదేమో ననే భ్రాంతికి లోనవుతాము. అలాకాక సాకారమేమిటి నిరాకారమేమిటి రెండూ అదే ననేసరికి మనమూ మనం చూచేదీ అంతా మన స్వరూపమే ననే అఖండా ద్వైతాత్మ స్వరూపాన్ని పట్టుకోగలం. అదే బయట పెట్టింది పూర్వభాగం.

ఇప్పుడిలాంటి ఆత్మ స్వరూపాన్ని మనమెలా దర్శించాలో దర్శించే విధానమేమిటో అంచెల వారీగా వర్ణిస్తూ పోతుంది ఇక ఉత్తరార్థం. దాని బలంతో మన కిప్పుడున్న పరిచ్ఛిన్నాత్మ భావం వదిలేసి పరిపూర్ణమైన మన ఆత్మ స్వరూప మిది గదా అని క్రమంగా మన మనుభవానికి తెచ్చుకోగలం. క్రమమనే మాట గుర్తుంచుకోండి. ఒక మహాసౌధం నిర్మించాలంటే పునాదుల దగ్గరి నుంచి ప్రారంభించాలి. అలాగే ఇక్కడా అఖండాత్మ మహాప్రాసాదంలో మనం ప్రవేశించాలంటే దీనికే పునాదులు తీయాలి. ఎక్కడి నుంచి. మన శరీరం దగ్గరి నుంచి. శరీరంలో హృదయం హృదయంలో బుద్ధి బుద్ధిలో వృత్తులూ ఆ వృత్తులలో ఒకానొక వృత్తి ఆత్మాకార వృత్తి. తద్వారా పట్టుకోవలసి ఉంటుంది ఆత్మ స్వరూపం. ఇదీ వరస. ఇందులో హృదయం దగ్గరి నుంచి వర్ణిస్తూ పోతుంది మంత్ర పుష్పం. ఇక్కడ ఒక రహస్యం గుర్తుంచుకోవాలి మనం. హృదయమనగానే అది శరీరంలో ఎడమ వైపున్న గుండె అని మాత్రమే అర్థం చేసుకోరాదు. హృదయమంటే Heart గుండెకాయే సందేహం లేదు. కాని అది వాచ్యార్థం. లక్ష్యార్థ మది కాదు. బుద్ధి. అయితే బుద్ధి అనే చెప్పవచ్చు గదా హృదయమని పేర్కొనటం దేనికి. హృదయం అన్ని నాడులకూ స్థానం. శతం చైకా హృదయస్య నాడ్యః అని ఉపనిషత్తు. ఎన్నో నాడులక్కడి నుండి బయలుదేరుతాయి. అందులో ఒకటి మూర్ధాన మభి నిస్సృతా. కపాలం వైపు సాగిపోతున్నది. తద్వారా రక్తం మెదడుకు సరఫరా అయితే బుద్ధి ఆలోచనా రూపంగా స్పందిస్తుంటుంది. లేకుంటే ఆలోచన లేక అది మొద్దుబారుతుంది. అంతేకాదు. శరీరమే నిలవదు.

అంచేత మనసుకూ హృదయానికీ ఉండే ఈ ఆంతరంగికమైన సంబంధాన్ని చూచి మన ప్రాచీనులు రెంటినీ ఏకం చేసి వర్ణిస్తుంటారు. హృదయ పుండరీక మనీ బుద్ధి గుహా అనీ అన్నారంటే రెండూ ఒకటే. మంచాః క్రోశంతి అన్నట్టు హృదయమని ఎక్కడ వచ్చినా అది బుద్ధికి ఉపలక్షణంగా Indicative భావించాలి మనం. ఇప్పుడు విందామిక మంత్రమేమి చెబుతుందో.

**పద్మకోశ ప్రతీకాశం - హృదయం చాప్యధోముఖమ్**

**అధో నిష్ట్యా వితస్త్యాంతే - నాభ్యాము పరితిష్ఠతి**

**జ్వాల మాలా కులం భాతి - విశ్వ స్యాయతనం మహాత్**

**సంతతగ్ం సిరాభిస్తు - లంబత్యా కోశ సన్నిభమ్**

మొదట భౌతికమైన హృదయాన్నే వర్ణిస్తున్నది. ఎలా ఉందది. ఎక్కడ ఉంది. మన శరీరంలోనే కంఠానికి దిగువ ఎడమ వైపుందని చెబుతారు శాస్త్రజ్ఞులు. ఎలా ఉంటుందది. అధో ముఖం. అధోముఖంగా కనిపిస్తుంది. మరి దానికి పోలిక కూడా చెబుతున్నది. పద్మకోశ ప్రతీకాశమని. పద్మకోశమంటే తామర మొగ్గ. దానిలాగా ఉందట మన శరీరంలో హృదయం. మొగ్గలాగా ఇది కూడా అగ్రం క్రిందికి తిరిగి కనిపిస్తుంది. ఎక్కడ ఉంటుందో శరీరంలో దాని స్థానం కచ్చితంగా నిరూపిస్తున్నాడు. అధో నిష్ట్యా - నాభ్యాముపరి. మన మెడ క్రింద ఒక గుంత కనిపిస్తుంది చేతితో తడవి చూస్తే. దానికి నిష్టి అని పేరు.

దానికి క్రింది భాగ మధో నిష్టి. అలాగే నాభ్యాముపరి. మన నాభి మండల ముందే దానికి పయి భాగం. వితస్త్యంతే. వితస్తి అంటే జాన. అంటే ఏమని అర్థం. నిష్టికి జానెడు క్రింద - నాభికి జానెడు పైన కొలిచి చూస్తే ఆ మధ్యలో ఉంది హృదయం. అంత మంటే ప్రదేశం. రెండింటి మధ్య ప్రదేశమన్న మాట. అదీ హృదయ స్థానం. అక్కడ తిష్ఠతి ఉన్నదట.

ఉన్నది నిజమే. దాని స్వరూపమేమిటి. కేవలం మాంస పిండమేనా అది. కాదు విశ్వస్య ఆయతనం మహత్ ఈ ప్రపంచాని కంతా ఆధారమది. ఇంత చిన్నది గదా ఈ హృదయం. ప్రపంచాని కాధారమేమిటి. సమష్టి రూపంగా భావిస్తే ప్రపంచాని కాధారమైన హృదయ మొకటి ఉన్నది. అది సూర్య మండలం. అదీ ఒక మాంసపు ముద్దగానే కనపడుతుంది. అది లేకపోతే ఈ భౌతిక ప్రపంచానికి వెలుగు లేదు. వెలుగు సోకకుంటే ఇది అంధకార బంధురం. నిర్వ్యాపారం. నిరుపయోగం. అలాగే వ్యష్టి రూపమైన ఈ పిండాండానికి కూడా ఆయతన మైనది హృదయం. సూర్య బింబంలాగే ఎఱ్ఱగా వెలిగి పోతుంటుంది. సూర్యమండలం తేజస్సులో ప్రపంచమంతా ప్రకాశిస్తున్నట్టే హృదయం తాలూకు తేజస్సు వల్లనే శరీరమంతా ఇలా భాసిస్తూ అన్ని పనులా సాగిస్తున్నది.

జ్వాలమాలా కులం భాతి - సూర్యమండలం తన కిరణ జాలం చేత పరివేష్టిత మయినట్టే తన నాడీ చక్రం చేత పరివృత మయి ఉంది

హృదయం కూడా. దాని నుంచి నలువైపులా దాని కిరణాలు ప్రసరించి నట్టు హృదయ మండలం నుంచి కూడా శతాధికనాడులు కిరణాలలాగానే శరీర మంతటా వ్యాపిస్తున్నాయి. అవి అగ్ని జ్వాలలాగా మాలాకారంగా దాన్ని చుట్టు ముట్టి మండుతుంటాయి. మంటలలాగా రక్తంతో నిండి ఎఱ్ఱగా కనిపిస్తుంటాయి అంతకూ బ్రహ్మాండ శరీరానికి సూర్యమండల మొక ఆయతన మైతే పిండ శరీరానికి హృదయాగ్ని మండల మొక ఆయతనం. అది అరుణారుణంగా కనిపిస్తే ఇదీ అరుణ వర్ణమే. దాని కిరణాలు సర్వవ్యాపకమై సర్వ ప్రపంచాన్నీ వెలిగించినట్టే దీని నాడీ కిరణాలు కూడా శరీరమంతా వ్యాపించి ప్రకాశింప జేస్తుంటాయి. రెండూ కలిసి నన్నడిగితే చిదగ్ని కుండమే. అగ్నికుండం పైకి జడంగా కనిపిస్తున్నా లోపల అంతర్యామి రూపంగా చైతన్యముండి నడుపుతున్నట్టే ఇక్కడ హృదయ కుండాన్నీ అక్కడ బాహ్యంగా సూర్యకుండాన్నీ అఖండ చైతన్యమే సమష్టి వ్యష్టి రూపంగా మారి నడుపుతున్న దనుకొంటే సరిపోతుంది. అయితే ఈ హృదయాన్ని పద్మకోశం లాంటిదని వర్ణించారు బాగానే ఉంది. లంబ త్యాకోశ సన్నిభం - అంతే గాక అది ఆకోశం లాగానే లంబతి అధోముఖంగా వ్రేలాడుతున్నదని కూడా అంటున్నారు. అలా వ్రేలాడుతూ ఉంటే జారిపడి పోదా. పోదు. ఎందుకంటే సంతతగ్ంo సిరాభిస్తు - సిరలంటే రక్తనాళాలు. అవి మన శరీంరలో 72 వేలున్నాయంటారు యోగశాస్త్ర వేత్తలు. పోతే అందులో నూట ఒక్క నాడులు హృదయానికి సంబంధించినవి

ముఖ్యమైనవి. అవి దాని చుట్టూ చేరి గట్టిగా దాన్ని పట్టుకొని ఉన్నాయి. తాళ్లతో బిగించినట్టు బిగించాయి. అలాంటప్పుడిక కదిలే ప్రశ్నేముంది. స్థానం తప్పే ప్రసక్తి ఏముంది. అసలీ శరీరమంతా ఇలా నిలిచి ఉందంటే ఇందులో ఏ భాగ మెక్కడికక్కడ స్థిరంగా ఉందంటే అది దాన్ని సమంగా వ్యాపించిన ఒకానొక శక్తి మీద ఆధారపడి ఉండటం మూలాన. దానికే ధారణ అని పేరు. ధారణా రూపమైన ప్రాణశక్తి దీన్ని ఇలా ధరించి ఉంది. అంచేత దేని స్థితికి గానీ దాని స్థితి తప్పే ప్రశ్నే రాదు.

పోతే ఇలా తన స్థానంలో తానుండి పనిచేస్తున్న ఈ హృదయానికి నాలుగు ద్వారాలున్నాయి. అది ఒక ద్వారకా పట్టణం. **తస్యాంతే సుషిరగ్ంం సూక్ష్మం - తస్మిన్ సర్వం ప్రతిష్ఠితమ్** - దాని నడిబొడ్డున ఒక సుషిరముంది. సుషిరమంటే రంధ్రం. ఖాళీ ప్రదేశం. అదే హృదయాకాశం. దహరాకాశ మని కూడా పేర్కొంటారు. యావానయం బహిర్ధా తావా నయమంతర్ధా ఆకాశః - బాహ్యంగా ఈ ఆకాశమెంత విస్తరించి కనిపిస్తున్నదో అంతగా విస్తరించి ఉన్నదీ దహరాకాశం. దహరం దభ్ర మంటే అసలు చాలా చిన్నదని అర్థం. చిన్నదిగా హృదయం మేరకు సంకుచిత మయినట్టు కనిపిస్తున్నా ఇది వాస్తవంలో చిన్నది గాదు. చాలా పెద్దది. బాహ్యమైన ఆకాశమెంతో అంతా ఉన్నది. అయినా ఆకాశమనేది నిరాకారం నిశ్చలం గదా. దానికి చిన్నా పెద్దా అనే భేదమే ముంటుంది. మరి దహర మని ఎందుకన్నారు. హృదయమనే ఉపాధిని

బట్టి ఆమాట అన్నారు. ఘటోపాధిని బట్టి ఘటాకాశ మన్నట్టు అన్నారా మాట. ఘటంలో ఉన్నా దాని బయట ఉన్నా ఆకాశ మాకాశమే. దాని విస్తారానికి లోటు రాదు. అలాగే హృదయంలో ఉన్నా దాని బయట ఉన్నా ఈ చిదాకాశానికి కూడా తేడా రాదు.

తస్మిన్ సర్వం ప్రతిష్ఠిత మంటున్నది మంత్రం. దానిలోనే ఈ చరా చర పదార్థ జాతమంతా ప్రతిష్ఠిత మయి ఉందట. ఇప్పుడీ బాహ్యాకాశంలో సూర్యచంద్రాది సమస్త గోళాలూ – అందులో నివసించే చరా చర పదార్థాలూ ఎలా అంతర్గతమయి అందులోనే తల దాచుకొంటున్నాయో – అలాగే ఈ జడాకాశంతో సహా అవన్నీ ఇప్పుడు చెప్పిన హృదయాకాశంలో చేరిపోయి ఉన్నాయి. ఒక్క ఆకాశం చాలదా అన్నీ కలిసి దానిలోనే ఉన్నాయని చెప్పటానికి. మరలా హృదయాకాశమని ఇంకొకటి చెప్పటం దేనికి. అది కూడా అందులోనే అంతర్గతమయి ఉంది గదా. నిజమే. కాని అది జడమైతే ఇది జడం కాదు. చేతనం. అది ప్రమేయమైతే ఇది దానికి కూడా ప్రమాణం. జ్ఞాన స్వరూపం. అంచేత వాస్తవంలో ఇదే ఈ జ్ఞానమే ఆకాశం. ఆ సమంతా త్కాశతే ఇత్యాకాశః అంతటా వ్యాపించి ప్రకాశిస్తున్నది స్వయం ప్రకాశమైన ఈ చిదాకాశమే.

అయితే హృదయ మంటున్నారు చైతన్య మంటున్నారు. హృదయమూ దానిలో ఉన్న ఖాళీ రెండూ అచేతనమే గదా ఇది

చిదాకాశమెలా అయింది. అదే మనకు క్రమంగా బోధిస్తున్నదా రహస్యమీ మంత్ర పుష్పం. ఆలకించండి.

**తస్య మధ్యే మహా నగ్ని - ర్విశ్వార్చి ర్విశ్వతోముఖః**

**సోఽ గ్రభు గ్విభజన్ తిష్ఠ - న్నాహార మజరః కవిః**

**సంతాపయతి స్వం దేహ - మాపాదతల మస్తగః -**

అది వట్టి ఖాళీ గాదట. మరేమిటి. ఆ ఖాళీలో ఒక గొప్ప అగ్ని హోత్రముంది. అగ్ని అంటే ఉష్ణ గుణం. తేజస్సు విశ్వార్చిః - దానికన్నీ మంటలే - విశ్వతో ముఖః అన్నివైపులా ప్రసరిస్తుంటాయి దాని మంటలు. ఏమిటర్థం. హృదయంలో ఉండే రక్తమే పెద్ద అగ్నిహోత్రం. దాని నుంచి బయటికి వచ్చే రక్తనాళా లన్నిటిలో రక్తమే ప్రవహిస్తుంటుంది. రక్తంలో ఉండేదంతా ఉష్ణగుణమే. అది రక్తంతో పాటు సర్వత్రా ప్రసరించక పోతే ఎక్కడి కక్కడ శరీర భాగాలు చల్లబడి చచ్చుబడి పోతాయి. కాబట్టి శరీరమంతా హృదయాగ్నే వ్యాపించి ఉంది. అగ్ని అనేసరికది ఒకటి గాదు. అంటే అర్థమొక విధంగా పనిచేయదు. అందులో మూడు శాఖలున్నాయి. వాటినే బాహ్యంగా చెబితే త్రే తాగ్నులంటారు. ఒకటి ఆహవనీయం రెండు దక్షిణాగ్ని మూడవది గార్హ్వ పత్యం.

ఆధ్యాత్మికంగా భావిస్తే ఆహవ నీయ మనేది మన ముఖంలో ఉండే ఉష్ణ గుణం. మనం తినే పదార్థాలన్నీ అక్కడే ఆహూతి

అవుతుంటాయి కాబట్టి ఆహవనీయ మన్నారు దాన్ని. పోతే ముఖాగ్ని హోత్రంలో పడ్డ ఈ పదార్థ జాతమంతా మన జఠర గోళంలో చేరి అక్కడ పచన మవుతుంది. పచన మై రక్తంలో రసరూపంగా కలిసి హృదయాని కందుతుంది. కాబట్టి ఇలా పచనం చేసే జఠరాగ్నికి గార్హ పత్యమని పేరు వచ్చింది. గృహాని కంతా పతి ఇది. గృహమంటే శరీరం. పాతీతి పతిః దీన్ని శుష్కించి నశించి పోకుండా కాపాడేది కాబట్టి గార్హ పత్యమన్నారీ అగ్నిని. కాగా ఈ అగ్నిలో పచనమై రసరూపంగా రక్తంలో కలిసి హృదయంలో చేరే రూపంగా అభివ్యక్తమైన అగ్నిని దక్షిణాగ్ని అన్నారు. దక్షిణమేమిటి. హృదయం వామ భాగంలో గదా ఉందన్నారు. నిజమే అది వామంలోనే ఉన్నా దానికి నాలుగు ద్వారాలున్నాయి. అందులో దక్షిణం వైపున్న ద్వారంలో ప్రకటమయ్యే గుణం కాబట్టి ఇది దక్షిణాగ్ని అయింది. అన్వాహార్య పచన మని కూడా మరొక పేరు దీనికి. ఆహారం పచనమైన తరువాత తేజో రూపమైన ప్రాణశక్తిగా మారేది గనుక ఆ పేరు వచ్చింది.

ఇందులో ఒకటి ముఖం ఒకటి హృదయం మరొకటి జఠరం. మూడు ప్రదేశాలలో మూడున్నాయి ఈ అగ్నులు. ఇవి మూడూ ఒకే అగ్ని అయినా ఒక్కొక్క చోట ఉండి ఒక్కొక్క పని చేస్తుంటాయి. అదే వర్ణిస్తున్నాడిప్పుడు. సోగ్రభుక్ అది అగ్రస్థానంలో ఉండి భుక్ ఆహారాన్ని భుజిస్తుంటుంది మొదట. అప్పుడది ఆహవనీయం. పిమ్మట దాన్ని

వచనం చేసి రసరూపంగా అది రక్తంలో కలిస్తే హృదయ ప్రదేశాని కందిస్తుంది. అప్పుడది దక్షిణాగ్ని. అలా నిత్యమూ తనలో వచనం చేస్తూనే ఉంటుంది కాబట్టి తిష్ఠన్. ఎప్పుడూ పచన క్రియకు నిలయంగానే ఉండే గార్హ పత్యం. అది అందించిన రక్తాన్ని ఆయా నాడుల ద్వారా శరీరం నలువైపులా విభజించి ప్రసరింప జేసేది హృదయంలో ఉన్న దక్షిణాగ్ని. ఇది ఆ పని చేయకపోతే శరీరంలో ఏ భాగమూ పనిచేయక నిర్వీర్యమై స్తంభించి పోతుంది కాబట్టి హృదయమే ప్రధాన మీ శరీరంలో.

ఆహార మజరః కవిః – ఆహారాన్ని వచనం చేస్తున్నా రక్త ప్రసరణం ద్వారా సర్వత్రా శక్తిని సరఫరా చేస్తున్నా – ఆహారాన్ని జీర్ణం చేస్తుందే గాని తాను మాత్ర మెప్పటికీ జీర్ణం కాదు. అజరం. అయితే ఇంత పని ఈ అచేతనమైన హృదయం చేయగలదా. అది కేవలమొక మాంసఖండం గదా అని శంకించరాదు. అది భౌతికమైన ఒక ఉపాధి మాత్రమే. దాని నధిష్ఠించి ఒక చైతన్య ముందనే విషయం మరచి పోరాదు మనం. అదే కవి. దర్శనాత్కవి రుచ్యతే. కవి అనే మాటకు ద్రష్ట అని అర్థం. దర్శించే స్వభావమున్నది చైతన్యమే మరేదీ గాదు. అది స్వరూపమైతే దానికొక వాహక మీ హృదయం. అది దీనిచేత పని చేయిస్తుంటే ఇది చేస్తున్నది.

తిర్య గూర్ధ్వ మధశ్శైవ. అడ్డంగా పైకీ క్రిందికీ ఎన్నో కాంతి కిరణా లందులో నుంచి ఇటూ అటూ ప్రసరిస్తుంటాయి. కాంతి

కిరణాలేవో గావు. నాడులే. సూర్యకిరణాల లాంటివవి. సౌర కిరణాలలో వేడి ఉన్నట్టే వీటిలో కూడా రక్త గతమైన ఉష్ణ గుణముంటుంది. వీటి ద్వారా సంతాపయతి స్వం దేహం. శరీరాన్నంతా తపింప జేస్తున్నదది. తపింప జేయుట మేమిటి. ఉష్ణ గుణాన్ని అన్ని అవయవాలకూ ఇంద్రియాలకూ పంచి పెట్టటం. తద్ద్వారా అవన్నీ వేడెక్కటం. అలా కాకుంటే శరీరమే భాగానికా భాగం చల్లబడి పోతుంది. Temperature అంటే ఇదే. వెచ్చదనం. జీవచ్ఛరీర మెప్పుడూ ఎక్కడ తడవి చూచినా వెచ్చగా సోకుతుంది చేతికి. కారణ మక్కడ రక్తం ప్రసరిస్తుంటుంది. ఆ రక్తంలో వేడిమి ఉంటుంది. కాబట్టి అదే ఎక్కడంటే అక్కడ మనకు వేడిగా చేతిగా తగలటం. ఆపాద మస్తకమూ శరీరం వేడిగా ఉందంటే అది వేడి రక్తమంతటా ప్రసరించటం వల్లనే. అదే జీవలక్షణం. లేకుంటే నిర్జీవమే ఈ శరీరం. కనుకనే జీవుడికి తైజసుడని పేరు వచ్చింది. ఉష్ణో జీవిష్యన్ శీతో మరిష్యన్ అని వేదం చెబుతున్నది కూడా. బ్రతికున్నందుకు గుర్తు ఉష్ణత్వం చచ్చాడనేందుకు శీతలత్వమన్నారు. పోతే

**తస్య మధ్యే వహ్ని శిఖా - అణీ యోర్ధ్వా వ్యవస్థితా -**

**నీలతోయ దమధ్యస్థా - విద్యుల్లే ఖేవ భాస్వరా -**

**నీవార శూకవ త్తన్వీ - పీతా భాస్వ త్యణూపమా -**

Yellamraju Srinivasa Rao
www.advaitavedanta.in

దాని నడుమ ఉందట ఒక వహ్నిశిఖ. అగ్ని జ్వాల. దేని నడుమ అంటారు. హృదయాగ్ని నుండి వెలువడే నాడులన్నింటి నడుమ. చెప్పాము గదా శతం చైకా హృదయస్య నాడ్యః అని. 72 వేలున్నాయి ఈ శరీరంలో నాడులు. అందులో 101 నాడులు హృదయానికి సంబంధించినవి. అందులో ఒక నాడి ఇప్పుడు పేర్కొంటున్న ఈ అగ్ని జ్వాల. అగ్ని జ్వాలలాగానే రక్తంతో నిండి రక్త వర్ణంగా భాసిస్తుంటుంది. అది అణీయా. అణో రణీయాన్ అన్నట్టు అణువు కన్నా సూక్ష్మమైనది. అది ఊర్ధ్వా వ్యవస్థితా. ఊర్ధ్వ దిశగా ప్రయాణం చేయటానికే వ్యవస్థిత మయి ఉంది. అనగా నియతమయి Fixed ఉంది. మిగతావన్నీ మిగతా చోట్లకు బయలుదేరి పోతుంటే ఇది ఒక్కటీ మాత్రం సరాసరి పైకి వెళ్లిపోతుంటుంది. తాసాం మూర్ధాన మభినిస్సృతైకా అని చాటుతున్న దుపనిషత్తు. మూర్ధమంటే శిరః కపాలం. అది శరీరానికి పయి భాగాన్నే కదా ఉన్నది. అంచేత ఊర్ధ్వమంటే శిరస్సు కని అర్థం. దీనికే బృహత్సిర అని పేరు భౌతిక శాస్త్రంలో. మన అధ్యాత్మ శాస్త్రంలో సుషుమ్నా నాడి అంటారు దీన్ని. దేదీప్యమానంగా వెలిగి పోయేదని శబ్దార్ధం. ఒకవైపు ఇడా మరోవైపు పింగళ అని రెండు నాడులుంటాయి దీనికి. ఇది వాటి రెంటి మధ్యా ఉండి హృదయ ప్రదేశం నుంచి సరాసరి మెదడుకు అభిముఖంగా బయలుదేరి పోతుంది. దాని ద్వారా రక్తం సరఫరా అవుతుంటే మానవుడి మెదడు పనిచేస్తుంటుంది. అదే బుద్ధి వృత్తి.

హృదయం నుంచి ఇప్పుడు మన దృష్టి బుద్ధి దగ్గరికి బదిలీ అయి పోయింది. హృదయ మచేతనమైతే బుద్ధి చేతనం. అక్కడ జ్ఞానం లేదు. లేదంటే అసలు లేదని గాదు. అసలే లేకుంటే ఏదీ మనకున్నట్టు స్ఫురించదు. ఆత్మ అన్నప్పుడది సర్వత్రా ఉండి తీరాలి. అయితే జడ పదార్థాలలో అది సద్రూపంగా వ్యక్తమయి చిద్రూపంగా గుప్తమయి ఉంటుంది. అదే చేతనాలలో అయితే చిద్రూపంగా ప్రకటమై సద్రూపంగా పరిమిత మయి ఉంటుంది. అదే ఇప్పుడు మనబోటి జీవుల పరిస్థితి. మన బుద్ధి జ్ఞాన స్వరూపమే. కాని అది చిద్రూపమైనా సద్రూపంగా దానికి వ్యాప్తి లేదు. శరీరం మేరకే పరిమితమయి పోయింది. ఇదే వ్యాపించిందను కోండి. అప్పుడు దేశ కాల పాత్రలనే అవధులు కనిపించవు. వాటిని కూడా వ్యాపించి తనలో కలుపు కొంటుంది. కలుపుకొంటే అప్పుడది ఇక జీవాత్మ గాదు. పరమాత్మే. అలాటి పరమాత్మ భావాన్ని అందుకోటానికే ఇప్పుడీ ఉత్తరార్ధంలో మంత్ర పుష్పం మనకు చేసే ఉపదేశమంతా. అది అందుకొనే ప్రయత్నమే మనం చేయవలసిన దంతా.

ఇంతకూ ఈ సుషుమ్న అనేది హృదయాన్నీ బుద్ధినీ రెండు తీరాలనూ కలిపే ఒక వంతెన. వంతెన లాంటి ఈ బృహత్సిర రెంటినీ కలపటం వల్ల రక్తం మెదడు దాకా ప్రవహించి బుద్ధి పనిచేస్తున్నది. అందులో అనేకానేక వృత్తు లేర్పడుతున్నాయి. ఆ వృత్తులలో ఒకానొక

వృత్తి బ్రహ్మాకార వృత్తిగా మారి సర్వవ్యాపకమైన బ్రహ్మ స్వరూపాన్ని దర్శించి పరిపూర్ణమైన బ్రహ్మానుభవ మీ జీవుడికి లభిస్తున్నది. కనుకనే ఇప్పుడర్థ మవుతుంది మనకు హృదయమూ బుద్ధీ రెండింటినీ ఏకం చేసి మన ప్రాచీను లెందుకు వర్ణిస్తూ వచ్చారో.

మంచిదే. కాని ఇప్పుడు మీరు చెప్పే మాటలను బట్టి చూస్తే ఒక సందేహ మేర్పడుతున్నది వినేవాళ్ళకు. శరీరం జడమన్నారు. అందులో ఉన్న హృదయమూ జడమే. దానిలో ప్రవహించే రక్తమూ జడమే. శిరస్సుకు వెళ్ళే సుషుమ్నా నాడీ జడమే. అది అందించే రక్తమూ జడమే. తద్ద్వారా ఏర్పడే బుద్ధి వృత్తీ జడమే గదా. ఈ జడ పరంపర మనకు శుద్ధ చైతన్య రూపమైన బ్రహ్మానుభవమెలా ఇవ్వగలదు. చెబుతున్నాము వినండి. అసతో మా సద్గమయ అన్నట్టు అసద్రూపమైన బుద్ధి వృత్తే చిద్రూపమైన చైతన్యాన్ని అందిస్తుంది మనకు. ఎలాగంటే చైతన్యం సర్వ వ్యాపకం. అది లేని చోటు లేదు. అది శరీరం వెలపలే గాక శరీరం లోపల బుద్ధి వృత్తి దాకా నిండి నిబిడీ కృతమయి ఉంది. కాని చాలా గుప్తంగా ఉంది. ఈ మొత్తంలో సద్రూపంగానే గాని చిద్రూపంగా ప్రకటం కావటం లేదని చెప్పాము. ఉండటమేమో ఉంది గాని ప్రకటం కాలేదు. ప్రకటం చేస్తే మాత్రమవుతుంది వెంటనే. అలా ప్రకటం చేసే సాధనం బాహ్యంగా ఎక్కడా లేదు. శరీరాలలో కూడా స్థావరాలలో లేదు. జంగమాలలో కూడా పశుపక్ష్యాదులలో లేదు. ఒక్క మానవ

Yalamanchili Brahmaji Srinivasa Rao
www.advaitavedanta.in

శరీరంలోనే అందులో కూడా మాంస రూపమైన హృదయంలో కూడా కాదు. దాని నుంచి పైకి సాగి పోయే నాడీ రక్తంలోనూ కాదు. తద్వారా స్పందించే బుద్ధి వృత్తులలో ఉందా సాధనం. ఈ సాధనం ద్వారా బుద్ధి వృత్తి రూపంగా స్పందిస్తే అది అద్దం లాగా ప్రాపంచికమైన పదార్థాల బొమ్మలను ప్రతిబింబించి చూపుతుంది. 99 వృత్తులలా చూపుతుంటే వాటిలోనే వరేణ్యం భర్గః అన్నట్టు ఒకానొక వృత్తి బ్రహ్మాకారంగా మారి తనలో ఆ బ్రహ్మ స్వరూపాన్నే ప్రకటం చేసి చూపగలదు. ఒక దీప ప్రకాశమెలాగా అక్కడే చీకట్లో గుప్తమైన వస్తువును ప్రకటం చేసి చూపుతుందో అలా చూపుతుందీ వృత్తి. బ్రహ్మతత్త్వాని కుపలబ్ధి స్థానమీ మానవుడి బుద్ధే. అందువల్లనే మానవుడి బుద్ధి గుహలోనే వచ్చి ప్రవేశించాడా పరమాత్మ అని శాస్త్రం ఘోషించటం. క్రొత్తగా ప్రవేశించటం దేనికీ అంతటా ఉన్నప్పుడు. అయినా ఆ మాట అన్నదంటే ప్రవేశించిందని చెప్పటం కాదు దాని ఉద్దేశం. అక్కడే ప్రకటమై కనిపిస్తుందని. ఇంతకూ ఉన్నదే అభివ్యక్త మవుతున్నది గాని లేనిది సృష్టి కావటం లేదు. అభివ్యక్తి సాధనమే మానవుడి బుద్ధి. అది స్వతహాగా జడమైనా చైతన్యాన్ని పట్టుకోగలదు. కారణం. అజ్ఞాతంగా అదే దీనిలో చేరి దీన్ని గట్టిగా పట్టుకొని ఉంది. ఇదీ ఇక్కడ మనం గ్రహించవలసిన రహస్యం.

Yellamraju Srinivasa Rao
Brahmasri
www.advaitavedanta.in

నీలతోయద మధ్యస్థా విద్యుల్లేఖేవ భాస్వరా. అందుకే నల్లని మేఘమండలం మధ్యలో పచ్చగా వెలిగే మెరుపు తీగలాగా వెలిగి పోతున్నదట ఆ సుషుమ్న. మేఘంలాగా చీకట్లు కమ్మే ఈ జడ శరీర మార్గంలో ఒక మెరుపు మెరిసినట్టు మెరుస్తున్నదది. నీవార శూకవత్తన్వీ ఎంత సున్నితంగా ఉందంటే అది - నీవార శూకవత్ నివ్వరి గింజ ముల్లులాగా అతి నిశితంగా ఉంది. అణూపమా. అణువులాగా అతి సూక్ష్మంగా ఉంది. పీతా భాస్వతీ. పచ్చగా బంగారంలాగా ప్రకాశిస్తున్నది. అంటే అతి సూక్ష్మమూ ప్రకాశమానమూ అయితే గాని అది బుద్ధిని స్పందింప జేసి అతి సూక్ష్మమైన బ్రహ్మాకార వృత్తిగా మారలేదు. దృశ్యతే త్వగ్ర్యయా బుద్ధ్యా సూక్ష్మయా సూక్ష్మ దర్శిభిః అని గదా కఠోపనిషత్తు చెప్పిన మాట. సర్వత్రా వస్తు సిద్ధంగా ఉన్నా గూఢమయి ఉందట ఆత్మ స్వరూపం. మామూలు బుద్ధి కది కనిపించే బాపతు కాదు. దానిలాగా ఇదీ సూక్ష్మమూ అగ్ర్యమూ అయి పదును చెందితే గాని పట్టుకో లేదు.

**తస్యా శ్శిఖా యా మధ్యే - పరమాత్మా వ్యవస్థితః**

అలా పట్టుకోవాలంటే దాని శిఖ అంటే అగ్రం బాగా మొనదేరి ఉండాలి. అందులోనూ మధ్యే. ఏ ఖాళీ ఉన్నదో అది నిరాకారం నిర్గుణం. పరమాత్మా వ్యవస్థితః. అందులో కూచుని ఉన్నాడా పరమాత్మ. అంటే శుద్ధమైన చైతన్యం. సర్వవ్యాపకం గనుక అక్కడ ఉండటంలో ఆశ్చర్యం

Yallamraju Srinivasa Rao
Brahmasri
www.advaitavedanta.in

లేదు. అయితే అక్కడేనని ఎందుకు చెప్పాడంటే మనం మన బుద్ధి వృత్తుల నన్నింటినీ ఖాళీ చేసుకొని ఆఖాళీ మీదనే బుద్ధి పెడితే ఈ బుద్ధీ ఆ ఖాళీ రెండూ ఏకమవుతాయి. బుద్ధి అంటే వృత్తి రూపమైన జ్ఞానమే గదా. జ్ఞానంలో అన్ని వృత్తులూ ధియో యోనః ప్రచోదయాత్తన్నట్టు తొలగిపోతే ఇక మిగిలినది నిరాకారమైన జ్ఞానమే. అది చిద్రూపమైతే అది చూచే ఖాళీ సద్రూపం. రెండూ అప్పుడు నిరాకారమే కాబట్టి ఒకటిగా అఖండమై శరీరం లోపలా బయటా కూడా వ్యాపిస్తాయి. అది మనం మన స్వరూపంగానే భావిస్తాము కాబట్టి బ్రహ్మానుభవమనేది తప్పకుండా లభిస్తుంది. ఇదీ ఇందులో మర్మం.

**స బ్రహ్మ స శివ స్సహరి స్సేంద్రః సోఽక్షరః**

**పరమ స్స్వరాట్**

ఇప్పుడా సుషుమ్నా శిఖా మధ్యగతమైన పరమాత్మ తత్త్వమేది మన అనుభవానికి వస్తుందో అది అంతవరకే ననుకోరాదు. సర్వవ్యాపకం గనుక అది - అదే బ్రహ్మ. అదే శివుడు. అదే హరి. బ్రహ్మ విష్ణు మహేశ్వరులుగా సత్త్వరజస్తమో గుణాలతో మూర్తీభవించి సాక్షాత్కరిస్తున్నది. స ఇంద్రః ఇంద్రాది దేవతా రూపాలు కూడా అదే. ఏ ఉపాధులూ లేని ఆ పరమాత్మే ఇన్ని ఉపాధులలో మనకు ప్రత్యక్ష మవుతున్నది. అది చర్మ చక్షుస్సుల కనే కాదు. మనోనేత్రానికి తోచే

ఆయా దేవతా మూర్తులు కూడా అదే. సోక్షరః పరమః స్వరాట్. అంతే కాదు. ఇన్ని రూపాలలో అది క్షరమై పోతున్నట్టు కనిపించినా వస్తుతః అది అక్షరమే. ఈ ఉపాధులలాగా జనన మరణాల పాలయ్యేది కాదు. అజరామరమైన తత్త్వం. సామాన్య రూపమది. విశేషాలు ఎప్పటికప్పుడు వస్తూ పోతుంటాయే గాని వాటికధిష్ఠాన మైన సామాన్యమలా నశించదు. తరంగ బుద్బుదాదుల లాగా సముద్ర జలం నశిస్తుందా. అలాగే ఇదీ అక్షరమే. సముద్ర జలమైనా ఉదాహరణ కిచ్చామే గాని అదీ క్షరమే ఆమాటకు వస్తే. తేజస్సు దృష్ట్యా జలం నశించేదే. వాయు దృష్ట్యా తేజస్సు పోయేదే. ఆకాశ దృష్ట్యా అదీ పోవలసిందే. కాగా ఆకాశం కన్నా పరమైనది చైతన్యం. స్వతః ప్రమాణమది. స్వరాట్ స్వయం రాజతే ఇతి స్వరాట్. తన పాటికి తనుండ గలదు ప్రకాశించ గలదు. కనుకనే అది పరమః - ఆకాశాది ప్రమేయ జాతాని కంతా పరమమైనది. విలక్షణమైనది.

అదే మన అసలైన స్వరూపం. దాని నందుకొంటేనే ఎప్పటికైనా మోక్షం మానవుడికి. కనుక ఈ జీవాత్మ భావం పోయి ఆ పరమాత్మ తోడి సాయుజ్యం లభించాలని కోరుతూ ఆ పరమాత్మకు మనసా వాచా కర్మణా శరణాగతి పొందాలి. నమస్సంటే తలవంచి శరణు వేడటం. ఇదే ప్రపత్తి అనే మాటకు కూడా అర్థం. ఎలాగో వర్ణిస్తూన్నది మంత్రం.

**రాజాధి రాజాయ ప్రసహ్య సాహినే**

**నమో వయం వైశ్రవణాయ కుర్మహే**

**సమే కామాన్ కామకామాయ మహ్యం**

**కామేశ్వరో వైశ్రవణో దదాతు**

ఈ మంత్రానికి మామూలుగా అర్థం చెబితే ఇలా చెప్పవచ్చు. రాజాధి రాజంటే కుబేరుడనే దిక్పాలకుడు. రాజరాజని పేరుంది కుబేరుడికి. అంతేకాక వైశ్రవణుడన్నా కుబేరుడే. విశ్రవసుడనే మహర్షి కుమారుడు గనుక ఆపేరు వచ్చింది. విశ్రవసుడనే వాడి కిద్దరు భార్యలైతే అందులో మొదటి భార్యకు పుట్టినవాడు కుబేరుడు. రెండవ భార్య అయిన కైకసికి జన్మించారు మరి ముగ్గురు. వారే రావణ కుంభ కర్ణ విభీషణులు. ఒక కూతురు కూడా జన్మించింది. అది శూర్పణఖ. అంచేత రావణుడెవరో గాదు. కుబేరుని తమ్ముడే. లంకా నగరం మొదట కుబేరుడిదే. పుష్పక విమానం కూడా అతనిదే. బలవంతంగా అతని నుంచి అపహరించి తనకు స్వాధీనం చేసుకొన్నాడు రావణుడు. కుబేరుడు నవనిధుల కధిపతి. ధనపతి అని పేర తనికి. రావణుడు రాక్షసాధిపతి అయితే కుబేరుడు యక్షుల కధిపతి. అతినికి లంక రాజధాని అయితే ఇతనికి రాజధాని అలకా పట్టణం. శివుడతని కారాధ్య దైవతమైతే ఇతనికి సాక్షాత్తూ మిత్రుడే. ఇదీ పౌరాణికంగా చెబితే కుబేరుడి వ్యవహారం.

Brahmasri Yalamanchi Srinivasa Rao www.advaitavedata.in

కాని ఇదంతా ప్రస్తుతాంశానికి సరిపడదు. ప్రస్తుతం మంత్ర పుష్పం వర్ణిస్తున్నది పరమాత్మ తత్త్వం. అదే నిర్గుణంగా బ్రహ్మం. సగుణంగా బ్రహ్మ విష్ణు మహేశ్వరాది దేవతా రూపాలని చెబుతున్నది. తరువాత కూడా అదే చెప్పబోతున్నది. అంతశ్చరతి భూతేషు అని అంతర్యామి రూపంగా ఆ తత్త్వాన్నే. అలాంటప్పు డున్నట్టుండి ఇది ఒక కుబేరుడనే దిక్పాలుడి వర్ణన అని అర్థం చెబితే ఏమి బాగుంటుంది. పూర్వాపరాలకే మాత్రమూ అతుకు పడదు. కనుక బాహ్యార్థం కాదు మనమిక్కడ గ్రహించ వలసింది. దానిలో దాగి ఉన్న అంతరార్థం. అది ఏదో గాదు. ముందు నుంచీ పేర్కొంటున్న పరమాత్మ తత్త్వమే. అదే దీని వివక్షితం. అది ఎలాగో విమర్శించి తెలుసుకొందాము.

వైశ్రవణుడంటే ఇక్కడ పరమాత్మే. విశ్ర వస్సన్నా వైశ్రవణ అన్నా ఒకటే. మనస్సు మానస రక్షస్సు రాక్షస అన్నట్టు. వివిధ రూపాలలో విశేసంగా భాసించే కీర్తి ఉన్న వాడని అర్థం. పరాస్య శక్తి ర్వివిధైవ శ్రూయతే అనే శ్వేతాశ్వర ధ్వని కిది ప్రతిధ్వని. అలాంటి వైశ్రవణుడికి మేము నమస్కరిస్తున్నా మంటాడు. ఏది ఎలాంటి మహానుభావుడా పరమాత్మ అంటే చెబుతున్నారు. రాజాధిరాజు ప్రసహ్యసాహి ఆయన. రాజృ దీప్తావని వ్యుత్పత్త్యర్థం చెప్పుకొంటే దీప్తులన్నింటికీ దీప్తి పరమాత్మ. స్వతః ప్రకాశం గదా అది. అంచేత మిగతా జడ ప్రకాశాలన్నీ రాజ అయితే అది రాజాధి రాజ. అఖండ చైతన్య ప్రకాశమని భావం. మరి ప్రసహ్యసాహి అంటే. ప్రసహ్య బలవంతంగా ఒకరి మీద ఆధారపడి

సాహి సాగిపోయేవాడని శబ్దార్థం. అసలు కుబేరుడికి నరవాహనుడని పేరు. కుబేర అంటే కుత్సితమైన శరీరం. అలాటి వ్యాధిగ్రస్తుడు గనుకనే ఒక నరుడాయన నెప్పుడూ మోసుకొని పోతుంటాడట. ఇది పురాణ గాథ.

పోతే ఇక్కడ పరమాత్మ నరవాహనుడెలా అయ్యాడు. ఆయన శరీరమేమిటి. అది కుష్ఠ రోగ గ్రస్తమెలా అయింది అంటారేమో. పరమాత్మ శరీరమేమి టంటారు. నామరూపాత్మకమైన ఈ చరాచర ప్రపంచమే. ఇది ఎప్పటికప్పుడు మారిపోతూ కాలానుగుణంగా దెబ్బతినేది కాబట్టి కుత్సితమే. వ్యాధి గ్రస్తమే. కూటస్థమైనా ఆయన సర్వత్రా వ్యాపకుడు కాబట్టి తన పాటికి తాను కదలి పోక పోయినా – జీవ రూపంగా ఈ శరీరాల్లో చేరి కదలిపోతూనే ఉంటాడు. తదే జతి తన్నై జతి అని గదా శాస్త్రం చెబుతున్నది. నరుడంటే జీవుడే. పరమాత్మను మోస్తున్నాడు. ఇటూ అటూ తిరుగుతూ ఆయనను తిప్పుతున్నాడు. అంటే జీవాత్మ నధిష్ఠించే ఉన్నదన్ని దశలలోనూ ఆ పరమాత్మ. ఇదీ దాని లక్ష్యార్థం.

అంచేత స్థావర జంగమాత్మకంగా ఆ పరమాత్మ స్వరూపాన్ని మనం భావించి దానినే సేవించాలి నిత్యమూ. ఎందుకోసం. సమే కామాన్ కామ కామాయ మహ్యం. ఎన్నో కోరికలున్నాయి నీకూ నాకూ. కామ కాములం మనం. అవి మన పాటికి మనం స్వశక్తితో పొందలేము. కామేశ్వరో వైశ్రవణో దదాతు. కోరటం మన వంతయితే అవి తీర్చట

మాయన వంతు. కామేశ్వరుడు కాబట్టి ఆయన చేతిలో ఉన్నాయవి. తప్పకుండా ఇవ్వగలడేది కోరినా. దదాతు. అలా ఇస్తాడనే నమ్మకంతో ఆశ్రయించాలి మనం.

అయితే ఈ కోరికలనేవి రెండు విధాలు. ఒకటి ఐహికం. మరొకటి ఆముష్మికం. ఆముష్మికంలో కూడా ధర్మ పురుషార్థం మరలా ఐహికమైన అర్థ కామాలలాగా ఒక కోరికే. ఇవన్నీ తీరాలంటే కామేశ్వరుణ్ణి పట్టుకోవాలి. పట్టుకొంటే వాడు కుబేరుడి రూపంలో మనకు ధన ధాన్యాలిచ్చి సఫలం చేస్తాడు. ధన మూల మిదం జగత్తన్నారు. అర్థమంటే ధనమే. ధనం లేకుంటే కామం తీరదు. అముష్మికమైన స్వర్గ కామమూ తీరదు. యజ్ఞ యాగాదులకు కూడా పుష్కలంగా ధన ముండాలని చెబుతున్నది శాస్త్రం. పోతే మోక్ష పురుషార్థాని కొక్క దానికే భౌతికమైన ఈ ధన మక్కర లేనిది. అక్కడ కావలసిన ధనం జ్ఞాన ధనం. కాబట్టి ధనపతి కుబేరుడు కాడది నీకు తీర్చవలసింది. సర్వజ్ఞుడూ సర్వశక్తి సంపన్నుడూ అయిన పరమాత్మ అనే ధనపతి. **కుబేరాయ వైశ్రవ ణాయ - మహారాజాయ తే నమః -** ఓ కుబేరుడు గాని కుబేరా వైశ్రవణుడు గాని వైశ్రవణా నీవు స్వయం ప్రకాశ శీలుడవు గనుక నీవే ప్రసాదించాలి ఆ జ్ఞాన ధనాన్ని అని ఆ పరమాత్మనే ఆశ్రయించాలి మోక్ష కాముడైన మానవుడు.

**అంత శ్చరతి భూతేషు - గుహాయాం విశ్వమూర్తిషు**

**త్వం యజ్ఞ స్త్వం నషట్కార స్త్వమింద్ర స్త్వగ్ం రుద్ర**

**స్త్వం విష్ణు స్త్వం బ్రహ్మ - త్వం ప్రజాపతిః -**

ఎక్కడ ఉన్నాడా పరమాత్మ. ఎలా పట్టుకోవాలా తత్త్వాన్ని ఎక్కడేమిటి. సర్వత్రా ఉన్నాడు. సమస్త భూతాల లోపల సంచరిస్తున్న దాయనే. ఏదీ ఎక్కడా కనపడలేదే. గుహాయాం - బుద్ధి గుహలోనే అభివ్యక్తమయి ఉన్నాడు. ఆలోచనా రూపంగా ఉన్నదదే. సుఖదుఃఖా ద్యనుభవ రూపంగా ఉన్నదీ అదే. కర్తా భోక్తా అనుకొంటున్న జీవుడెవరను కొంటున్నా వీ జీవాత్మ రూపంలో ఉన్నదా పరమాత్మే. విశ్వమూర్తిషు. అంతేగాదు. ఈ విశాల విశ్వంలో నీకు కనిపిస్తున్న రూపాలన్నింటిలో అంతర్గతంగా ఉన్నదా పరమాత్మే. ఆయనే ఈ సమస్త రూపాలూ. ఆయనే ఈ రూపాలుగా భాసిస్తున్నదీ.

అలాంటి సర్వవ్యాపకమైన తత్త్వం కనుకనే నీవేది చూచినా ఏది భావించినా అదేనని తెలుసుకో. త్వం యజ్ఞః నీవే యజ్ఞ క్రియ త్వం వషట్కారః నీవే వషట్టనే శబ్ద ముచ్చరిస్తూ చేసే ఆహుతి. త్వమింద్రః నీవే హవిస్సు గ్రహించే ఇంద్రుడవు. త్వం రుద్రస్త్వం విష్ణుస్త్వం బ్రహ్మ. నీవే బ్రహ్మ విష్ణు మహేశ్వరులనే త్రిమూర్తులూ. త్వం ప్రజాపతిః నీవే

ఈ చరా చర సృష్టికీ స్రష్టవు - అని ఈ భావంతో పట్టుకో ఆ తత్త్వాన్ని. ఇందులో తృమ్మనేది నిరుపాధికాన్ని చెబితే - యజ్ఞాదులన్నీ దాని సోపాధికమైన విభూతిని చెబుతున్నాయి. విభూతి అన్నప్పుడది చేతన జగత్తే కాదు. అచేతన జగత్తు కూడా. అందుకే చెబుతున్నాడు మరలా. త్వం త దాపః - నీవే ఆకాశాది పంచభూతాలు. జ్యోతీరసోమృతం. పాంచ భౌతికమైన శరీరం కూడా నీవే. అందులో ఉన్న జ్యోతి మనస్సు రసః బుద్ధి - అమృతం - దాన్ని నడిపే సమష్టి బుద్ధి హిరణ్య గర్భ తత్త్వమూ అంతా నీవే. బ్రహ్మ భూర్భువ స్సువరోమ్. నీవే నిర్గుణంగా బ్రహ్మం. సగుణంగా తేజోబన్నాత్మకమైన ఈ చరా చర సృష్టీ కూడా. అని ఇలా భావించాలా తత్త్వాన్ని. భావిస్తే స్వరూప విభూతులు రెండూ కలిసి ఏకైకమైన తత్త్వంగా అనుభవానికి వస్తుంది.

**ఈశాన స్సర్వ విద్యానాం - ఈశ్వర స్సర్వ భూతానాం**

**బ్రహ్మాధిపతి ర్బ్రహ్మణోధిపతి - ర్బ్రహ్మ శివో మేస్తు**

**సదా శివోమ్**

వస్తుందా అని సందేహించ నక్కర లేదు. నిర్గుణంగా అది పరమాత్మ అయితే సగుణంగా అదే ఈశానుడూ ఈశ్వరుడూ. ఐశ్వర్యమంతా ఆయన సొమ్మే. ఐశ్వర్యమంటే ఈశ్వర భావం. నామరూప ప్రపంచమంతా

వ్యాపించి ఉన్నాడు. కాబట్టి ఇదంతా ఆయన ఐశ్వర్యమే. ఈశ్వర స్సర్వ విద్యానాం- ఇందులో ఎవరెన్ని విద్యలు సాధించినా అవన్నీ ఆయన విద్యలే. సర్వజ్ఞుడు గదా. సర్వవిద్యలూ ఆయనే. కనుక ఆయనను పట్టుకొంటే ఐహికాముష్మిక విద్యలన్నీ లభిస్తాయి మనకు. అపర విద్యలే గాక పర విద్య కూడా సిద్ధిస్తుంది. ఈశ్వర స్సర్వ భూతానాం దానితో సకల భూతాల మీదా ఈశ్వర త్వ మాయనకు లాగే మనకూ అబ్బుతుంది. బ్రహ్మాధిపతిః బ్రహ్మమంటే వేద వాఙ్మయం. భౌతిక జగత్తుకే గాక వైజ్ఞానిక జగత్తుకు కూడా అధిపతులమే మనం. బ్రహ్మణోధిపతిః - నిరంతర వేదాధ్యయన శీలుడైన బ్రహ్మ దేవుడికి కూడా అధిపతులమే కాగలం. ఆయన బ్రహ్మ కధిపతి అయితే తత్సాయుజ్యం పొందిన బ్రహ్మవేత్త మాత్రం కాలేడా. బ్రహ్మ శివోస్తు - బ్రహ్మేమిటి శివుడేమిటి అంతా మన స్వరూపంలో చేరిపోయేదే కాబట్టి అలాటి పరిపూర్ణ బ్రహ్మానుభవం పొందగలిగితే సదా శివోమ్. ఎప్పటికీ మనం శివ స్వరూపంగానే నిలిచిపోగలం.

ఇక్కడికి మంత్రపుష్పం సమాప్తమయింది. ఓంకారంతో ప్రారంభమయింది. మరలా ఓంకారంతో సమాప్తమయింది. అక్కడ ఓం హంస రూపంగా మనలో ప్రవేశించి ఇక్కడ అదే సోహం రూపంగా దానికి మూలమైన బ్రహ్మ సాయుజ్యాన్ని మన కందించింది. సాధకుడి

Yallamraju Srinivasa Rao
www.advaitavedanta.in

మననం వల్ల పుష్ప మిప్పటికి ఫలించింది. మంత్రమే పుష్పమని చెప్పాము. అది దేవుడికి సమర్పించే పుష్పమను కొంటున్నారేమో. బాహ్యమైన క్రియ అది. కాని దాని ఆంతర్య మాలోచిస్తే ఇంత దూరముంది దాని భావం. పురుష సూక్తం అధోముఖంగా సృష్టిని వర్ణించి చివర కూర్ధ్వముఖంగా దాన్ని లయం చేసుకొనే మార్గం సంగ్రహంగా సూచన చేసింది. పోతే మంత్ర పుష్పం లయమనేది ఎందులో చేసుకోవాలో సాధకుడా పురుష తత్త్వాన్ని ముందు పేర్కొని మనమున్న ఈ అధో భూమిక నుంచి ఆ ఊర్ధ్వ ముఖంగా మనమెలా ప్రయాణం చేయాలో దాన్ని మనకు విపులంగా వర్ణించి చూపుతున్నది. మొత్తానికి రెండూ కలిసి మనకున్న జీవిత సమస్య ఏదో అది మనకెందు వల్ల సంక్రమించిందో దాన్ని మరలా పరిష్కరించుకొనే మార్గమేదో నిరూపించి మన జీవితానికి నిఃశ్రేయస ఫలాన్ని ప్రసాదిస్తున్నాయి.

**ఓమ్**

**తత్స**

**ద్బ్రహ్మార్పణ**

**మస్తు**

Yallamraju Srinivasa Rao
www.advaitavedanta.in